

పూజ్యులు

సంత్ శ్రీ ఆశారామ్‌జీ బాపూగారు

Karma ka Akatya Siddhant (Telugu)

# కాదనలేని కర్మ సిద్ధాంతం

# కాదనలేని కర్మ సిద్ధాంతం

Karma Ka Akatya Sidhanth (Telugu)

**ప్రాత: స్మరణీయులు, పూజ్యులు**

**సంత్ శ్రీ ఆసారామ్‌జీ బాపూగారి సత్‌సంగ ప్రవచనాలు**

**మరియు శాస్త్రాల నుండి సంకలనం చెయ్యబడిన**


వివరాలకు : శ్రీ యోగ వేదాంత సేవా సమితి

సంత్ శ్రీ ఆశారామ్‌జీ ఆశ్రమం, సంత్ శ్రీ ఆశారామ్‌జీ బాపూ ఆశ్రమ మార్గ్,
అహ్మదాబాద్ - 380 005, ఫోన్ : (079) 39877788, 3293336

సంత్ శ్రీ ఆశారామ్‌జీ ఆశ్రమం, శంషాబాద్, ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్ట్
దగ్గర, జి॥రంగారెడ్డి (T.S.), ఫోన్.నెం : 9393783780

సంత్ శ్రీ ఆశారామ్‌జీ సాహిత్య కేంద్రం, 3-6-240, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500029, ఫోన్.నెం : 040-23226680

**E-Mail : ashramindia@ashram.org    Web-Site : www.ashram.org**

Owned by : Mahila Utthan Trust

Rs. 6/-

# ప్రస్తావన

కర్మ సిద్ధాంతం కాదనలేనిది. ఎవరు ఎటువంటి పనిచేస్తే అటువంటి ఫలితాన్నే పొందుతారు. రాజు కానీ, పేదకానీ, సేఠ్‌కానీ, నౌకరు కానీ; సాక్షాత్తూ ఆ భగవంతుడే అవతారమెత్తి రానీ గాక! కాదనలేని ఈ కర్మసిద్ధాంతాన్ని ఆయన సైతం స్వీకరించక తప్పదు.

పూజ్య బాపూజీ అంటారు, "మీరు కర్మ చేయడంలో జాగ్రత్తగా ఉండాలి. మిమ్మల్ని బంధించి నరకాలకు తీసుకొనిపోయే కర్మలు చెయ్యరాదు. అయితే ఇప్పుడు మీకు లభించిన పూర్వజన్మల ఫలాన్ని మాత్రం సంతోషంగా పొందండి. అది తీయగా ఉండనీ, చేదుగా ఉండనీ – సంతోషంగా దాన్ని గడిచిపోనివ్వండి. తీయని ఫలాలకు ఆకర్షితులైనారో ఆసక్తి కలుగుతుంది. చేదు ఫలాలతో సంఘర్షణ పడ్డారో చేదు ఇంకా పెరుగుతుంది. అందుచేత అదంతా గడిచిపోన్వివండి.

**గడిచిందేదో గడిచిపోయింది, తలరాతను నిందించడమేల?**

**విల్లును విడిచిన బాణం గురించి చింతించడమేల?**

మొదట ఆచరించిన కర్మల ఫలితం ఇప్పుడు లభిస్తూ ఉంటే దానిని గడిచిపోనివ్వండి. అది నిజమని నమ్మవద్దు. గంగానదిలో నీరు నిరంతరంగా ప్రవహించి పోతున్నట్లుగానే అన్ని పరిస్థితులూ గడిచిపోతూ ఉంటాయి. సదా సర్వదా నిలిచివుండే పరమాత్మ పట్ల ప్రీతి కలిగి ఉండండి. ప్రవహించిపోయే దానిని ఉపయోగించుకోండి."

ప్రస్తుతం కాదనలేని కర్మ సిద్ధాంతాన్ని మీకు తెలియజెప్పి, మీతో మానవుడి నుండి మహేశ్వరుడిగా మారేలా యాత్ర చేయిస్తుందనే ఆశతో...

**వినమ్రతతో**

**శ్రీ యోగ వేదాంత సేవా సమితి, అహ్మదాబాదు ఆశ్రమం.**

# అనుక్రమణిక


1. గహనా కర్మణో గతి: 5
2. కర్మను ఏవిధంగా చెయ్యాలి? 10
3. కర్మఫలం 14
4. 'నేను సంత్‌గా ఎలా అయ్యాను?' 18
5. ప్రారబ్ధం కడు ప్రబలమైనది ! 21
6. తరువాత పశ్చాత్తాపపడి ఏమి లాభం? 25
7. పూజారి ప్రేతంగా మారాడు 29
8. సంత్‌ని అవహేళన చేసినందుకు దుష్పరిణామం 31
9. 'నేను ఋణం చెల్లించుకోవాలి !' 32
10. 'అక్కడ ఇచ్చి తప్పించుకొని, ఇక్కడ ఇరుక్కుపోయావు !' 35
11. సులేమాన్ ప్రేతం... యథార్థ సంఘటన 37
12. చేసేటప్పుడు జాగ్రత్త ! 44
13. ఎక్కడ ఆసక్తి ఉంటుందో అక్కడే జన్మ 46
14. రావణుడి కూతురి వివాహం 48
15. 'బంధుత్వాలు మృత్యువుతోనే చెల్లు...!' 53
16. శుభకర్మలు వ్యర్థంగా పోవు 54
17. కర్మఫలం సీతమ్మకూ తప్పలేదు 58
18. 'తిట్లు తిడుతూ కర్మఫలాన్ని తగ్గించుకుంటుంది...' 61
19. కర్మవిధానం 66

# గహనా కర్మణో గతిః

కర్మ అనేది అత్యంత గహనమైనది అనగా నిగూఢమైనది.

**కర్మణో హ్యాపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః ।**
**అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః ॥**

'కర్మ స్వరూపాన్ని తెలుసుకోవాలి. అకర్మ స్వరూపాన్ని తెలుసుకోవాలి. వికర్మ స్వరూపాన్ని కూడా తెలుసుకోవాలి. ఎందుకంటే కర్మ అతి నిగూఢమైనది.'

**(భగవద్గీత : 4.17)**

కర్మ అనేది ఎలా చెయ్యాలీ అంటే ఆ కర్మ వికర్మగా మారకూడదు, దోషపూరితంగా, బంధనకారకంగా మారకూడదు. అకర్మలా మారాలి, కర్త అకర్తగా మారాలి. తన పరమాత్మ పదాన్ని పొందాలి.

అహ్మదాబాదులో 'వాస్ణా' అనే ప్రదేశమున్నది. అక్కడ ఒక ఇంజనీరు ఉన్నాడు. అతడు నీటిపారుదల వ్యవహారం నిమిత్తం నియమించబడ్డాడు. ఏయే ప్రాంతానికి ఎంతెంత నీరు పారాలి అనే విషయంలో అతడే ఆదేశాలను జారీచేసేవాడు.

ఒకసారి అతడికి ఒక రైతు కవరులో వంద రూపాల నోట్లు పది ఉంచి, ఇస్తూ, "అయ్యా! ఏమైనా సరే ఫలానా వ్యక్తికి మాత్రం నీళ్ళు అందకూడదు. నాకీ పని చేసి పెట్టండి చాలు." అని అన్నాడు.

"వెయ్యిరూపాయలు అందాలని నాకు రాసిపెట్టి ఉన్నది కాబట్టే ఇతడు ఇస్తున్నాడు. కానీ తప్పుడు పద్ధతిలో ఈ రూపాయలు తీసుకొని కర్మబంధనాలలో పడడం దేనికి? వెయ్యి రూపాయలు నిజంగా నాకు రావాలంటే, ఎలాగైన సరే వస్తాయి. నేను చేసిన మంచి పనుల వలన రూపాయలు వాటంతట అవే వస్తాయి." అనుకొని ఆ ఇంజనీరు వెయ్యి రూపాయలను ఆ రైతుకు తిరిగి ఇచ్చేశాడు.

కొద్ది నెలల తరువాత ఒకసారి ఆ ఇంజనీరు ముంబయి నుండి తిరిగి వస్తున్నాడు. ముంబయిలో ఒక వ్యాపారి కొడుకు కూడా అతడితో పాటు

కూర్చొన్నాడు. అతడు సూరత్ స్టేషను వచ్చిన తరువాత దిగే తొందరలో తన సంచిని రైలుబండిలోనే మరిచిపోయి దిగిపోయాడు. సంచి ఆ కుర్రవాడిదేనని ఇంజనీరు గ్రహించాడు. అహ్మదాబాదు రైల్వేస్టేషనులో బండి ఆగింది. ఆ సంచి అలానే పడి ఉంది. మన ఇంజనీరు ఆ సంచి తీసుకొని ఇంటికి వెళ్ళి తెరిచి చూశాడు. లోపల ఉన్న చిరునామా, టెలిఫోను నంబరు తీసుకొన్నాడు.

ఇక్కడ సూరత్‌లో ఆ వ్యాపారి కొడుకు కంగారుపడి పోతున్నాడు. "దానిలో వజ్రాలవ్యాపారి డబ్బు ఉంది... కొన్ని లక్షల రూపాయల విలువచేసే సరుకు కూడా ఉంది. ఎవరికి చెప్పాలి? చెప్పినా ఇబ్బందే కదా!" అనకొంటున్నాడు. రెండోరోజు ఉదయాననే ఫోను వచ్చింది:

"మీ సంచి రైలునోనే ఉండిపోయింది. దాన్ని నేను తీసుకొని వచ్చాను. ఇదిగో నా చిరునామా, వచ్చి తీసుకెళ్ళండి." అని.

తండ్రి కొడుకులిరువురూ బండిలో వాస్ణాకు వచ్చారు. ఇంజనీరు బంగళాకి వచ్చి "అయ్యా! ఫోను తమరేనా చేసింది?" అంటూ అడిగారు.

"నేనే! మీరు నిశ్చింతగా ఉండండి. మీ సామాను అంతా సురక్షితంగానే ఉంది."

అంటూ ఇంజనీరు ఆ సంచిని ఇచ్చాడు. వ్యాపారి తెరిచి చూడగా లోపల సామాను, సరుకు, డబ్బు యథాతథంగా ఉన్నాయి. 'ఇతడు మనిషి కాదు... భగవంతుడు' అనుకొన్నాడు వ్యాపారి. అతడి కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి. వెంటనే కవర్లో కొంత డబ్బు పెట్టి అది ఇంజనీరు గారి పాదాలపై పెట్టి చేతులు జోడిస్తూ, "అయ్యా! ఇది పుష్పం కాదు, పూరేక అనుకోండి. మా కోసం ఇది మీరు తప్పక స్వీకరించాలి." అన్నాడు.

"వెయ్యి రూపాయలు ఉంచారు కదా!" అన్నాడు ఇంజనీరు.

"అయ్యా! వెయ్యి రూపాయలే పెట్టినట్లు ఎలా తెలుసు మీకు?" అడిగాడు వ్యాపారి.

"ఒక చెడుకర్మ చేస్తే నాకు వెయ్యిరూపాయలు వచ్చేవి. కానీ నిజంగా

వెయ్యిరూపాయలు నాకు రావాలని రాసిపెట్టి ఉంటే, ఎలాగైనా వస్తాయి కదా! అనుకొని నేను ఆ చెడు కర్మ చెయ్యలేదు.” అన్నాడు ఇంజనీరు.

“మీరు చెప్పేది నిజం. ఇందులో సరిగ్గా వెయ్యిరూపాయలే ఉన్నాయి.” అన్నాడు వ్యాపారి.

అడ్డదిడ్డమైనదారుల నుండి సంపాదించిన వాళ్ళు దుష్కర్మలు చేసిన పాపం అనుభవిస్తారు. కానీ సావధానంగా, నిజాయితీగా ఉన్నవాళ్ళు తమకు రాసిపెట్టి ఉన్నదంతా పొందుతారు.

**‘గహనా కర్మణో గతి:’** అని చెప్పాడు శ్రీకృష్ణుడు.

ఒక పేరున్న సాధువు నాకీ సంఘటన చెప్పాడు.

“బాపూజీ! ఇక్కడ గయా క్షేత్రంలో ఒక గొప్ప ప్రసిద్ధి చెందిన పండితుడు ఉన్నాడు. ఒకసారి నేపాల్‌రాజు సామాన్యమైన బీద మార్వాడీలాగా బట్టలు వేసుకొని గయలో పురోహితుల వెంటపడి, “మా తాతగారికి పిండప్రదానం చేయించాలి. నా దగ్గర డబ్బు అస్సలు లేదు. కానీ, ఇదిగో ఈ మూటలో కొన్ని లడ్డూలు ఉన్నాయి. దక్షిణగా ఇవి మాత్రం ఇవ్వగలను’’ అంటూ ప్రాధేయపడసాగాడు.

లోభులైన పురోహితులెవ్వరూ అంగీకరించలేదు. కానీ అక్కడ ప్రసిద్ధి చెందిన ఈ పండితుడు మాత్రం ‘రా నాయనా! డబ్బుకేం ఫరవాలేదులే. నేను పిండ ప్రదానం చేయిస్తా’నన్నాడు.

చిరిగిపోయిన బట్టలతో, బీద మార్వాడీ వేషంలో ఉన్న ఆ నేపాల్‌రాజు చేత ఆయన తాతగారికి పిండ ప్రదానం చేయించాడు ఆ పండితుడు. సరే, పిండ ప్రదానం అనంతరం ఎంతో కొంత దక్షిణ ఇవ్వాలి కదా... ఇదిగోండి నా దగ్గర ఈ లడ్డూలు ఉన్నాయి. నేను వెళ్ళిన తర్వాతే ఈ మూట విప్పండి... అలా చేస్తానని నాకు మాటివ్వండి.” అన్నాడు.

“సరేలే నాయనా! నువ్వా పేదవాడివి... నీ లడ్డూలు నేనే తింటాను... ఈ మూట కూడా నేనే విప్పుతాను... సరేనా” అన్నాడా బ్రాహ్మణుడు.

నేపాల్ రాజు వెళ్ళిపోయాడు. ఆ పురోహితుడు మూట విప్పగానే అందులో నుండి ఒక్కొక్క కిలో బరువు తూగే పందొమ్మిది బంగారు లడ్డూలు బయటపడ్డాయి.

ఆ బ్రాహ్మణుడు తన జీవితకాలమంతా గొప్ప గొప్ప ధర్మకార్యాలు చేస్తూ వచ్చాడు. కానీ ఆ బంగారు లడ్డూలు ఖర్చు కానే కాలేదు.

మంచి పని చేసేవాడి వద్దకు ఎక్కడి నుండి అయినా సరే ఆ మంచి కర్మల నిమిత్తం ధనం, వస్తు-సంపదల సునాయాసంగా వస్తాయి. అందుచేత ఆ పందొమ్మిది కిలోల బంగారు లడ్డూలు అలాగే పడి ఉన్నాయి.

మనం ఎప్పుడు కర్మను ఆచరించినప్పటికీ ఆ కర్మను అకర్మగా మలచుకోవాలి. అంటే కర్మ ఫలాన్ని భగవంతుడికి అర్పించి కర్మలో నుండి కర్తృత్వ భావాన్ని తప్పించి వేసినట్లయితే కర్మ ఆచరిస్తున్నప్పటికీ అది అకర్మయే కాగలదు. కర్మ ఆచరించాం. కానీ దాని బంధనం మాత్రం లేదన్నమాట.

ప్రాపంచిక మనుష్యుడు కర్మను బంధన కారకంగా మార్చి వేస్తాడు. సాధకుడు కర్మను అకర్మగా మార్చే ప్రయత్నం చేస్తాడు. కానీ సిద్ధపురుషుని ప్రతి ఒక్క కర్మ సహజంగానే అకర్మయై ఉంటుంది. అనగా అతడు చేసే యుద్ధం వంటి కర్మ సైతం అకర్మగానే ఉంటుంది. మీరు కూడా కర్మ ఆచరించినట్లయితే అకర్తగా ఉండి మాత్రమే ఆచరించాలి. కర్తగా మారి కాదు. కర్తాభావంతో చేసిన కర్మ బంధనాల్లో పడేస్తుంది. ఆ ఫలితాన్ని అనుభవించక తప్పదు.

రాజస్థాన్‌లో డోంగరా గ్రామం (సుజాన్‌గఢ్ తాలుకా, చురు జిల్లా) లో జరిగిన సంఘటన:

ఒక మేకను చూసిన ఠాకూర్ గారి భార్యకు నోట్లో నీళ్ళూరాయి. ఆవిడ తన భర్తతో, “చూడండి. ఆ మేక ఎంత బలంగా ఉందో.” అని చెప్పింది.

ఆ మేక ఠాకూర్ కిషన్ సింహ్ గారి ఇంటికి చేరింది. ‘క్రైమా’గా మారి వారి పొట్టలలోకి కూడా చేరింది.

పన్నెండు మసాల తరువాత ఠాకూర్ గారి ఇంట మగశిశువు జన్మించాడు. ఆ పిల్లవాడికి ‘బాలసింహ్’ అనే పేను పెట్టారు. పదమూడేళ్ళు నిండిన తరువాత

అతడికి లగ్నం కుదిరింది. పదునాలుగో ఏట వస్తూనే వివాహం ఏర్పాట్లు కూడా జరిగిపోయాయి.

వివాహ సమయంలో బ్రాహ్మణుడు గణపతి పూజ కోసం పిల్లవాడిని కూర్చోబెట్టాడు. కానీ ఆయన పూజ ప్రారంభించడానికి ముందే పిల్లవాడు కాళ్ళను బారగా చాపి, గుడ్లు తేలేశాడు. 'అయ్యో... అయ్యో... ఇదేమిటి?" అంటున్నాడు బ్రాహ్మణుడు.

జవాబులేదు. తల్లి రోదించింది. తండ్రి ఏడ్చాడు. పెళ్ళివారంతా గుమికూడారు. 'ఏమైందని' అడిగారు.

ఆ పిల్లవాడు అన్నాడు, "ఏమీ లేదు. మీకూ నాకూ ఋణం తీరిపోయింది."

తండ్రి, "అదెలా నాయనా?" అని అడిగాడు.

"ఆడమేకలకు గర్భాధాన నిమిత్తమై 'ఉదరాసర్' లోని 'కువర్‌దాన్' ఏ మేకపోతును వదలిపెట్టాడో దానినే మీరు భార్య కోరిక ప్రకారం తెచ్చారు. అదే మేక ఆమె గర్భాన ప్రవేశించింది. నీ పిల్లవాడిగా జన్మించింది. ఇచ్చి పుచ్చుకోవడాలన్నీ పూర్తి కాగానే ఆ పిల్లవాడినైన నేను ఇప్పుడు వెళ్ళిపోతున్నాను. రాం... రాం..."

అంతే, మేకపోతు శరీరం నుండి వచ్చిన బాలసింహ్ ప్రయాణమై తరలిపోయాడు. పాపం, కిషన్‌సింహ్ తల బాదుకొంటూ ఉండిపోయాడు.

అందుకే తులసీ దాసుగారు అంటారు:

**కరమ్ ప్రధాన్ బిస్వ కరి రాఖా । జో జస్ కరయి తో తస్ ఫలు చాఖా ॥**

**(శ్రీరామ్ చరిత మానస్. అయోధ్య కాండ : 218.2)**

భగవంతుడైన శ్రీరామచంద్రుడు ప్రపంచంలో కర్మనే ప్రధానంగా చేసి ఉన్నాడు. ఎవరు ఏ విధమైన కర్మ ఆచరిస్తే వారికి అదే విధమైన ఫలితం కలుగుతుంది.

❀

# కర్మను ఏ విధంగా చెయ్యాలి?

శ్రీమద్భగవద్గీత మూడో అధ్యాయం 'కర్మయోగం'లో శ్రీకృష్ణ భగవానుడు అర్జునునితో ఈ విధంగా చెబుతున్నాడు.

**తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర ।**
**అసక్తో హ్యా చరన్కర్మ పరమాప్నోతి పురుషః ॥**

'నీవు నిరంతరం ఆసక్తి రహితుడవై సదా కర్తవ్యకర్మను చక్కగా ఆచరిస్తూ ఉండు. ఎందుకనగా ఆసక్తి రహితుడై కర్మను ఆచరించే మనుష్యుడు పరమాత్మను పొందగలుగుతాడు. **(గీత: 3.19)**

గీత యందు పరమాత్మ ప్రాప్తికై మూడు మార్గాలు చెప్పడం జరిగింది. జ్ఞాన మార్గం, భక్తిమార్గం, నిష్కామ కర్మ మార్గం.

శాస్త్రాలలో ముఖ్యంగా రెండు విధములైన కర్మలను వర్ణించడం జరిగింది. విహిత కర్మ, నిషిద్ధ కర్మ. ఏయే కర్మలు చేయవలసిందిగా శాస్త్రాలు ఉపదేశించాయో వాటిని 'విహిత కర్మ'లనీ, ఏయే కర్మలు చేయరాదని శాస్త్రాలలో చెప్పబడిందో వాటిని 'నిషిద్ధ కర్మల'నీ అంటారు.

హనుమంతుడు శ్రీరామకార్యం నిమిత్తంగా లంకనే దహించివేశాడు. ఇది విహితకార్యమే. ఎందుకంటే ఆయన తన స్వామిని సేవించే కార్యనిమిత్తంగానే లంకను దహించివేయడం జరిగింది. కానీ ఆయనను చూసి జనమంతా ఒకరి ఇల్లును మరొకరు తగలబెట్టుకొంటూ పోతే అది అధర్మమూ, విశృంఖలత్వమూ అవుతుంది.

మనం ఏయే కర్మలు చేస్తామో ఆయా లోకాలను పొందడం జరుగుతుంది. అందుచేత అశుభకర్మలను త్యజించి ఎల్లప్పుడూ శుభకర్మలే ఆచరించాలి.

మనకేగాక ఇతరులకు సైతం సుఖశాంతులు కలిగిస్తూ ఆ భగవంతుడ్ని మనకు దగ్గరచేసేవే శుభకర్మలు. క్షణిక సుఖాలను కలిగిస్తూ భవిష్యత్తులో మననూ, ఇతరులనూ భగవంతుడికి దూరం చేసేవి, కష్టాలు కలిగించేవి, నరకానికి తీసుకుపోయేవి అశుభకర్మలు.

చేసిన శుభ అశుభ కర్మలు ఎన్నో జన్మల వరకు మనిషిని వెంటాడుతూనే ఉంటాయి. పూర్వజన్మ కర్మ సంస్కారం అనుగుణంగానే ఆ ఫలితాన్ని మనం అనుభవించవలసి వస్తుంది.

**"గహనాకర్మణో గతి: ।"** కాబట్టి కర్మ విధానం బహు నిగూఢంగా ఉంటుంది. కర్మలకు స్వతంత్ర ప్రతిపత్తి లేదు. అవి జడమైనవి. తాము కర్మలనే సంగతి వాటికి తెలియదు. అవి వృత్తి చేత తెలియబడతాయి. శాస్త్రోక్తమైన విహిత సంస్కారములైతే పుణ్యంగానూ, నిషిద్ధ సంస్కారములైతే పాపంగానూ గోచరిస్తాయి. అందుచేత విహిత కర్మలనే ఆచరించండి. వాటిని కూడా క్రమబద్ధంగా చెయ్యాలి. క్రమబద్ధమైన విహిత కర్మలే ధర్మం.

ఉదయాన్నే త్వరగా మేలుకొని కొద్ది సమయం పరమాత్మ ధ్యానంలో ప్రశాంతంగా గడపడం, సూర్యోదయానికి ముందే స్నానం చేయడం, సంధ్యావందనాది కర్మలు ఆచరించడం ఇవన్నీ ఆరోగ్యం దృష్ట్యా కూడా మంచివి; సాత్త్వికమైన కారణంగా పుణ్యప్రదమైనవి కూడా. కానీ ఎవరి మనస్సులోనైనా విరుద్ధంగా బుద్ధి కలిగి 'ఇంత ఉదయాననే లేచి స్నానం చేసి ఏం చెయ్యాలి?' అనుకొంటారు. వీళ్ళు పాపం! సూర్యోదయం తరువాతనే లేస్తారు. లేచీ లేవగానే ముందు పక్కమీద నుండే 'టీ' కావాలంటారు. తర్వాత స్నానం పూర్తి కాకుండానే అల్పాహారం తీసుకొంటారు. శాస్త్రానుసారం ఇవన్నీ నిషిద్ధ కర్మలు. వీళ్ళు వర్తమానంలో సుఖపడుతున్నామని అనుకొన్నప్పటికీ ముందు ముందు శరీరం అధిక రోగాల-శోకాల బారిన పడుతుంది. జాగ్రత్తపడకపోతే తామసగుణ కారణంగా నరక జన్మలలోకి పోవలసి ఉంటుంది.

శ్రీకృష్ణ భగవానుడు గీతలో చెప్పాడు కూడా. "నాకు ఈ ముల్లోకాలలో ఏ విధమైన కర్తవ్యమూ లేదు. నేను పొందవలసిన వస్తువు ఏదీ లేదు. అయినప్పటికీ కర్మయందే నేను సంచరిస్తూ ఉంటాను."

అందుచేత విహితమైన, నియంత్రితమైన కర్మలను ఆచరించండి. శాస్త్రానుసారంగా కర్మలు చేస్తూనే ఉండాలి. అయితే ఆ కర్మలను అంతం అనేది

లేకుండా చేసుకొంటూ పోవడమనేది దీని ఉద్దేశ్యం కాదు. పరమాత్మ కోసం ఘడియ సమయం కూడా ఖాళీ లేనంతగా కర్మ విస్తారంగా ఉండరాదు. స్కూటరు స్టార్టు చేసేందుకు 'కిక్' కొట్టాలి. కానీ స్టార్టయిన తరువాత కూడా 'కిక్' కొడుతూ ఉండే మూర్ఖుడు మాత్రం ప్రపంచంలో ఎవడూ ఉండడు కదా!

అందుచేత కర్మలు ఆచరించండి. కానీ కేవలం ఆత్మజ్ఞానాన్ని పొందడానికి, పరమాత్మ సుఖాన్ని పొందడానికి మాత్రమే కర్మలు ఆచరించబడాలి. అనాసక్తులై కర్మ చెయ్యండి. సాధనగా భావించి కర్మ చెయ్యండి. భగవత్ పరాయణమైన కర్మ. అది కర్మ అయినప్పటికీ ఆ భగవంతుని పొందడంలో సహాయకారి కాగలదు.

మీరు ఏదైనా కార్యాలయంలో పని చేస్తూ వేతనం తీసుకొంటున్నారంటే అది కేవలం ఉద్యోగమే అవుతుంది. కానీ ఏదైనా ధార్మిక సంస్థలో మీరు అదే పనిచేస్తూ వేతనం తీసుకోకుండా ఉంటే ఆ కర్మయే 'ధర్మం' అవుతుంది.

"ధర్మ తేం బిరతి యోగ తేం గ్యానా... ధర్మం వలన వైరాగ్యం కలుగుతుంది. వైరాగ్యం వలన మనిషి విషయభోగాలలో పడి నశించే వృత్తి తగ్గుతుంది. ప్రపంచం ఎడల మీకు వైరాగ్యం కలిగితే మీరు ధర్మమార్గంలోనే ఉన్నారని తెలుసుకోండి. ప్రపంచం పట్ల రాగం (ప్రేమ) కలుగుతుంటే అధర్మమార్గంలో వెళుతున్నట్లుగా తెలుసుకోండి.

విహిత కర్మ ద్వారా ధర్మం జనిస్తుంది. ధర్మం నుండి వైరాగ్యం జనిస్తుంది. ప్రారంభంలో మిమ్మల్ని అటూ ఇటూ భ్రమింపజేసిన రాగప్రవృత్తి ఇప్పుడు శాంత స్వరూపంగా మారి 'యోగం' అవుతుంది. యోగంలో వృత్తి ఒక్కసారిగా సూక్ష్మమమై అది ఋతంభరా ప్రజ్ఞగా మారుతుంది.

విహిత సంస్కారాలు ఉండి, వృత్తి సూక్ష్మంగా ఉండి, బ్రహ్మవేత్తలయిన సద్గురువు వచనాల పట్ల శ్రద్ధ ఉన్నట్లయితే బ్రహ్మ సాక్షాత్కారం పొందడానికి ఆలస్యం జరగదు.

ప్రాపంచికులు విషయభోగాలను పొందడానికి ఎన్ని నిషిద్ధ కర్మలు చేసినా, భోగాలను భోగించినా ఆ భోగాలనంతరం ఖిన్నత్వం, బహిర్ముఖత్వం, రోగం

తప్ప ఏమైనా లాభం కలుగుతున్నదా చెప్పండి? విహిత కర్మల ద్వారా లభించే భగవత్ సుఖం అనేది అంతరాత్మకు అనంతసుఖాన్ని ఇస్తుంది.

బ్రహ్మవేత్తలైన మహాపురుషుల ఉనికి మాత్రముననే కాదగిన కర్మలు వాటంతట అవే జరుగుతాయి. కాకూడని కర్మలు వాటంతట అవే ఆగిపోతాయి. పరమాత్మ ద్వారా పొందిన కర్మలనాచరించే శక్తిని సద్వినియోగ పరుచుకొంటూ పరమాత్మను పొందే వివేకవంతుడు సమస్త కర్మబంధనాల నుండి విముక్తి పొందగలడు.

'గీత'లో భగవంతుడు ఇలా చెప్పాడు: బ్రహ్మజ్ఞానియగు మహాపురుషుడికి ఈ విశ్వంలో కర్మను ఆచరించినందు వలన ఏ ప్రయోజనమూ ఉండదు. కర్మను ఆచరించనందు వలన కూడా ఎటువంటి ప్రయోజనమూ ఉండదు. వారు కర్మను ఆచరిస్తారు. కానీ కర్మబంధన రహితులుగానే ఉంటారు.

ఒక బ్రహ్మజ్ఞాని 'పంచదశి' చదువుతున్నాడు. ఎవరో ఆయనతో, "స్వామీ! మీరు బ్రహ్మజ్ఞానులు, జీవన్ముక్తులు, మీకు శాస్త్రాలు చదవవలసిన అవసరమేముంది? మీరు మీ ఆత్మానందంలో ఆనందంగా ఉన్నారు కదా! ఇక పంచదశి చదవవలసిన అవసరమేముంది?" అన్నారు. దానికి ఆయన, "శాస్త్రాలలో నా మహిమను గురించి ఎలా వర్ణించారో చూస్తున్నా." అన్నాడు.

తమ కార్యశక్తిని సద్వినియోగం చేసుకొని బ్రహ్మానందం పొందిన బ్రహ్మవేత్తలు ఆ బ్రహ్మ వేరు వేరు కారు. బ్రహ్మవిష్ణు మహేశ్వరులు వారికి తమ స్వరూపంగా కనబడతారు. వారు బ్రహ్మగా మారి జగత్ సృష్టి చేస్తారు. విష్ణువుగా మారి పాలన చేస్తారు. రుద్రుని వలె సంహారం కూడా చేస్తారు.

మీరు సైతం మీలోని కార్యశక్తిని వినియోగించుకొని అమరపదం పొందండి. ఏమి చేసినా, ఆ ఈశ్వరుని పొందడం కోసమే చేయండి. మీ అహంకార మమకారాలను ఆత్మ పరమాత్మలో లీనం చేసి పరమ ప్రసాదంలో పవిత్రులై సాగండి...

❀

# కర్మ ఫలం

శ్రీకృష్ణ భగవానుడు ఇలా చెబుతున్నాడు:

**జరామరణమోక్షాయ మామాశ్రిత్య యతన్తి యే ।**

**తే బ్రహ్మ తద్విదు: కృత్స్నమధ్యాత్మం కర్మ చాఖిలమ్ ॥**

'నా శరణువేడి జరా మరణముల నుండి తప్పించుకొను ప్రయత్నము చేయు పురుషులు ఆ బ్రహ్మను, సంపూర్ణ ఆధ్యాత్మిక తత్త్వమును, సంపూర్ణ కర్మను ఎరుగుదురు.' **(గీత: 7.29)**

"కర్మలు జడమైనవే... కర్తకు ఆ భావన అనుసారంగానే ఫలితం లభిస్తుంది..." అని తెలుసుకోవడమనేది కర్మలను అఖిలరూపాత్మకంగా, సంపూర్ణ రూపంగా అవగతం చేసుకోవడమవుతుంది.

కర్మకు తాను కర్మనని తెలియదు. శరీరానికి తాను శరీరమని, ఇంటికి తాను ఇంటిననీ తెలియదు. యజ్ఞానికి తాను యజ్ఞమని తెలియదు. ఎందుకని? ఎందుకంటే అన్నీ జడమే అయినప్పటికీ కర్త ఏ భావనతో, ఏ విధితో ఆ కార్యాలు చేస్తాడో అది అలాంటి ఫలితాన్నే ఇస్తుంది.

ఎవరైనా దుష్టుడు మీకు చాకు చూపెడితే, మీరు వాడి మీద పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేస్తారు. ఎవరైనా మిమ్మల్ని కొడతామని బెదిరించినా సరే మీరు అతడికి వ్యతిరేకంగా కేసుపెడతారు. కానీ డాక్టర్ మాత్రం మిమ్మల్ని బెదిరించడు, చాకు చూపించడు. పైగా అదే చాకుతో మీ శరీరానికి గాట్లు పెడతాడు, దానిని కోస్తాడు. అయినా మీరు అతడికి ఫీజు ఇస్తారు. ఎందుకని? ఎందుకంటే అతడి ఉద్దేశ్యం మంచిది. రోగిని బాగుచేయడం అతడి యొక్క ఉద్దేశ్యం, ప్రతీకారం తీర్చుకోవడం కాదు. మీరు కూడా ఇదేవిధంగా మీరు కూడా మీ కర్మల ఉద్ధేశ్యాన్ని మార్చుకోండి.

భోజనం తయారు చేయండి. కానీ మీ ఆనందం కోసం కాదు. ఆ పరమాత్ముడిని ప్రసన్నం చేసుకొనేందుకు మాత్రమే. కుటుంబం కోసం, భర్త కోసం, పిల్లల కోసం, భోజనం వండితే అది లౌకికమైన కర్మ మాత్రమే. కానీ

'కుటుంబీకులలోనూ, భర్తలోనూ, పిల్లలలోనూ అంతర్గతంగా ఆ పరమాత్మయే ఉన్నాడు...' అని భావించి భగవంతుని ప్రసన్నత కొరకు భోజనాన్ని తయారుచేసినట్లయితే అది భక్తి అవుతుంది, పూజ అవుతుంది, ముక్తిని కలిగించేటటువంటిదవుతుంది.

వస్త్రాలను ధరించడమనేది శరీర రక్షణ కోసం, మర్యాదను కాపాడుకొనేందుకు మాత్రమే కావాలి. కానీ ఆనందం కోసం, ఫ్యాషన్ల కోసం వస్త్రాలను ధరించి జులాయిగా తిరుగుతూ ఉంటే ఆ వస్త్రాలు ధరించడమనే కర్మ కూడా బంధనకారకమే అవుతుంది.

ఇదే విధంగా పిల్లవాడిని పెంచి పోషించి చదువు చెప్పించడం... ఇదంతా మంచిదే కానీ 'వీడు పెరిగి పెద్ద అయిన తరువాత నాకు సుఖాన్ని ఇవ్వాలి...' అనుకొనే భావం బంధనమే కాగలదు.

సుఖాన్ని ఆశ్రయించకండి. కర్మ చేయండి... కర్తవ్యంగా భావించి చేస్తే మంచిదే. అయితే భగవంతుని ప్రీతి కోసం ఆ కర్మను చేసినట్లయితే అది కర్మగా కాకుండా సాధనగా, పూజగా అవుతుంది.

ఊహించుకోండి: ఇద్దరు మనుష్యులు క్లర్కులుగా పని చేస్తున్నారు. ఇద్దరికీ మూడు నాలుగు వేలరూపాయాలు నెలకు వేతనంగా వస్తుంది. ఒకడు పనిచేసే కళ తెలిసినవాడైతే, రెండవవాడు కర్మను బంధనంగా చేసుకొన్నవాడు. ఈ రెండవవాడింటికి వాళ్ళ చెల్లెలు తన పిల్లలతోనూ భర్తతో సరిపడక వచ్చేసిందనుకోండి. అప్పుడు అతడు, "ఒకవైపు ధరలు..., 500/–లు ఇంటి అద్దె, ఇంకా పాల బిల్లు, కరెంటు బిల్లు, పిల్లలని చదివించడం...' పైగా ఇది ఇద్దరు పిల్లలతో వచ్చి పడిందే... ఏం చెయ్యడం? చచ్చాన్రా బాబోయ్..." అనుకొంటూ రేయింబవళ్ళు ఇదే ఆలోచిస్తూ దు:ఖపడతాడు. తన పిల్లలని కొడతాడు. భార్యని గుడ్లురుముతాడు. ఒక్కోసారి చెల్లెల్ని కూడా తిడతాడు. అతడు ఖిన్నుడై కర్మ చేస్తున్నాడు... బానిసత్వం చేస్తున్నాడు... బంధనాలలో పడిపోతున్నాడు.

సరే, మొదటి వ్యక్తి వద్దకు అతడి చెల్లెలు ఇద్దరు పిల్లలతో వచ్చిందనుకోండి. అప్పుడతడు, "నువ్వు సంకోచపడకమ్మా! బావగారి మనస్సు అలా మారిందని బాధపడకు. ఆ ఇల్లూ నీదే... ఈ ఇల్లుకూడా నీదే అనుకో. ఈ అన్నయ్య నీ వాడే అనుకో." అంటాడు.

చెల్లెలు: "అన్నయ్యా! నేను నీకు భారంగా వచ్చిపడ్డానా?"

అన్న: "లేదు, లేదు భారమేముంది? పిల్లలు నన్ను 'మావయ్యా' అని పిలిస్తే ఎంతో సంతోషంగా ఉంటుంది... ధరలు పెరిగితే పెరగనీ! కలిసి ఉన్నదేదో తిందాం. ఈ రోజులిలా గడిచిపోతాయి... చెల్లీ! సంకోచించవద్దు, నాకు భారమయ్యావని అనుకోవద్దు. భారం ఏముంటుంది. భగవంతుడు నాకీ అవకాశమిచ్చాడనుకొంటాను." అంటాడు.

ఇతడు చెల్లెలి మన్ననలు పొందుతాడు, భార్య కృతజ్ఞతకు పాత్రుడవుతాడు. తల్లి దీవెనలు అందుకొంటాడు. తన అంతరాత్మను సంతోష పెడతాడు. రెండవవ్యక్తి బాధలతో కుంగిపోతూ తల్లి ఛీత్కారాలు, భార్యచేత అవమానాలు, చెల్లిచేత శాపనార్థాలు పొందుతున్నాడు.

ఇద్దరూ ఒకే విధమైన కర్మ చేస్తున్నారు. కానీ ఒకరు ప్రసన్నంగా, భగవంతుని సేవగా భావించి చేస్తూ ఉంటే, రెండవవాడు ఖిన్నుడై, భారంగా భావించి చేస్తున్నాడు. కర్మ అదే అయినప్పటికీ భావనలో తేడా ఉండడం వలన ఆ తేడానే ఒకరిని దు:ఖితుడిగా మరొకరిని సుఖజీవిగా తయారు చేసింది. అందుచేత ఎవరు ఏ విధంగా పని చేస్తే ఆ విధమైన ఫలితమే పొందుతారు.

జలియన్‌వాలాబాగ్‌లో జనరల్ డయ్యర్ ఎంత ఘాతుకం జరిపించాడు, ఎంతమందిని చంపించాడు! ఎందుకంటే 'ఈ విధంగా స్వంతంత్రం కోసం నినాదాలను చేసేవారిని ఇక్కడ నాశనం చేసేస్తే నాకు పేరు వస్తుంది, పదోన్నతి కలుగుతుంది.' అని ఆలోచించడం వలన. కానీ పేరు, పదోన్నతి అలా ఉంచి తిట్లూ-శాపనార్థాల వర్షం కురిసింది అతడిపై. అతడిని రాజీనామా చేయమన్నారు, ఉద్యోగంలో నుండి తీసేసి, రాజమహలు నుండి బయటకు పంపేశారు. చివరికి

భారతీయులను హత్యచేసిన ఆ హంతకుడిని సాహసవీరుడైన ఉద్ధమ్‌సింగ్ తుపాకీతో కాల్చి నరకానికి పంపించాడు. చనిపోయాక కూడా ఎన్ని వేల సంవత్సరాలు అతడు ప్రేతజన్మలో తిరుగుతాడో భగవంతుడికే ఎఱుక!

జపాన్‌లోని హిరోషిమా-నాగసాకి నగరాలపై అణుబాంబు వేసిన మేజర్‌టామ్ ఫెరేబీకి సైతం దుర్గతి పట్టింది. బాంబు జారవిడిచిన తర్వాత ఇంటికి వచ్చిన అతడితో అతడి నాయనమ్మ, "నువ్వు అమానుషమైన కృత్యానికి పాల్పడి వస్తున్నావ"ని అంది. అతడి అంతరాత్మ గ్లానితో నిండిపోయింది. అతడు ఎంత దు:ఖం పొందాడంటే అతడి దు:ఖభరితమైన ఆత్మకథతో చరిత్ర నిండిపోయింది.

మంచి లేదా చెడు కర్మ చేసినప్పుడు దాని ఫలితం వెంటనే రాకపోయినా, హృదయంలో గ్లాని లేదా సుఖశాంతుల అనుభూతి వెంటనే కలుగుతుంది. చెడు లేదా మంచి సంస్కారాలు అప్పుడే మనస్సులో కలుగుతాయి.

అందుచేత చెడు కర్మలు చెయ్యకపోవడమే గాక, మంచి కర్మలు సైతం భగవంతుని ప్రీతిగా చెయ్యడమే మనిషి చెయ్యవలసింది. కర్మ ఆచరించి సుఖం పొందాలనీ, జేజేలు అందుకోవాలనీ కాంక్షించకుండా, సుఖాన్ని అందించాలనీ, భగవంతుని పొందాలనీ భావించుకోండి. ఇలా చేస్తే మీ కర్మలు భగవంతుని ప్రాప్తి కోసమే ఆచరించబడతాయి. ఈ విధంగా భగవంతుని ప్రీతికై చెయ్యబడిన కర్మలు జనన-మరణ బంధనాలలో పడవేయక ముక్తిని అందించడంలో సఫలమవుతాయి.

❀

# నేను సంత్‌గా ఎలా అయ్యాను?

సఖర్ (పాకిస్తాన్)లో సాధుబేలా అనే ఒక ఆశ్రమం ఉంది. 'రమేశ్ చంద్ర' అనే ఒక వ్యక్తికి ఆ కాలానికి చెందిన ఒక సంత్ తన జీవితగాథను చెప్పి ఆ కథను అందరికీ వినిపించమన్నాడు. తాను సంత్ ఎలా అయ్యాడో సమాజానికి తెలియజెప్పమన్నాడు. ఆ రమేశ్‌చంద్ర తరువాత పాకిస్తాన్ వదిలిపెట్టి ముంబయి వచ్చాడు. ఆ సంత్ తనగాథ అతడికి ఇలా చెప్పాడు:

"నేను గృహస్థుగా ఉన్నప్పుడు చాలా కఠినంగా రోజులు గడుస్తూ ఉండేవి. డబ్బు ఉండేది కాదు. ఒక మిత్రుడు పెట్టుబడి పెట్టి ప్రత్తి వ్యాపారం మొదలుపెట్టాడు. నన్ను భాగస్వామిగా చేసుకొన్నాడు. మేము దూదిని కొని దాన్ని ముంబయిలో అమ్మేవాళ్ళం. ఈ వ్యాపారంలో మంచిలాభం రాసాగింది.

ఒకసారి మా మిత్రులిద్దరినీ అక్కడి వ్యాపారస్తుడు లాభంగా వచ్చిన లక్షరూపాయలను తీసుకువెళ్ళమని కబురుచేశాడు. డబ్బు తీసుకొని తిరిగి వస్తున్నాం. దారిలో ఒక సత్రంలో రాత్రిపూట బసచేశాం. అరవై-డెబ్భై సంవత్సరాల క్రితం నాటి మాట. ఆ సమయంలో ఒక లక్షరూపాయలు! అంటే తులం బంగారం అరవై డెబ్భైరూపాయలు ఉండే రోజులు. 'ఈ లక్షలో యాభైవేలు మిత్రుడే తీసుకుపోతాడు కదా!' అనిపించింది నాకు. నిజానికి వ్యాపారంలో పెట్టుబడి మొత్తం అతడే పెట్టాడు. అయినా మిత్రుడనే ఉద్దేశ్యంతో నాకు సగభాగం ఇస్తున్నాడు. కానీ నేను నీతి తప్పాను. పాలల్లో విషం ఇచ్చి చంపేశాను. శవాన్ని వదిలిపెట్టి మా ఊరికి వచ్చేశాను. మిత్రుడి కుటుంబీకులు నా దగ్గరకు వచ్చారు. అప్పుడు నేను కన్నీళ్ళు కార్చి, నాటకమాడి వాళ్ళకు పదివేల రూపాయలు మాత్రం ఇచ్చి "నా ప్రియమిత్రుడు దారిలోనే జబ్బు పడ్డాడు, అకస్మాత్తుగా కడుపునొప్పి మొదలయ్యింది... చాలా చికిత్సలు చేశాం. కానీ ఏం లాభం... మనల్నందరినీ వదిలిపెట్టేసి వెళ్ళిపోయాడు." అంటూ నమ్మ బలికాను. ఆ పదివేల రూపాయలను చూసిన వాళ్ళు "ఇతడెంతో నిజాయితీ పరుడు. ఇరవైవేలు లాభం వచ్చి ఉంటుంది. అందులో సగమైన పదివేలు ఇచ్చేస్తున్నాడు" అని అనుకొన్నారు. వాళ్ళకు నా మాటపై విశ్వాసం కుదిరింది.

ఇక తర్వాత నా ఇంట్లో ధనం తాండవించింది. తొంభైవేలు నా వాటా. ఇక జల్సా చెయ్యడం మొదలుపెట్టాను. నా ఇంట పుత్రుడు జన్మించాడు. నా ఆనందానికి హద్దు లేదు. పిల్లవాడు కొంచెం పెద్ద అయిన వెంటనే ఏదో అలవికాని రోగం బారిన పడ్డాడు. రోగం ఎటువంటిదంటే, భారతదేశంలోని ఏ డాక్టరు వల్లా అది నయం కాలేదు. నాకు చాలా డబ్బు నష్టమైపోయింది. సంపాదించిన ధనమంతా ఖర్చయిపోయింది. చివరికి నిరాశచెంది పిల్లవాడితో సహా ఇండియాకు వచ్చేశాను. నా ఒక్కగానొక్క కొడుకు. ఇక ఏ మార్గమూ లేదు. డాక్టరు, వైద్యుడు, హకీమూ అందరి చికిత్సలూ అయిపోయాయి. రాత్రిపూట నిద్రపట్టేది కాదు, పిల్లవాడు నొప్పితో గిలగిలా కొట్టుకొంటున్నాడు.

ఒకరోజు పిల్లవాడు మూర్ఛవచ్చినట్లు పడిపోయాడు. అతడిని చూసి చాలా కలతపడి ‘నాయనా! ఎందుకిలా రోజు రోజుకూ క్షీణించిపోతున్నావు? నీ కోసం నన్నేం చెయ్యమంటావు? నా గారాల తండ్రీ! మీ నాన్న నీ కోసం కన్నీరు కారుస్తున్నాడ్రా! ఇకనైనా కోలుకో నాయనా!’ అన్నాను.

నా నాభినుండి వెలువడిన ఆ మాటలకు పిల్లవాడు సన్నగా నవ్వాడు. ఇప్పటిదాకా మౌనంగా పడి ఉన్న వాడు ఎలా నవ్వాడు? అని నాకు ఆశ్చర్యం కలిగింది. వెంటనే నేను. “ఎందుకలా నవ్వావు నాయనా?” అని అడిగాను.

“పోనివ్వండి...” అన్నాడు వాడు.

“లేదు... లేదు... చెప్పు... దేనికి నవ్వావు?”

అని అడిగిన మీదట “ఇంకా కొంత వసూలు మిగిలే ఉంది. అందుకే నవ్వుతున్నాను. నేనెవరనుకొన్నావు? ఆ రోజు ముంబయి ధర్మసత్రంలో విషం పెట్టి చంపేశావే ఆ మిత్రుడినే నేను. ఆ ధనమంతా హరించావు కదా! ఆ డబ్బు దాని వడ్డీతో సహా వసూలు చేసుకొనేందుకు వచ్చాను. చాలా వరకు లెక్కసరిపోయింది. చివరికి ఒక ఐదువందలు మాత్రం మిగిలి ఉంది. సరే, ఇక సెలవు ఇప్పించు. మిగిలిన ఐదువందలు నా అంత్యక్రియలకు ఖర్చు చెయ్యి, లెక్కసరిపోతుంది. వెళుతున్నాను. రాం... రాం...” అంటూ కళ్ళు మూశాడు నా

పుత్రుడు. ఆ క్షణమే అతడు మరణించాడు...

నా రెండు చెంపల మీదా ఎవరో చాచి కొట్టినట్లనిపించింది. డబ్బు మొత్తం పోయింది. దానితో పాటుగా కొడుకు సైతం పోయాడు. నేను చేసిన పాపం గుర్తుకు రాగానే గుండె దడదడలాడిపోయింది. ఎవరు మనం చేసే కర్మలను చూడకపోయినప్పటికీ, చూసేవాడు ఒకడు తప్పక ఉంటాడు. ఇక్కడి ప్రభుత్వం అపరాధిని పట్టుకోలేకపోవచ్చు కానీ పైన ఆ ప్రభుత్వం ఉంటుంది కదా! దాని కళ్ళ నుండి ఎవ్వడూ తప్పించుకోలేడు.

నేను పిల్లవాడి అంత్యక్రియలు జరిపించాను. మిగిలి ఉన్న సంపదను మంచి పనులకు వినియోగిస్తూ చివరికి సాధువుగా మారిపోయాను. దయచేసి ఈ నా గాథను ప్రజలందరికీ చెప్పు. నేను చేసిన పొరబాటు వాళ్ళు చేస్తారేమో... ఎందుకంటే ఇది భూమి కర్మభూమి.

**కరమ్ ప్రధాన్ బిస్వ కరి రాఖా ।**
**జో జస్ కరయి సో తస్ ఫలు చాఖా ॥**

కర్మ సిద్ధాంతం కాదనలేనిది. ముల్లును ముల్లుతోనే తీసినట్లుగా మంచి కర్మల ద్వారా చెడు కర్మల ప్రాయశ్చిత్తం జరుగుతుంది. అన్నింటికంటే మంచికర్మ ఆ జీవన ప్రదాత అయిన పరమాత్మకు సర్వదా అంకితం కావడమే. పూర్వకాలంలో ఎటువంటి చెడు పనులు చేసినా కూడా, ఆ కర్మలకు తగు ప్రాయశ్చిత్తం చేసుకొని మళ్ళీ అలాంటి పొరబాటు జరగకూడదని దృఢంగా సంకల్పించుకోవాలి. ఎవనిపట్ల చెడుకర్మ జరిగిందో వారిని క్షమాపణ అడిగి, మన అంత:కరణం ఉజ్జ్వలంగా మార్చుకొని మృత్యువు కంటే ముందుగానే ఆ జీవనప్రదాతను కలుసుకోవాలి.

శ్రీకృష్ణభగవానుడు:

**అపి చేత్సుదురాచారో భజతే మాం అనన్యభాక్ ।**
**సాధురేవ స మంతవ్య: సమ్యక్ వ్యవసితో హి స: ॥**

అతిశయమైన దురాచారపరుడు కూడా అనన్యభావంతో నా భక్తునిగామారి

నన్ను భజన చేసినట్లయితే అతడు సాధువుగానే పిలువదగిటువంటి యోగ్యుడు. ఎందుకంటే అతడు యథార్థ నిశ్చయం గలవాడు. అనగా పరమేశ్వరుని భజనకు సమానమైనది వేరొకటి లేదని అతడు చక్కగా నిశ్చయించుకొన్నవాడు.'

**(గీత : 9.30)**

మరియు

**అపి చేదసి పాపేభ్య: సర్వేభ్య: పాపకృత్తమ: ।**
**సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి ॥**

(నీవు సకల పాపులలోకెల్లా మహాపాపివి అయినప్పటికీ, జ్ఞానమనే నౌకద్వారా నిస్సందేహంగా సంపూర్ణ పాపసముద్రమును చక్కగా దాటి వేయగలవు.) **(గీత : 4.36)**

# 'ప్రారబ్ధం కడు ప్రబలమైనది'

ప్రారబ్ధం అనేది మూడు విధాలుగా ఉంటుంది: (1) మంద ప్రారబ్ధం (2) తీవ్ర ప్రారబ్ధం (3) తీవ్రతర ప్రారబ్ధం.

మంద ప్రారబ్ధాన్ని మీరు వైదిక పురుషార్థంతో మార్చవచ్చు. తీవ్ర ప్రారబ్ధం మీ పురుషార్థం చేత, సంత్ మహాపురుషుల కృపచేత తొలగిపోవచ్చు. కానీ తీవ్రతరమైన ప్రారబ్ధం మాత్రం జరిగే తీరుతుంది.

ఒకసారి రావణాసురుడు ఎక్కడికో వెళుతున్నాడు. దారిలో విధాత కనిపించాడు. రావణుడు అతడిని గుర్తించి, "విధాతా! ఎక్కడి నుండి రాక?" అని అడిగాడు.

"కోసల దేశం నుండి."

"ఏం? కోసల దేశంలో ఏమిటి విశేషం?"

"కోసల రాజుకు పుత్రిక జన్మించింది."

"మంచిది. ఆమె నుదుట ఏం వ్రాశారు?"

“కోసలరాజు యొక్క పుత్రిక కౌసల్య గొప్ప అదృష్టవంతురాలు. ఆమె వివాహం దశరథమహారాజుతో జరుగుతుంది. ఆ ఇంట సాక్షాత్తూ విష్ణుభగవానుడే శ్రీరామునిగా అవతరిస్తాడు. ఆ శ్రీరామునితోనే నీకు యుద్ధం సంభవించనున్నది. ఆ యుద్ధంలో అతడు నిన్ను యమపురికి పంపిస్తాడు.”

“ఆఁ విధాతా! నీకు ముసలితనం పైబడుతోంది. నీకు మతి భ్రమించినట్లుగా ఉంది. ఆహో! కోసలరాజు పుత్రిక ఇప్పుడే జన్మించింది. దశరథుడు ఇప్పుడు చిన్న పిల్లవాడు. వాళ్ళు పెరిగి పెద్దయి, వాళ్ళకు వివాహం జరిగి, పుత్రుడు జన్మించి, వాడు పెద్దయిన తరువాత యుద్ధం చేస్తాడా! ఆహో!”

రావణుడు బయటికి అహంకారంతో విర్రవీగాడు గానీ లోపం ఏదో కలుక్కుమంది.

సమయం గడుస్తూ ఉంది. రావణుడు ఈ విషయాన్నే గుర్తుంచుకొని కౌసల్య దశరథుల విషయం గురించి ఎప్పటికప్పుడు తెలుసుకొంటూనే ఉన్నాడు. కౌలస్యకు యుక్త వయస్సు రాగానే ఆమెకు దశరథునితోనే నిశ్చితార్థం జరిగింది. రావణుడికి దెబ్బ తగిలినట్లయ్యింది. అయితే ‘నిశ్చితార్థమే కదా జరిగింది. అయితేనేం? ఇంకా వివాహం కావాలి... వారికి పుత్రుడు కలగాలి... ఆ పుత్రుడు పెరిగి పెద్దవాడు కావాలి... అప్పటి సంగతి కదా! వాడు నన్నేమి యమపురికి పంపించగలడు?’ అని అనుకొన్నాడు.

రోగాన్ని, శతృవునూ అశ్రద్ధ చెయ్యకూడదు. వాళ్ళపై దృష్టి పెట్టాలి. రావణాసురుడు కూడా కౌలస్యను, దశరథుడిని ఓ కంట కనిబెడుతూనే వచ్చాడు.

“కౌసల్య నిశ్చితార్థం దశరథునితో జరిగింది. కాబట్టి ఇక నాకు ప్రమాదం మొదలయినట్లే! అందుచేత ఇక జాగ్రత్తగా ఉండాలి. వివాహ ముహూర్తం ఎప్పుడు నిర్ణయమైతే అప్పుడు చూద్దాం!” కాలక్రమేణా వివాహ ముహూర్తం నిర్ణయమై, వివాహం జరిగే రోజు దగ్గర పడింది.

ఇక ఏదైనా చేయాలనుకొన్నాడు రావణుడు. వెంటనే తన ‘అదృశ్య విద్య’ను ప్రయోగించాలని నిశ్చయించుకొన్నాడు. వివాహం జరిగే రోజున కౌసల్య స్నానం

చేసి వచ్చింది. చెలికత్తెలు ఆమెను హారాలు, వస్త్రాలతో అలంకరిస్తున్నారు. ఆ సమయంలో రావణుడు కౌసల్యను అపహరించి తీసుకుపోయి ఒక చెక్కపెట్టెలో బంధించి, ఆ పెట్టెను నీళ్ళల్లో పారేశాడు.

కౌసల్యతో వివాహనిమిత్తం 'అజ' మహారాజుగారు దశరథుడ్ని వెంటబెట్టుకొని వశిష్ఠ గురువుతో పాటు, పెళ్ళివారందరినీ తీసుకొని కోసల దేశంవైపు వస్తున్నారు. ఒక్కసారిగా దశరథుడు మరియు వశిష్ఠులవారి ఏనుగులు ఘీంకరిస్తూ పరుగులు తీయసాగాయి. మావటీలు ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి ఆగడం లేదు. చివరికి వశిష్ఠులవారు, "సరే, వాటిని వదిలిపెట్టండి... ఎక్కడికి వెళతాయో చూద్దాం... వాటిని ప్రేరేపిస్తున్నది కూడా పరమాత్ముడే కదా!" అన్నారు.

ఏనుగులు పరుగులు తీస్తూ వెళ్ళి, సరిగ్గా నీళ్ళల్లో ఆ పెట్టె కొట్టుకు వస్తున్న చోటుకే వెళ్ళి ఆగాయి. ఆ పెట్టెను చూసి అంతా ఆశ్చర్యపడ్డారు. దాన్ని తెరిచి చూస్తే లోపల చక్కగా అలంకరింపబడి ఉన్న ఒక కన్య బయటకు వచ్చింది. ఆమె చాలా సిగ్గుపడుతూ, తలక్రిందికి వాల్చి తన బొటనవ్రేలితో నేల మీద రాస్తున్నది.

వశిష్ఠులవారు "నేను వశిష్ఠ బ్రాహ్మణుడను. పుత్రీ! తండ్రి ఎదుట, గురువు ఎదుట సంకోచం విడిచి, మన అభీష్టాన్ని, వ్యథను చెప్పుకోవాలి. నీవెవరవు? నీకీ పరిస్థితి ఎందుకు వచ్చింది?" అని అడిగారు.

ఆమె, "నేను కోసలరాజు పుత్రిక కౌసల్యను." అని జవాబిచ్చింది.

వశిష్ఠులవారికి అర్థమయ్యింది. నేడు వివాహ ముహూర్తం. ఆ సమయం కూడా దగ్గర పడుతున్నది.

"నన్నెవరో రాక్షసుడు తీసుకువచ్చి ఈ చెక్కపెట్టెలో పడవేసి ఇలా నీటిలో పారవేశాడు. నేనెక్కడ ఉన్నానో అర్థం కావడం లేదు." అన్నదామె.

"నువ్వు చింతించకమ్మా! తీవ్రతర ప్రారబ్ధం చేత ఎలా వ్రాసిపెట్టి ఉంటే అలాగే జరుగుతుంది. ఇదిగో చూడు, నేను వశిష్ఠుడను. ఇతడు దశరథుడు. వివాహ ముహూర్తం ఇదే. మీకు ఇప్పుడే నేను గాంధర్వ పద్ధతిలో ఇక్కడే వివాహం జరిపిస్తాను." అన్నాడు.

ఆ ప్రకారంగా వెంటనే వశిష్ఠమహర్షి వారిద్దరికీ అక్కడే వివాహం జరిపించేశాడు.

అక్కడ కోసలరాజు కౌసల్యను కానక చింతపడుతూ "పెళ్ళివారు వచ్చే సమయమయ్యింది. ఏం చెయ్యాలి? అందరికీ ఏం జవాబు చెప్పాలి? కన్య అపహరించబడిందనే విషయం పొక్కితే వంశానికే కళంకం. అంతా సిద్ధమైన తరువాత పెళ్ళి కూతురు మాయమయ్యిందంటే ఎంత చెడ్డ పేరు?" అనుకొని, తన వంశ ప్రతిష్ఠను నిలుపుకోవడం కోసమై కౌసల్యకు పరిచర్యలు చేసే ఒక దాసిని పిలిపించాడు. ఆమె కూడా కౌసల్య ఈడుదే. ఆమె రూపం కూడా కౌసల్యలాంటిదే. ఆమెను పిలిపించి,

కౌసల్యస్థానంలో నీవే కౌసల్యలా నటించాలి. మా పరువు నిలుస్తుంది, నీ జీవితమూ బాగుపడుతుంది." అని చెప్పాడు. కొందరు దాసీలు ఆమెను అలంకరించారు. తలకు మంచగంధపు నూనెలు పూసి జడవేశారు. 'ఇక నేను మహారాణిని అవుతాను కదా?' అనుకొంటూ ఆమె మనస్సులోనే సంతోషిస్తుంది.

ఇక్కడ కౌసల్యా దశరథుల వివాహానంతరం వారంతా కోసల రాజ్యానికి ప్రయాణమయ్యారు. పెళ్ళివారంతా కోసలకు వచ్చిన తరువాత కౌసల్యకు దశరథునితోనే వివాహమయ్యిందని తెలిసి అక్కడి వారందరూ సంతోషించారు. చక్కగా ముస్తాబు చేసి కూర్చోబెట్టిన దాసి మాత్రం అలానే ఉండిపోయింది. అప్పటి నుండే

**బిధి కా ఘూల్యా న టలే, టలే రావణ్ కో ఖేల్।**
**రహీ బిచారీ దూమ్‌డీ ఫూల్ పటా మే తేల్॥**

అనే సామెత పుట్టుకొచ్చింది.

'బిధి' అంటే ప్రారబ్ధం. ప్రారబ్ధంలో ఆమె రాణిగా కావాలని రాసిపెట్టి లేదు. అందుకే అలంకరించుకొని, జుట్టుకు సుగంధతైలం పట్టించినా ఆమె అలాగే మిగిలిపోయింది.

అందుచేత మనిషి దేనికీ చింతించకూడదు. ఈ తీవ్రతర ప్రారబ్ధం ఎలా

వ్రాసిపెట్టి ఉంటే అలాగే జరుగుతుంది. కానీ దీనికి అర్థం చేతులు ముడుచుకొని కూర్చోమని కాదు. పురుషార్థం తప్పక చెయ్యాలి. పురుషార్థం చెయ్యకుండా ఏ కార్యమూ సిద్ధించదు. తత్పరతతో, మనోయోగంతో, ఆలోచనాపూర్వకంగా ఏ కార్యన్నైనా చేసినప్పటికీ సఫలం కాకపోతే అది విధి విధానంగా భావించి స్వీకరించాలి. అంతేగానీ దు:ఖించరాదు.

'శ్రీరామచరిత మానస్'లో **(అయోధ్యాకాండ : 171)** తులసీదాసు గారు విధి గురించి ఇలా చెప్పారు.

**సునహు భరత్ భావీ ప్రబల్ బిలఖి కహేఁఉ మునినాథ్ ।**
**హాని లాభు జీవను మరను జసు అపజసు బిధి హాథ్ ॥**

(ఓ భరతా! విను. ప్రారబ్ధం కడు ప్రబలమైనది. లాభనష్టాలు, జీవన్మరణాలు, కీర్తి, అపకీర్తి, అంతా ఆ ప్రారబ్ధం విధి చేతిలోనే ఉంది.)

❁

# తరువాత పశ్చాత్తాపపడి ఏం లాభం?

1957కు ముందటి మాట. గాజియాబాద్ జిల్లా పిల్ఖుఆ అనే గ్రామంలో 'దల్‌వీర్‌ఖాన్' అనే ఒక ముస్లిం వడ్రంగి నూరు రూపాయలకు ఒక రాజపుత్రుడి నుండి ఒక పచ్చని రావిచెట్టును కొన్నాడు. ఈ బేరంలో 'ఇసాక్ ఖాన్' అనే మరొక వడ్రంగి వాటాదారుడు. ఆ చెట్టును నరికి ముక్కలు చేసి అమ్మగా వచ్చిన డబ్బును సమానంగా పంచుకోవాలని ఇద్దరూ నిశ్చయించుకొన్నారు.

చెట్టులో ప్రాణం ఉంటుంది. గొప్ప గొప్ప వారు ఒక్కోసారి వృక్షజన్మలు కూడా పొందుతారు. ఈ ఆత్మలు ఎంతో వివేకంగా, కార్యశీలంగా ఉంటాయి.

**అశ్వత్థ: సర్వవృక్షాణాం...** అన్నాడు కృష్ణ పరమాత్మ. అంటే, సకల వృక్షాలలో నేను రావిచెట్టును.' అని అర్థం. **(గీత 10.26)**

ఆ రావిచెట్టులోని జీవాత్మ దల్‌వీర్‌ఖాన్ కలలోకి వచ్చింది. "నువ్వు నన్ను నరికితే నాకు చావు తప్పదు. నన్ను 100/-రూ.లు పెట్టి కొన్నావు. అందుకని అందులోని లాభం అంతా నీకు నేను ఇచ్చేస్తాను. నా మొదట్లో ఒక చోట తవ్వితే ఒక బంగారు కణికె దొరుకుతుంది. దాన్ని అమ్మితే నీకు మంచి లాభం

వస్తుంది. అందుచేత రేపు నన్ను దయచేసి నరకవద్దు. నాకు ప్రాణదానం చెయ్యి.” అన్నది.

దల్వీర్‌ఖాన్‌కు ఈ కల గురించి నమ్మకం కుదరలేదు. కానీ ఆ విషయం నిర్ధారించుకొనేందుకు కలలో తవ్వమని చెప్పిన చెట్టు మొదట్లో తవ్వాడు. నిజంగానే ఒక బంగారు కణికె బయటపడింది. అతగాడు సంతోషం పట్టలేక వెళ్ళి తన భార్యకు అంతా చెప్పేశాడు. ఆమె కూడా ఆశ్చర్యపోయింది. ‘ఈ బంగారం సంగతి మిత్రుడికి చెబితే, ఇందులో సగభాగం వాటా అడుగుతాడేమో’ననిపించింది దల్వీర్‌ఖాన్‌కు.

అతడిలో మానవత్వం నశించింది, బంగారం మొత్తం పొందాలనే లోభంతో బంగారం దొరికిన సంగతిని దాచి ఉంచాడు. ఇసాన్‌ఖాన్ తన వద్దకు రాగానే, అతడితో కలిసి చెట్టును నరకడానికి బయలుదేరాడు దల్వీర్‌ఖాన్.

దల్వీర్‌ఖాన్ మానవత్వాన్ని పక్కకినెట్టేశాడు. నిస్వార్థం, లోభరాహిత్యం, నిష్కామత్వం మనిషికి దైవత్వాన్ని ఆపాదిస్తుంది. స్వార్థం, లోభం మనిషిని మానవత్వం నుండి దూరం చేసి దానవుని వంటి దు:ఖకారకమైన జన్మలలో పడేస్తుంది. స్వార్థం ఉన్నచోట మనిషి అసురుడిగా మారతాడు. నిష్కామత్వం ఉన్నచోట అతడిలో సురత్వం మేల్కొంటుంది. అయితే మనిషి ఎలాంటి ప్రాణి అంటే ఈ సురాసురులు ఇరువురూ ఎక్కడి నుండి ఉద్భవిస్తారో ఆ సిద్ధస్వరూపం పొందితే జీవన్ముక్తుడే అవుతాడు. ఇది మనిషి చేతిలో పనే. అతడు తన కర్మల ద్వారానే భగవంతుని పూజించగలడు. తన కర్మలతోనే ఆ ప్రకృతి కోపానికి గురికాగలడు. తన కర్మలతోనే గురువుల అనుభవాన్ని తన అనుభవంగా మార్చుకోగలడు. తన దుష్కృత్యాల వలన దైత్య, సూకర, కూకరాది జన్మలలో చరించగలడు. మనిషి కడు స్వతంత్రుడు.

మొదట్లో ఒక నియమం ఉండేది. ఎవరైతే పచ్చని చెట్టును నరుకుతారో వారు మొదట బెల్లం పంచిపెట్టాలి. సరే, ఈ వడ్రంగులతో మరి నలుగురు కలిశారు. అందరికీ బెల్లం పంచి పెట్టారు. రావిచెట్టు మీద గొడ్డలివేటు పడగానే ఆ చెట్టులో

నుండి రక్తపు ధారలు కురిశాయి. చెట్టు నుండి రక్తమా! అని అంతా భయపడిపోయారు. కానీ రాత్రికలలో ఈ చెట్టు తనని ప్రాణభిక్ష వేడిందనే సంగతి దల్వీర్‌ఖాన్ తెలుసుకోలేకపోయాడు. అది సామాన్య వృక్షంకాదనీ, తన ప్రాణం కోసం బంగారం రూపంలో మూల్యం చెల్లించిందనే విషయాన్ని అతడు మరిచాడు.

నిస్వార్థం వలన మనిషి లోపలి నేత్రాలు తెరుచుకొంటాయి. స్వార్థంతో మానవుని వివేకమనే నేత్రం మూసుకుపోయి అతడు గుడ్డివాడై పోతాడు. రజో–తామస గుణాలు గల వ్యక్తికి వివేకం క్షీణిస్తుంది. సత్త్వగుణవంతుని వివేకం, వైరాగ్యం, మోక్షప్రసాదం వాటంతటఅవే పెరుగుతాయి. మనిషి ఎంత నిస్వార్థంగా పనిచేస్తే అతడికి పరిచయం గల వారికి కూడా అంతటి మేలు జరుగుతుంది. ఎంతస్వార్థం చూపిస్తే అతని కుటుంబీకులు, అతడు అంతగా నాశనమవుతారు. ఎవరైనా తండ్రి నిస్వార్థంగా సంత్‌లను సేవించినట్లయితే ఆ శిష్యుని పుత్ర–పౌత్రాదులకు సైతం భక్తి ఫలం సులభమవుతుంది. ఈ భక్తి ఫలం పొందడం అనేది నవ్వులాట కాదు.

భగవంతుని వద్దకు ఒక యోగి వెళ్ళి “భగవంతుడా! నాకు భక్తిని ప్రసాదించు.” అంటూ అడిగాడు.

“నీకు నేను కావాలంటే రిద్ధీ–సిద్ధులను ఇస్తాను. కావాలంటే ఈ భూమండలంలో కొంత రాజ్యం కూడా ఇస్తాను. కానీ భక్తి ఇవ్వమని మాత్రం అడగకు.” అని అన్నాడు భగవంతుడు.

“అన్నీ ఇవ్వగలవాడివి మరి భక్తి కూడా ఇవ్వవచ్చుగా.”

“భక్తి ఇచ్చేస్తే ఇక నేను ఆ భక్తుడి వెంటే తిరుగుతూ ఉండాలి.” అన్నాడు భగవంతుడు.

నిష్కామకర్మచేస్తే వ్యక్తుల కర్మలను భగవంతుడు గానీ, సంత్‌లుగానీ స్వీకరిస్తారు. దానికి బదులుగా వారి వంశానికే భక్తి లభిస్తుంది. ఎవరి వంశంలో ఈ భక్తి లభిస్తుందో ఇక వారితో ధనవంతులు సైతం పోటీపడలేరు. అధికారపరులు ఇక ఏమి పోటీ చేస్తారు?

నిష్కామసేవ చేసే వాడికే భక్తి దొరుకుతుంది. హనుమంతుడు రాముడితో, "స్వామీ! బ్రహ్మచారిని. నాకు యోగమో, ధ్యానమో ఏదైనా మంత్రమో అనుగ్రహిస్తే జపించుకొంటాను. మీ భార్యను ఎవడో అసురుడు తీసుకుపోతే నేను ప్రాణాలు ఫణంగా పెట్టడం దేనికి? అని అనలేదు.

ఎందుకంటే హనుమంతుల వారికి అటువంటి దుర్బుద్ధి, స్వార్థచింతన లేవు. ఆయన రామకార్యాన్నే తన కార్యంగా భావించాడు. అందుచేతనే : **రామ్ లక్ష్మణ్ జానకీ, జై బోలో హనుమాన్ కీ ।** అని పాడుకొనడం జరుగుతుంది..

'శ్రీరామచరిత మానస్'లోనే ఒకానొక సందర్భంలో మైనాక పర్వతం సముద్రమధ్యన ప్రత్యక్షమై హనుమంతునితో "నా మీద విశ్రమించండి." అని అన్నప్పుడు ఆయన

**రామ్ కాజు కీన్హేఁ బిను మోహి కహాఁ బిశ్రామ్ ।**

**(శ్రీరామచరిత మానస్, సుందరకాండ : 1)**

నిష్కామకర్మ చేసేవాడు తను ఎంతపని చేయవలసి వచ్చినా అది పూర్తి అయ్యేటంతలో ఎన్ని విఘ్నాలు ఎదురైనా, ఎన్ని బాధలు కలిగినా, ఎన్ని నిందలు, ఎంత సంఘర్షణ పడాల్సి వచ్చినా ఆ పని పూర్తి చేసిన తరువాతనే ఊపిరి పీల్చుకొంటాడు. నిష్కామకర్మ చేసేవారికి ఒక విశిష్ఠమైన రీతి, శైలి ఉంటాయి.

సరే, మన కథలో దల్వీర్‌ఖాన్ ఎంత అంధుడైపోయాడంటే, రక్తపుధారలు చూసినా అతడికి తానేం చేస్తున్నాడో తెలియరాలేదు. అతడు గొడ్డలితో దెబ్బలు వేస్తూ పోయాడు. ఎవరైనా స్వార్థంతో కళ్ళుకానక ఎవరిపైనైనా అకృత్యాలకు, దుర్మార్గానికి పాల్పడితే ప్రకృతి ఎంతో తీవ్రమైన పరిణామాలను కలిగిస్తుంది.

అతడు ఆ దీనవృక్షాన్ని నరకడం మొదలుపెట్టగానే ఎంతో సుందరమైన, ఆరోగ్యవంతుడైన, యువకుడైన అతడి కొడుకు, చివరికి కాలిగోటిలో కూడా ఎలాంటి జబ్బులేనివాడు ఒక్కసారిగా బాధతో అరుస్తూ క్రిందపడిపోయాడు. అక్కడ రావిచెట్టులో నుండి నెత్తురు పారుతోంది. ఇక్కడ ఆ కుర్రవాడి ఒంట్లో నుండి రక్తం ధారలు కడుతోంది. అక్కడ ఆ చెట్టు మొదలు తెగి పడిన వెంటనే,

ఇక్కడ దల్వీర్‌ఖాన్ కంటి వెలుగైన అతడి కొడుకు కూడా చనిపోయాడు. సాయంకాలం ఖాన్ ఇంటికి వస్తూనే తన ఇంటివద్ద ఊరివాళ్ళంతా గుమికూడి ఉండడం చూశాడు. అతడిని చూడగానే భార్య, "నాయనా! నిన్ను చంపిన హంతకుడు అడుగో మీ నాన్నే!" అంటూ శోకాలు పెట్టింది.

"రాత్రి రావిచెట్టు కలలోకి వచ్చింది. బంగారు కణికె ఇచ్చింది. పాపం ఆ చెట్టు ప్రాణం పొయ్యమని అడిగితే ఈ హంతకుడు లోభంతో, స్వార్థంతో ఆ బంగారం తీసుకొని దాచుకొన్నాడు. నూరురూపాయలు పెట్టి కొన్నదానికి రాబోయే లాభానికి ఈ బంగారంతో అంతకంటే ఎన్నోరెట్లు ఎక్కువగానే వచ్చింది. అయినా ఇతడు ఆ రావిచెట్టుకు అన్యాయమే చేశాడు. ప్రకృతి ఆ అన్యాయానికే బదులు తీర్చుకొంది. ఆ రావిచెట్టును నరికీ నరకగానే నా బిడ్డ ఒంటి నుండి రక్తం కారింది. స్వార్థంతో గుడ్డివాడైపోయిన ఓ నా మొగుడా! నా బిడ్డను హత్య చేసింది నువ్వే!"

అంటూ ఆమె బండారమంతా బయటపెట్టి వెక్కి వెక్కి ఏడవసాగింది.

స్వార్థంతో కళ్ళు మూసుకుపోయి, మనిషి సాధారణంగా ఎన్నో చెడ్డపనులు చేస్తాడు. దాని ఫలితం వచ్చినప్పుడు మాత్రం ఎంతో పశ్చాత్తాపం చెందుతాడు. కానీ తరువాత పశ్చాత్తాపపడి ఏం లాభం?

❁

# పూజారి ప్రేతంగా మారాడు!

ఉడియా బాబా గారు ఎంతో ఉన్నతమైన ఆధ్యాత్మిక సంపద గలవారు. అఖండానంద సరస్వతీ స్వామి గారు ఆయన పట్ల ఎంతో శ్రాద్ధాభావాన్ని కలిగి ఉండేవారు. వారు పరస్పరం అనేక విషయాల గురించి చర్చించుకొనేవారు కూడా.

ఈ ఉడియాబాబాగారు ఒకనాడు ఉదయాననే కొంతకాలం క్రిందట మృతుడైన ఒక పూజారిని చూసి, "ఓహో! శ్రీకృష్ణులవారి పూజారీ! నువ్వు చనిపోయావు కదా! మరి ఇలా ఉదయాననే తీరానికి ఇలా వచ్చావేమిటి?' అని అడిగారు.

దానికి ఆ మృతజీవి "బాబా! మీతో ఒక విషయం చెప్పాలని వచ్చాను.

నేను ప్రేత శరీరంలో ఉన్నాను. మా ఇంట్లో వాళ్ళందరినీ సుఖపెట్టాలని మోహవశాన స్వామికి చెందిన డబ్బును దొంగతనం చేసి ఇంట్లో దాచాను. ఆ విషయాన్ని గురించి ఎలాగైనా సరే మా వాళ్ళని పిలిచి చెప్పండి. ఆ దానధర్మాల డబ్బును దొంగిలించాను. కాబట్టే పూజారినైనా నాకు సద్గతులు కలగలేదు. మీకు చేతులు జోడించి నమస్కరిస్తాను. దయచేసి నా కొడుకును పిలిచి, 'ఫలానా చోట డబ్బు దాచిపెట్టి ఉంది అనీ, దాన్ని మంచి కార్యాలకు వినియోగించమనీ, శ్రీ కృష్ణదేవాలయానికి చెందిన డబ్బును వాపసు చెయ్య'మనీ చెప్పండి. దానితో నాకు సద్గతులు కలుగుతాయి." అని ప్రార్థించాడు.

కర్మలు అనేవి ఎవరినీ విడిచిపెట్టవు. దేవాలయానికి పూజారి అయినా కూడా తను చేసుకొన్న దుష్కర్మల కారణంగా ప్రేతంగా మారవలసి వచ్చింది.

సూరత్ (గుజరాత్)లో 1995వ సంవత్సరం జన్మాష్టమి నాడు 'ధ్యానయోగ సాధనా శిబిరం'లో కొంతమంది లోఫర్లు ఆశ్రమం బయట టీ బండి నుండి ఎవరో ఒకడు స్వామివారి ఫోటోను లాగి క్రిందపడేశాడు. భక్తులతో, "మీరు హరి ఓం... హరి ఓం..." అంటూ జపం చేస్తారు కదా! మీ బాపూజీ మమ్మల్నేం చేస్తారో చూస్తాం!" అంటూ ఫోటోమీద బురద కాళ్ళతో తొక్కారు.

సాయంత్రానికల్లా వాళ్ళకి పక్షవాతం వచ్చింది. రాత్రికి చచ్చి మరుసటిరోజుకల్లా కాటికి చేరిపోయారు!

చెడు పనులు చేసే సమయాన మనిషి చేసేస్తాడు. కానీ ఆ తర్వాత దాని పరిణామం ఎంత భయంకరంగా ఉంటుందో పాపం అతడికి తెలియదు.

దుష్కృత్యాలు కర్తకు ఎలా దుష్ఫలితాన్నిస్తాయో, సుకృతాలు సైతం భగవత్ప్రీత్యర్థమై కర్మ ఆచరించే కర్త అంత:కరణాన్ని భగవత్ జ్ఞానంతో, భగవదానందం–జిజ్ఞాసతో నింపి, భగవంతుని సాక్షాత్కారం చేయించగలుగు తాయి.

❀ ❀ ❀

# సంత్‌ని హేళన చేసినందుకు దుష్పరిణామం

ఆత్మానందంలో పరవశిస్తున్న ఒక మహాత్ముని చూసి ఒక సేఠ్, "బ్రహ్మజ్ఞాని సేవ కడు దుర్లభం. నేను కూడా బ్రహ్మజ్ఞానిని సేవించాలి." అని అనుకొని తన నౌకరుని పిలిచి, "రోజూ సాయంత్రం పూట ఆ మహాత్ములకు పాలు అందించి రా." అని ఆజ్ఞాపించాడు.

నౌకరు పాలకై ఇచ్చిన డబ్బును జేబులో వేసుకొని ఉచితంగా దొరికే మజ్జిగతో కాస్త ఉప్పు–కారం కలిపి ఆ మజ్జిగను మహాత్ములకు ఇచ్చి వస్తూ ఉండేవాడు.

ఒకసారి సేఠ్ అలా అలా తిరుగుతూ ఆ మహాత్ముని వద్దకు వెళ్ళి, "స్వామీ! మా నౌకరు రోజూ సాయంత్రం పూట మీకు పాలు అందజేస్తున్నాడు గదా!" అని అడిగాడు.

స్వామీజీ : "ఆఁ ! అందజేస్తున్నాడు" అని చెప్పాడు.

ఆ నౌకరు నిజంగా తెస్తున్నదేమిటో స్వామివారు విశ్లేషించలేదు. నౌకరు ప్రవర్తన వలన స్వామీజీకి ఏ కష్టమూ కలగలేదు. కానీ ప్రకృతి మాత్రం సంత్ అవమానాన్ని సహించలేక పోయింది. కాలక్రమేణా ఆ నౌకరుకు కుష్ఠురోగం వచ్చింది. సంఘంలో మర్యాద కూడా పోయింది. అప్పుడు ఒక తెలివైనవాడు అతడిని అడిగాడు. "ఏమయ్యా! ఏమిటీ వైపరీత్యం. నాలుగువైపులా నీకు కష్టాలే కనబడుతున్నాయే." అని.

దానికి ఆ నౌకరు, "నేను వేరే పాపమేమీ చెయ్యలేదు. కానీ సేఠ్‌గారు ప్రతిరోజూ ఒక మహాత్మునికి పాలు అందజేయమని చెప్పారు. కానీ నేను పాలకోసమై ఇచ్చిన ఆ డబ్బును జేబులో వేసుకొని ఆయనకు మజ్జిగ ఇచ్చి వచ్చేవాడిని. అందుకే నాకు ఈ దుష్పరిణామం కలిగింది." అని చెప్పాడు.

# నేను ఋణం చెల్లించుకోవాలి!

సుమారు 40-45 ఏళ్ళ క్రితం జరిగిన ఒక యథార్థ సంఘటన ఇది: మకరాణాలోని ఒక ధర్మసత్రంలో ఒక భార్యాభర్తల జంట తమ చిన్నారి ముద్దుల బాలుడితో పాటు బసచేసింది. ఆ ధర్మసత్రం శిథిలావస్థలో ఉంది. గోడలు బీటలు వారాయి. పైన రేకులు కప్పారు. దగ్గరలోనే ఒక అడవి ఉంది.

తల్లిదండ్రులు తమ పిల్లాడిని ఆ ప్రాంగణంలోనే వదిలి ఏదోపని మీద బయటికి వెళ్ళారు. తిరిగి వచ్చి చూస్తే ఆ పిల్లవాడికి ఎదురుగా ఒక పెద్ద నాగుపాము చుట్ట చుట్టుకొని పడగవిప్పి కూర్చొని ఉంది. ఈ భయంకర దృశ్యాన్ని చూశాక వారినోట మాట రాలేదు. పిల్లవాడు మట్టిని చిట్టి చేతులతో తీసి దాని పడగపైకి విసురుతుంటే ఆ పాము తలవంచి అంత సహిస్తోంది. తల్లి పెద్దగా కేకపెట్టింది. తండ్రి, “రక్షించండి... రక్షించండి... మా బాబుని రక్షించండి...” అంటూ అరిచాడు.

జనాలు పోగయ్యారు. వారిలో ఒక విలుకాడు ఉన్నాడు. అతడు ఒంటె బండిపై బరువులు మోసే పని చేస్తూ ఉండేవాడు. అతడు ముందుకొచ్చి, “నేను గురిచూసి పాముని కొడతాను... అయితే గురితప్పి పిల్లవాడికి దెబ్బతగిలితే నేను బాధ్యత వహించను. మీరు సరేనంటే ప్రయత్నం చేస్తా”నన్నాడు.

పిల్లవాడి ఎదురుగా విషసర్పం! ఏ తల్లి మాత్రం కాదంటుంది? వెంటనే ఒప్పుకొంటూ, “నాయనా! ఆ పామునే చంపడానికి ప్రయత్నించు. పొరపాటుగా బిడ్డకు తగిలితే ఏమీ అనము.” అన్నది.

ఒంటె తాలూకు పెద్ద మనిషి గురి చూసి కొట్టాడు. ఆ పాము గాయపడి మూర్ఛపోయింది. పాము చనిపోయిందనే అందరూ భావించారు. వాళ్ళు దాన్ని తీసి బురదలో పారవేశారు.

రాత్రి గడిచింది. ఆ మనిషి తన ఒంటె బండిలోనే నిద్రిస్తున్నాడు. రాత్రిపూట చలిగాలి వీచింది. గాయపడిన పాము మూర్ఛనుండి తేరుకొని ఆ బండిలోని మనిషి కాలిపై కాటువేసి వెళ్ళిపోయింది. ఉదయాననే ఆ ఒంటె బండివాడు

చనిపోయి ఉండడం అందరూ చూశారు.

దైవవశాత్తూ సర్పవిద్య తెలిసిన వాడు వాళ్ళల్లోనే ఒకడున్నాడు. అతడు, "పాముని ఇక్కడికి రప్పించి విషం దానిచేతనే బయటకి లాగించే విద్య నాకు తెలుసు. ఇక్కడ ఎనిమిది-తొమ్మిదేళ్ళ బాలుడెవరైనా ఉంటే అతడిలోకి ఆ పాము ఆత్మను పిలిపించి మాట్లాడింపజేస్తాను." అన్నాడు.

ఊళ్ళో నుండి ఆ వయస్సు పిల్లవాణ్ణి తెచ్చి ఎదుట పెట్టారు. అతడు పాము ఆత్మను పిలిపించి, "ఈ బండి వాడిని నువ్వు కాటు వేశావు కదా?" అని అడిగాడు.

"అవును."

"పాపం, ఈ నిర్భాగ్యుణ్ణి ఎందుకు కాటేశావు?"

"నేను నిర్దోషిని. అతడిని నేనేం చెయ్యలేదు. మరి నాపై గురిపెట్టి రాయిని కొట్టినప్పుడు నేను బదులు తీర్చుకోనా?" అంటూ పలికింది బాలుడి శరీరంద్వారా ఆ పాము.

"నీ మీద మట్టి విసురుతున్న ఆ పసివాడిని ఏమీ చెయ్యలేదే నువ్వు?"

"ఆ పిల్లవాడు మూడు జన్మల క్రితం నాకు ఋణం ఇచ్చినవాడు. మూడు జన్మల క్రిందట అతడూ మనిషే. నేను కూడా మనిషినే. అప్పుడు అతడి వద్ద నేను మూడు వందల రూపాయలు తీసుకొని ఇవ్వలేకపోయాను. ఇప్పుడిక ఇవ్వగలిగే శక్తి కూడా లేదాయె. ఇలాంటి నీచ జన్మల్లో తిరగవలసి వస్తున్నది. దైవవశాత్తు అతడు నా ఎదుట పడినప్పుడు నా పడగ విప్పి అతడిని క్షమాపణ కోరుతున్నాను. అతడి ఆత్మ జాగృతమయ్యింది. వెంటనే మట్టిని గుప్పిళ్ళతో తీసుకొని నా మీదికి విసిరికొడుతూ, "సిగ్గులేదూ! అప్పు చెల్లించలేకపోయావు." అంటున్నాడు. అతడి ఛీత్కారాలు వింటూ, సహిస్తూ నేను నా ఋణం చెల్లించుకొంటున్నాను. మేమేదో ఇచ్చి పుచ్చుకోవడాల్లో ఉంటే మధ్యలో తలదూర్చేందుకు ఇతడెవరు? నేను ఇతడికి ఎటువంటి హానిని తలపెట్టకపోయినా నన్నే గురిపెట్టి కొట్టాడు. దానికి బదులు తీర్చుకొన్నాను." అని చెప్పింది పాము.

సర్ప విద్య తెలిసిన ఆ మనిషి "సరే, చూడు నేను చెప్పేది విని ఇతడి

ఒంట్లో విషాన్ని వెనక్కి తీసేసుకో." అని అన్నాడు.

"నేను నువ్వు చెప్పేది వినాలంటే నువ్వు కూడా నేను చెప్పేది విను. నాది పగ తీర్చుకొనే జన్మ. మిగిలినదంతా వదిలేసి ఒక ఐదువందల రూపాయలు ఈ బండివాడు నాకివ్వగలిగితే వెంటనే విషం తీసేస్తాను. ఆ పిల్లవాడి దగ్గర మూడు జన్మల క్రితం మూడు వందల రూపాయలు తీసుకొన్నాను. రెండు జన్మలు గడిచిపోయాయి. వడ్డీ రెండు వందలూ కలిపితే మొత్తం ఐదువందలు చెల్లించాలి." అన్నది పాము.

ఎవరో సజ్జనుడు ఐదువందలూ తీసి ఆ బాలుడి తల్లిదండ్రులకు ఇచ్చాడు. పాము ఆత్మ మళ్ళీ పాములోకి ప్రవేశించింది. పాక్కుంటూ వచ్చి ఆ పాము బండివాడి శరీరం నుండి విషాన్ని వెనక్కి లాగేసుకొంది. బండివాడు మళ్ళీ బ్రతికాడు.

ఇది యథార్థంగా జరిగిన సంఘటన. ఇందులో ఏ సందేహమూ లేదు. మాసపత్రిక 'కళ్యాణ్'లో దీనిని గురించిన సమాచారం ప్రచురించబడింది.

ఈ కథ వలన స్పష్టమయ్యేదేమిటంటే పీకలలోతు అప్పుల్లో కూరుకుపోయేటంతగా వృథా ఖర్చులు చెయ్యరాదు. మళ్ళీ అవి తీర్చడానికి పడగవంచి మట్టితో ఛీత్కారాలు సహించవలసి రావచ్చు. జాగ్రత్తగా ఉండాలని.

ఆత్మజ్ఞానం లేనంతకాలం కర్మల ఋణానుబంధం తీర్చక తప్పదు. అందుచేత నిష్కామకర్మ చేస్తూ భగవంతుని సంతోష పెట్టాలి. ఆత్మ-పరమాత్మల అనుభవం పొంది ఇక్కడే ఈ జన్మలోనే శీఘ్రంగా ముక్తిని పొందాలి.

# అక్కడ ఇచ్చి తప్పించుకొని, ఇక్కడ ఇరుక్కుపోయావు!

విన్న ఒక యథార్ధ సంఘటన:

అహ్మదాబాదులో షాహీబాగ్‌లో డఫ్నాలా సమీపాన హైకోర్టు జడ్జిగారు దంతధావనం చేసుకొంటూ బయటకి వచ్చాడు. నదికి సమీపంలో ఇద్దరు దుష్ట యువకులు ఏదో పరిహాసమాడుకొంటున్నారు. ఒకడు వచ్చి జడ్జిగారిని సిగరెట్టు కాల్చుకోవడానికి అగ్గిపెట్టె అడిగాడు. జడ్జి 'లేద'ని సైగ చేశాడు. కాసేపు అటూ ఇటూ తిరిగి జడ్జిగారు తాజాగాలి కోసం అక్కడే కూర్చొన్నాడు గానీ వాళ్ళను గమనిస్తూనే ఉన్నాడు. ఆ యువకుల పరిహాసం కాస్తా 'నువ్వా–నేనా' అనే రీతిగా మారి పెద్ద గొడవగా తయారయ్యింది. వాళ్ళల్లో ఒకడు 'రాంపురీ చాకు' తీసి ఇంకొకడిని పొడిచి చంపేసి పలాయనం చిత్తగించాడు. జడ్జిగారే పోలీసులకు ఫోను చేసి ఉంటాడు. హత్యకేసుగా నమోదయింది. సెషన్స్‌కోర్టు నుండి ఆ కేసు తిరిగి తిరిగి కొద్ది కాలం తరువాత హైకోర్టులో ఈ జడ్జిగారి వద్దకే వచ్చింది. కేసు విచారణ చెయ్యగా ఆనాటి హత్యకేసు అని తెలిసింది. ఆ రోజు సంఘటన ఆయనకు బాగా గుర్తుంది. ఆ అపరాధి కూడా జడ్జిగారికి గుర్తే. కానీ కేసులో ప్రవేశపెట్టిన ముద్దాయి మాత్రం ఆ యువకుడు కాడు.

ఆ జడ్జి గారు కాదనలేని కర్మసిద్ధాంతాన్ని నమ్ముతాడు. లోభంతో తీసుకొనే లంచంకానీ ఇంకా ఏ అశుభకార్యమైనా సరే, పాపమైనా సరే చేసేటప్పుడు బాగానే ఉండొచ్చు కానీ కాల క్రమేణా దాని ఫలితాన్ని అనుభవించకతప్పదు. కొద్ది సమయం పాటు ఏ కారణం చేతనైనా ఆ పాపి తప్పించుకున్నప్పటికీ ఎప్పుడో ఒకప్పుడు ఆ కర్మఫలాన్ని అతడు అనుభవించక తప్పదు... తప్పదుగాక తప్పదు...

జడ్జి చూడగా, ఆ ముద్దాయి ఎవరో ముసలి వ్యక్తి. హత్య చేసినవాడు యువకుడు. ముద్దాయిని తన చాంబర్లోకి పిలిపించుకొన్నాడు జడ్జి. "బాబుగారూ! డఫ్నాలా దగ్గర, సాబర్మతీ తీరాన... ఆ సంఘటనకూ నాకూ ఏ సంబంధమూ లేదు. భగవంతుడి సాక్షి... నేను నిర్దోషిని... నా ప్రాణం తీస్తున్నారు." అని గోడుగోడున విలపించాడు ముసలివాడైన ఆ ముద్దాయి.

జడ్జి సత్త్వగుణం గల సజ్జనుడు, నిర్మల మనస్కుడు, విశాల హృదయుడు, నిర్భయుడు, నిస్వార్థపరుడు. సాత్త్వికుడు అయినవాడు ఎప్పుడూ నిర్భయంగానే ఉంటాడు కదా! ఆయన ముద్దాయితో, "చూడు, ఈ సంఘటన గురించి ఏమీ నీకు తెలియకపోయినా సెషన్స్‌కోర్టులో నీ మీద అపరాధం గట్టిగా ఋజువైపోయింది. మేము కేవలం చట్టాన్ని అనుసరించగలం అంతే! ఈ విషయంలో మేం చెయ్యగలిగిందేమీ లేదు.

ఈ కేసులో మాత్రం నువ్వు నిర్దోషివని నేనూ అంటాను, కానీ ఒక్క విషయం మాత్రం ఖచ్చితమే. నువ్వు జీవితంలో ఏ ఒక్క మనిషినీ హత్యచేసి ఉండకపోతే, ఈ రోజు సెషన్స్ కోర్టులో నీ మీద అంత పక్కాగా కేసు నడిచేదే కాదు.

నిజం చెప్పు తాతా! నువ్వు జీవితంలో ఎప్పుడూ, ఏనాడూ, నీ యౌవనంలో కూడా ఏ మనిషినీ చంపకుండానే ఉన్నావా?" అని అడిగాడు.

ఆ ముసలివాడు అంగీకరిస్తూ "బాబుగారూ! ఇవి నా ఆఖరిరోజులు. మీరు అడుగుతున్నారు కాబట్టి చెబుతున్నాను. నేను రెండు హత్యలు చేసి లంచం పెట్టి తప్పించుకొన్నాను." అని చెప్పాడు.

జడ్జి "నువ్వు అక్కడ ఏదో లంచం పెట్టి తప్పించుకోగలిగావే కానీ ఇక్కడ పట్టుబడ్డావు గదా! ఎవరైతే లంచం పుచ్చుకొన్నారో వారి పిల్లలు కూడా ఆ లంచం పుచ్చుకొని ఉంటారు కదా! ఏదో విధంగా ప్రకృతి బదులు తీర్చుకోకుండా ఉంటుందా! అక్కడ ఇచ్చి తప్పించుకొన్నావు. ఇక్కడ ఇరుక్కుపోయావు. కర్మఫలం ఆలస్యంగానైనా సరే, అనుభవించకతప్పదు." అన్నాడు.

కర్మఫలం అనుభవించడం తప్పనిసరే. అయితే గొప్ప కర్మలు ఆచరించి గొప్ప ఫలితాన్ని ఎందుకు పొందకూడదు? ఆ గొప్ప కర్మఫలాన్ని భగవంతుడికే అర్పించి ఆయననే ఎందుకు పొందకూడదు?

నారాయణ... నారాయణ... నారాయణ...

అద్వితీయమైన పరమతత్త్వంతో నిస్వార్థ సంయోగం ఒక్కటే ఏకైక సత్యకర్మ... మిగిలినదంతా మూటలను భారంగా మోసే పనులే...

# సులేమాన్ ప్రేతం... యథార్థ సంఘటన

అనేక చిత్త విభ్రాన్తా మోహజాల సమావృతా: ।
ప్రసక్తా: కామభోగేషు పతన్తి నరకేఽశుచౌ ॥

'అనేక విధముల చిత్త భ్రమగలవారు, మోహరూపమాయా జాలంలో చిక్కి, విషయవాంఛా భోగములలో అత్యాసక్తి గల అసురజనులు మహా అపవిత్ర నరకంలో పడతారు.' **(గీత: 16.16)**

మనిషి జాగ్రత్తగా ఉంటూ సత్త్వగుణం పెంచుకోకుండా ఏది దొరికితే అది తింటూ, మనసుకు ఏది తోస్తే అది చేస్తూ, ఇదే విధమైన విషయవికారాలు, పాపాలు–చెడుపనుల్లో జీవితమంతా గడిపివేస్తే, అతడు నరకంలో పడకతప్పదు. బహుదు:ఖకరమైన, దుష్టజన్మలు పొందక తప్పదు. అందుచేత మనిషి తన భవిష్యత్తును అంధకారమయం చేసుకొనరాదు. లేదంటే, సులేమాన్ ప్రేతానికి ఏ గతి పట్టిందో అదే గతి మనకు కూడా పట్టగలదు.

ఇది ఒక యథార్థ సంఘటన. సులేమాన్ ప్రేతానికి బంధనం ఎలా కలిగింది. దానికి విముక్తి ఎలా దొరికింది. అనే ఈ విషయాలను గురించి తెలుసుకొన్నట్లయితే మనకు ఎంతో జ్ఞానం కలుగుతుంది.

సిక్కు సాంప్రదాయానికి చెందిన 'రాడావాలే' సంత్ శ్రీ ఈశ్వర్‌సింగ్ మహారాజ్‌గారి వద్దకు మన్‌మోహన్ అనే పేరుగల బాలుడ్ని తీసుకొని అతడి తల్లిదండ్రులు వచ్చారు. ఆ బాలుడిని ఒక ప్రేతం పట్టి పీడిస్తున్నది. ఆ ప్రేతాన్ని అడిగి తెలుసుకొన్న విషయాలు మిక్కిలి ఆశ్చర్యకరమైనవి. ఎంతో ఆసక్తిని కల్గించేవి. దానితోపాటుగా ఈ విషయాలు మన పురాణాలు ఎంత సత్యమైనవో కూడా తెలియజేస్తున్నాయి.

ఈశ్వర్‌సింగ్ మహారాజ్‌గారు ఆ బాలుడ్ని ఒక ఏకాంత మందిరానికి తీసుకుపోయి, అతడి శరీరంలోని ప్రేతాన్ని "నువ్వు ఎవరివి? ఈ బాలుడిలోకి ఎందుకు ప్రవేశించావ"ని అడిగారు.

"నేను ప్రేతాన్ని."

"నీ పేరేమిటి?"

"నా పేరు సులేమాన్."

"నిజం చెప్పు... నువ్వు ఎక్కడివాడవు?"

"నేను ఇరాన్‌కు చెందినవాడిని."

"ఇరాన్‌వాడివైతే ఇక్కడికెందుకు వచ్చావు?"

"నాదిర్షా అబ్దాలీ భారతదేశాన్ని దోచుకొనేందుకు ఇక్కడికి వచ్చినప్పుడు అతనితోపాటు నేనూ ఈ దేశం వచ్చాను. అతడు ఈ దేశాన్ని దోచుకొని వెళ్ళిపోయాడు... నేను మాత్రం ఇక్కడే ఉండిపోయాను. ఒక స్త్రీని లోబరుచుకొని ఆమెనే వివాహమాడాను."

"ఏమయ్యింది తరువాత?"

"నేను ఆమెతో కలిసి జీవించాను. ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు కలిగారు. వారిలో అందమైన నా కూతురు ఎవరో హిందువైన మంత్రగాడితో సంబంధం పెట్టుకొంది. వాడు మంత్ర తంత్రాలు ప్రయోగించేవాడు. చేతబడులూ చేసేవాడు. అతడితో సంబంధం వద్దని ఎంత చెప్పినా ఆమె వినలేదు. అటు మంత్రగాడిని కూడా బెదిరించాను. కానీ లాభం లేకపోయింది. ఆ రోజుల్లోని పాలకులను కలిసి ప్రభుత్వం ద్వారా కూడా ప్రయత్నించాను. కానీ లాభం లేకపోయింది. ఇదే చింతతో రోగం బారిన పడ్డాను. ముసలితనం వస్తోంది... ఈ స్థితిలోనే నాకు మరణకాలం ఆసన్నమయ్యింది."

"సులేమాన్! మరి నీకు మృత్యువెలా కలిగిందో చెప్పగలవా?"

"ఆ! నా కళ్ళవెంట జలజలా కన్నీళ్ళు కారుతున్నాయి. నా నోరు పనిచెయ్యడం లేదు. హృదయంలో ప్రతీకారజ్వాల నన్ను దహించివేస్తోంది. 'హే ఖుదాతాలా! నీ దయ చూపించు. ఎవడైతే నా కూతురితో అక్రమసంబంధం పెట్టుకొన్నాడో ఒక్కసారి వాడి పనిపట్టే అవకాశం రావాలి.' అనుకొంటూ ప్రతీకారజ్వాలల్లో దహించుకుపోతూ, ప్రార్థన చేస్తూ ఉండగానే నా ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి."

"ప్రాణం పోతుండగా నువ్వేం చూశావు సులేమాన్?"

"నాకు నలుగురు యమభటులు కనిపించారు. అయితే వాళ్ళు ఛాయారూపంతో ఉన్నారు. వాళ్ళకు ఆకారమేదీ లేదు."

చాలామంది కంటికి యమభటులు కనిపిస్తారు. అప్పుడు తమకు మరణకాలం సమీపించిందని వాళ్ళకు తెలుస్తుంది.

నాకు లాల్‌జీ మహారాజ్ అనే ఒక సంత్ మిత్రుడు ఉండేవారు. ఆయన ఎంతో అనుష్ఠానపరుడు. పధ్నాలుగు సంవత్సరాల పాటు మౌనం పాటించాడు. ఆయన భక్తుడొకడు అకస్మాత్తుగా జరిగిన దుర్ఘటన కారణంగా చాలా తీవ్రంగా గాయపడ్డాడు. చావుగడియలు లెక్కిస్తున్నాడు. లాల్‌జీ మహారాజ్ అతడి దగ్గరకు వెళ్ళి కాసేపు మాట్లాడారు. తర్వాత ఆ భక్తుడు "స్వామీ! చచ్చాను... అదిగో... నన్ను తీసుకుపోవడానికి వచ్చారు."

"ఎక్కడ?"

"నా మంచం దగ్గరే."

స్వామీజీ అటు వెళ్ళారు.

భక్తుడు: "స్వామీ! వాళ్ళు కుడివైపుకు వచ్చారు."

స్వామీజీ కుడివైపుకు వెళ్ళారు.

భక్తుడు: "స్వామీ! ఇప్పుడు వాళ్ళు తలవైపుగా వచ్చారు."

స్వామీజీ ఎటు వెళుతుంటే యమభటులు అటు రాకుండా స్థానాలు మార్చుకొంటూ ఉన్నారు. స్వామీజీ భగవన్నామ సంకీర్తన చేశారు. చుట్టుప్రక్కలకు తన పవిత్ర దృష్టిని పరికించి శుభసంకల్పం చేశారు. అప్పుడు భక్తుడు "స్వామీ! వాళ్ళు వెళ్ళిపోయారు." అన్నాడు. అతడి అకాల మృత్యువు తప్పిపోయింది. తరువాత అతడు ఎన్నో సంవత్సరాలు జీవించి ఉన్నాడు.

ఇది ఇప్పుడే ఈ మధ్యనే 'జరిగిన సంఘటన. ఆ స్వామీజీ ఇంకా ఉన్నారు. ఆ భక్తుడు అహ్మదాబాదులోని 'బహేరాంపురా'లో ఉన్నాడు. అతడు సిటీబస్సు డ్రైవరు. ఏదో రోడ్డు ప్రమాదంలో ఇలా జరిగింది. ఇప్పుడు మరి సజీవంగా

ఉన్నాడో లేడో విచారిస్తే గానీ తెలియదు.

మన పవిత్రపురాణాలలో చెప్పిన విషయాలకు ఇలాంటి సంఘటనల వలన పుష్టి చేకూరుతుంది.

సరే, సులేమాన్ అన్నాడు. "నేను పెద్ద పెద్ద భీకరమైన ఆకారాలు గల యమదూతలు నలుగురిని చూశాను. నా శరీరం నుండి నా ఆత్మను బయటకు పంపాలని అనుకోలేదు. కానీ వాళ్ళు నన్ను దండించి, బలవంతంగా తీసుకుపోయారు. కొడుతూ, బాదుతూ, బాధలుపెడుతూ యమభటులు నన్ను యమధర్మరాజు వద్దకు తీసుకుపోయారు. అక్కడికి పోవడానికి ఒక సంవత్సరం పట్టింది. ఏడాది తర్వాతే మేము అక్కడికి చేరుకొన్నాం."

"అక్కడ ఏం చూశావు?"

"యమధర్మరాజు చిత్రగుప్తుని పిలిపించినప్పుడు చిత్రగుప్తుడు నా కర్మగాథలు వినిపించాడు. అది విన్న యమధర్మరాజు నన్ను కుంభీపాక నరకంలో పడవెయ్యమని ఆజ్ఞాపించాడు. నన్ను ఆ నరకానికి తీసుకుపోయారు."

"అక్కడేం జరుగుతుందో సరిగ్గా నిజాయితీగా చెప్పగలవా?"

"ఆఁ!... అది భూమికి 86వేల యోజనాల దూరంలో ఉన్నటువంటి విశాలమైన నరకం. ఈ శరీరంలో ఉండే మసాలాలన్నీ ఆ నరకంలో బయటనే ఉన్నాయి. విసర్జకాలు, మల-మూత్రాలు, ఉమ్ము, కొవ్వు, చర్మం... అంతా వేడిగా అతిదుర్గంధభరితంగా ఉంది. అందులో ప్రవేశించే ద్వారం కేవలం తొమ్మిది అంగుళాలు. పాపులను దండించడం కోసం 'భోగ-జన్మ' ఉంటుంది. అంటే జీవులకు ప్రత్యేకంగా ఈ 'భోగ శరీరం' ఇవ్వబడుతుంది. దాన్ని అగ్నిలో వేస్తే మాడి మసికాబోదు. అగ్ని జ్వాలల వేడిమిని తట్టుకొంటుంది. నరికి, ముక్కలు చేసినా సరే. దానికి 'ఫ్రాక్చర్' కాదు. అన్ని బాధలూ పడుతూ అది అలాగే నిలిచి ఉంటుంది. నేను ఆ భోగ శరీరంతో ఎన్నో దు:ఖాలు పొందాను. తర్వాత యముడు, "నువ్వు చాలా ఘోరమైన పాపాలు చేశావు. ప్రేతాలను చంపుతూ వాటిని బయటకు రప్పిస్తూ, పరస్త్రీ సంగమం చేస్తూ ఇతర ఎన్నో పాపకృత్యాలకు ఒడిగట్టావు. ఈ

కారణంగా నీవు ఎంతో కాలం ప్రేతరూపంలో తిరగాలి. తరువాత ఆ ఖుదాతాలను ప్రార్థిస్తూ ఏ మాంత్రికుడినైతే చంపి ప్రతీకారం తీర్చుకోవాలనుకొంటూ మరిణించావో ఆ ప్రతీకారాన్ని తీర్చుకోగలవు." అని చెప్పాడు.

"మరి అయితే నీ ప్రేతజన్మ ఇంకా పూర్తి కాలేదా?"

"లేదు. ఇక పూర్తి కాబోతుంది. నేను ప్రేతజన్మ పొంది సహారన్‌పూర్ జిల్లాలో మొగలఖేడా గ్రామంలోని స్మశానంలో నా సమాధి ఉన్నచోటనే నివసింసాగాను. అక్కడ నాతోపాటు ఇంకా అయిదు ప్రేతాలు నివసిస్తున్నాయి. ఒక దాని వయస్సు రెండువేల ఏడువందల యాభై సంవత్సరాలు. రెండవదాని వయస్సు మూడువేల సంవత్సరాలు. మూడవ ప్రేతం మూడున్నర వేల ఏళ్ళ వయస్సుదైతే, నాలుగవది ఐదువేల ఏళ్ళు, ఐదవది నాలుగు యుగాల ఏళ్ళ వయస్సున్నది."

గీతాశ్లోకం ఎంతటి నిజమైన విషయాన్ని తెలుపుతోంది.

**అనేక చిత్త విభ్రాంతా మోహజాల సమావృతా: ।**
**ప్రసక్తా: కామ భోగేషు పతన్తి నరకేఽశుచౌ ॥**

సులేమాన్ ప్రేతం ఇంకా ఇలా చెప్పాడు:

"మేము సమాధిలో నివసించేవాళ్ళం. అక్కడికి ఎంతోమంది వచ్చేవారు. అక్కడ ఆ సమాధులలో ఉండేది కేవలం మా శరీరం యొక్క కుళ్ళిన మాంసం, దుర్గంధమే అయినప్పటికీ కాంక్ష మోహం కారణంగా ఎందరో వచ్చి గుడ్డిగా మా సమాధులకు మొక్కుతారు. మేము వాళ్ళని చూడగలం. కానీ వాళ్ళు మమ్మల్ని చూడలేరు. వాళ్ళల్లో ఎవరైనా అణా-కాణీగాడు వచ్చి సమాధి దగ్గర గొడవ చేస్తే వాడిని ఖతం చేసేస్తాం. అలా ఎంతోమందిని చంపాం. ఈ మన్‌మోహన్ కూడా అలా వచ్చినవాడే... వచ్చి సమాధిపైన మూత్ర విసర్జన చేశాడు. అయినా నేను అతడిని చంపలేదు. కానీ జాగ్రత్తగా చూడగా ఇతడి శరీరంలోని ఆత్మ ఆ తాంత్రికుడిదని తెలిసింది. స్థూల శరీరం చనిపోతుంది. కానీ సూక్ష్మశరీరం మాత్రం వేలాది, లక్షల సంవత్సరాలయినా గానీ చావదు.

నేను ప్రతీకార జ్వాలలో మండిపోవడానికి కారణమైన శత్రువు ఇతడే. మరి ఇతడిని అంత త్వరగా చంపుతానా? చేతికి చిక్కిన తరువాత వదిలిపెడతానా? వెంటనే ఇతడి శరీరంలోకి చేరిపోయాను. ఏడు సంవత్సరాల పాటు నానా యాతనలు పెట్టాను. నా ప్రతీకారం తీరింది. నా సమయం కూడా పూర్తి కావచ్చింది. అందుకే మీవంటి సంత్‌ల వద్దకు వచ్చాను. మీ దయ వలన ఇక నా ప్రేతజన్మ నుండి విముక్తి కలుగుతుంది.

“సులేమాన్! నీవు మన్‌మోహన్ అంతరంగంలోకి ప్రవేశించి సంత్ చరణాల చెంతకు చేరావు. ఇప్పుడు భక్తి-శ్రద్ధలతో సత్‌సంగం విన్నావంటే నీకు మోక్షం కలిగనట్లే. కానీ సులేమాన్ ఇది చెప్పు. ప్రేతాలు ఏం తింటాయి. ఎక్కడ నివసిస్తాయి? ఏం చేస్తాయి? నీవు ఎన్నో ఏళ్ళపాటు ఈ జన్మలో ఉన్నావు కదా? అనేక అనుభవాలు కలిగి ఉంటాయి కదా! ఈ విషయాలు చెప్పగలవా?”

“ఆఁ! ఆకలివేసినప్పుడు బొగ్గులు తింటాం... విసర్జకాలు, మూత్రం స్వీకరిస్తాం. మాకు కేవలం ఆ మలిన పదార్థాలను మాత్రమే తినడానికి అనుమతి ఉంది.”

ప్రతి చోటికీ వెళ్ళి, ఏదైనా తిని, ఏదైనా చెయ్యవచ్చుననే అనుమతి ఉంటే ఇక మిఠాయి దుకాణాలలో మిఠాయిలు మిగులుతాయా? ప్రేతాలు స్వాహా చేసెయ్యవూ? వాటిపైన ప్రకృతి యొక్క, భగవంతుని యొక్క ప్రతిబంధకం గనుక లేకపోతే అవి సత్‌సంగం కూడా సాగనివ్వవు.

“సరే సులేమాన్! నువ్వు మరి దేవాలయానికి సత్‌సంగ సభలకీ వెళ్ళగలవా?”

“లేదు. అక్కడికి వెళ్ళలేను. సత్‌సంగం కానీ ఇతర ఏ పవిత్రకార్యమైనా గానీ జరుగుతున్న చోట మా వరకు ఒక అగ్నిలా ఉంటుంది. మాకు బాగా వేడిమి తగులుతుంది. అందుచేత ఆ చోటును వదిలి పారిపోతాం.”

“ఇక నీకు మోక్షం ఎలా? ఇతర ప్రేతాలు అదే ఆ మొగల్‌ఖేడాలోని సమాధిలో నాలుగు యుగాల తరబడి మ్రగ్గుతున్న ప్రేతాల్లాకు ముక్తి ఎలా లభిస్తుంది?”

“మేము ఏ మనిషి శరీరంలోనైనా చేరితే, ఆ మనిషి ఎప్పుడైనా సంత్

శరణుజొచ్చినప్పుడు, సంత్ ఆ వ్యక్తితో 'కూర్చో... సత్‌సంగం విను... నీకు మేలు జరుగుతుంది...' అని చెప్పినప్పుడు ఆ వ్యక్తి శరీరంలో దాగిఉన్న మాకు మేలు జరుగుతుంది."

"నాలుగు యుగాల నుండి మగ్గుతున్న ఆ ప్రేతానికి మోక్షం ఎప్పుడు."

"నాకు మన్‌మోహన్ దొరికినట్లు దానికీ ఎవరైనా మనిషి దొరికి అతడు సంత్ ద్వారానికి చేరితే అతడి ద్వారా విముక్తి లభించాలి. లేదంటే భగవంతుడు కల్కి అవతారం ధరిస్తాడు కదా! ఆయన యొక్క కృప చేత ఇతర ప్రేతాలన్నింటికీ మేలు జరగడం తథ్యం."

"జీవులకు మేలు ఎలా జరుగుతుంది."

"జీవులకు తమ తమ సద్గురువుల ద్వారా లభించిన మంత్రాన్ని జపిస్తేనే మేలు కలుగుతుంది."

"సరే, సులేమాన్! నువ్వు యమధర్మరాజును చూశావా? అతడు ఎలా ఉన్నాడు."

"తెల్లని పాలకంటే ఇంకా తెల్లని వర్ణంలో పొడుగు గడ్డం, విశాలమైన దేహంతో ఆ యమధర్మరాజు కడు ఉదాత్తమైన వ్యక్తిత్వం గలవాడిగా కనిపించాడు. ఆయన ఎంతో కఠినంగా, వివేకధనుడిగా, తన రూపాన్ని యేథేచ్ఛగా మార్చుకోగల వాడిగా కనిపించాడు.

సరే, ఈ సామర్థ్యం దేవగణాలకు ఉంటుంది. వారు తమ రూపాన్ని ఇష్టప్రకారం మార్చుకోగలరు.

ఈ భూమిపై నివసించేవారు కూడా యోగాభ్యాసం చేస్తే ఎంతో సామర్థ్యాన్ని పొందగలరు. 'గిర్‌నార్'లోని యోగులు సింహరూపం కూడా ధరించగలరు. మామూలు మనిషికి కూడా కలలో సింహంలాగా మారినట్లు, వేరే ఎన్నో రకాలుగా మారినట్లు కనిపిస్తుంది. మీ ఆత్మలోనూ, సూక్ష్మశరీరంలోనూ అపారమైన శక్తి ఉంది. కల్పనాజగత్తులో మీరు ఎంతైనా సాధించగలరు. అదేవిధంగా దేవతలు కూడా ఖచ్చితమైన సంకల్పశక్తితో ఏదైనా చెయ్యగలరు.

"నేను చేసిన దుష్కృత్యాలకు, దుష్టకాంక్షలకు చాలా చెడ్డ ఫలితాన్ని

అనుభవించాను.” అన్నాడు సులేమాన్.

“కుంభీపాక నరకంలో ఇంకా ఏమి చూశావు?” అని అడిగితే, “భార్య ఉన్నప్పటికీ పరస్త్రీ సంగమం చేసిన పురుషులను కణకణలాడే వేడి లోహపు స్త్రీలతో ఆలింగనం చేయిస్తారు. భర్తను విడిచి పరపురుషులతో రమించిన స్త్రీలను వేడి లోహపు పురుషులతో ఆలింగనం చేయిస్తారు.”

కర్మఫలం అనుభవించకతప్పదు. కొందరు ఈ జన్మలో అనుభవిస్తారు, ఇంకొందరు రెండు జన్మల తర్వాత, మరికొంతమంది నాలుగు జన్మల తరువాత.

వేనవేల సంవత్సరాలు నరకంలో పడి మగ్గడం కంటే నాలుగైదు సంవత్సరాలు పవిత్ర జీవితం గడపడం ఎంత హితకరమైనది.

ఈ మనుష్యజన్మ నాలుగు రోడ్ల కూడలి వంటిది. ఇక్కడి నుండి అన్ని మార్గాలూ ప్రారంభమవుతాయి. సత్కర్మలు చేసి దైవత్వం పొంది స్వర్గాధికారం సాధించవచ్చు, లేక యక్ష, కిన్నర, గంధర్వాది జన్మలు పొందేలా మంచి పనులు చేయవచ్చు. లేదంటే బ్రహ్మరాక్షసుడిలా మారగల అసహ్యకరమైన కార్యాలు కూడా చెయ్యవచ్చు... ఏదైనా మీ చేతిలో పనే. జపం, ధ్యానం, భజన, సంత్-సాంగత్యం వంటివి చేసి బ్రహ్మజ్ఞానం పొంది ముక్తులుగా మారవచ్చు... ఇది కూడా మీ చేతిలోని పనే. అప్పుడిక ఏ కర్మబంధమూ మిమ్మల్ని బంధించలేదు.

❀

## చేసేటప్పుడు జాగ్రత్త!

అజ్ఞాన దశ (స్పృహలేని దశ)లో చెయ్యబడిన కర్మలు సంచితం కావు. బాల్యదశ లేక మూఢదశలో చెయ్యబడిన కర్మలు కూడా సంచితం కావు. అహంకారంలేని దశలో చేసిన కర్మలు కూడా సంచితం కావు. జ్ఞానవంతులు చేసిన కర్మలు కూడా సంచితం కావు. అదేవిధంగా ఫలితాన్ని ఆశించక చెయ్యబడిన నిష్కామకర్మలు కూడా సంచయం కావు.

ఎవరైనా చిన్నపిల్లవాడు ఆటలాడుకొంటూ ఉన్నప్పుడు తెలియక ఏ బాలుడి

కంఠాన్నైనా పిసికితే వాడిమీద సెక్షన్ 302 ప్రకారంగా పెట్టే కేసు ఉండదు. తెలివి లేని స్థితిలో ఎవరైనా మద్యపానం చేసి బూతులు తిడుతూ ఉంటే వాడిపై పరువునష్టం దావా వెయ్యడం సముచితం కాబోదు. ఎందుకంటే అతడికి కర్మ చేస్తున్న తెలివిలేదు. మత్తులో కర్తృత్వ భావన కూడా లేదు. జ్ఞానులైన మహాపురుషులు కూడా అకర్తాభావంతోనే కర్మను ఆచరిస్తారు. కాబట్టి వారికీ కర్మ బంధనాలు ఉండవు.

ఈ విధంగానే మీరు ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా అకర్తగా మారి చేస్తే గనక మీకు కూడా కర్మబంధనాలు ఉండవు. కర్తాభావన ఉన్నట్లయితే నడుస్తూ నడుస్తూ కాళ్ళక్రింద కీటకాలు పడి చచ్చినా కర్మ సంచితమవుతుంది. ఎవరికైనా నీళ్ళు త్రాగించినా లేదా ఎవరిదైనా ఏమైనా తీసుకున్నా కర్మ సంచయం జరుగుతుంది. కానీ అకర్తాభావనలో చేసిన కర్మలు బంధనానికి కారణాలు కాబోవు.

ఒకసారి బుద్ధ భగవానుడు, అతడి శిష్యులు సంచారం చేస్తూ ఎక్కడికో వెళుతున్నారు. మార్గమధ్యంలో ఒకచోట ఒకపాముని బోలెడు చీమలు పట్టుకొని కుడుతున్నాయి. పాము విలవిలలాడుతూ ఉంది.

శిష్యులు, "స్వామీ! ఇన్ని చీమలు ఆ సర్పాన్ని పట్టి కుట్టి చంపుతుండగా అంతపెద్దదైన పాము కూడా ఆ కాట్లకు తల్లడిల్లిపోతోంది. ఇది తన కర్మ ఫలాన్ని అనుభవిస్తున్నట్లేనా?" అని అడిగారు.

బుద్ధుడు: "అవును. మనం కొద్ది సంవత్సరాల క్రితం ఈ చెరువు ప్రక్కనుండి వెళుతుండగా ఒక జాలరి చేపలు పడుతున్నాడు. మనం అతడితో, "పాపకర్మలు కూడదని చెప్పాము కదా! 'కేవలం పొట్టనింపుకోవడం కోసమని జీవహింస చెయ్యవద్ద'ని చెప్పాం. కానీ అతడు మన మాట వినలేదు. ఆ అభాగ్యుడే ఈ పాము జన్మలో పుట్టాడు. అతడి ద్వారా చనిపోయిన చేపలే ఈ చీమలుగా పుట్టి ప్రతీకారం తీర్చుకొంటున్నాయి. జాలరి నిర్దోషులైన జీవులను హింసించిన ఫలితాన్నే అనుభవిస్తున్నాడు." అని చెప్పాడు.

మహాభారత యుద్ధం తరువాత ఒకసారి అత్యంత వ్యథాభరిత హృదయుడైన

ధృతరాష్ట్రుడు వేదవ్యాసులను ఇలా అడిగాడు:

"భగవాన్! ఇదేమి వైపరీత్యం. నా నూరుగురుకు నూరుగురు కొడుకులూ చనిపోయారు. అంధుడను, వృద్ధుడనూ అయిన నేను బ్రతికే ఉన్నాను. నేనీ జన్మలో అన్ని పాపాలేమీ చెయ్యలేదు. ఎంతోకొంత పూర్వపుణ్య ఫలం చేతనే నేను ఇప్పుడు రాజును అయి ఉంటాను కదా! మరి ఏ కారణం చేత నేను ఇంత ఘోరమైన దు:ఖాన్ని అనుభవిస్తున్నాను?"

వేదవ్యాసులవారు ధ్యానంలో కూర్చొని సమాధిలో లీనమైనారు. ధృతరాష్ట్రుని పూర్వజన్మ గురించి తెలుసుకొన్న తరువాత వారికి తెలిసిందేమిటంటే అతడు ముందు జింకగా, తరువాత ఏనుగుగా, తర్వాతనే రాజుగా జన్మించాడు. సమాధి నుండి లేచాక వారు ధృతరాష్ట్రునితో, "పూర్వజన్మలో నీవు ఒక రాజువు. వేటాడే నిమిత్తం అడవిలోకి వెళ్ళావు. అక్కడ జింకను చూసి దానివెనకనే పరిగెత్తావు కానీ అది నీకు చిక్కలేదు. అడవిలోనే అదృశ్యమైపోయింది. నీ అహం దెబ్బతిన్నది. కోపగించి నీవు అక్కడ మంట పెట్టావు. దానితో అక్కడ ఉన్న గడ్డి-ఎండుటాకులూ తగలబడిపోయాయి. కానీ దగ్గరలోనే ఒక రంధ్రం ఉంది. దాంట్లో పాము పిల్లలున్నాయి. అవి మంటల్లో చనిపోయాయి. ఆడపాము గుడ్డిదైపోయింది. నువ్వు ఆ జన్మలో చేసిన దానికి బదులు ఈ జన్మలో లభించింది. అందుకే నీవు అంధుడివైపోయావు. నీ నూరుగు కొడుకులూ అంతమయ్యారు." అని చెప్పారు.

❁

# ఎక్కడ ఆసక్తి ఉంటుందో అక్కడే జన్మ

ఒక బ్రాహ్మణుడు రోజూ భగవంతుని ప్రార్థించేవాడు. ఒకనాడు అతడు ప్రార్థిస్తుండగా చూసిన అతడి భార్య పెద్దగా నవ్వింది. ఆమె తనను హేళన చేస్తున్నదని బ్రాహ్మణుడికి అర్థమై 'ఎందుకు నవ్వా'వని అడిగాడు.

"మీరు రోజూ పూజలు, పారాయణాలు చేసి 'అదివ్వు-ఇదివ్వు' అని అడుగుతున్నారు. లభించినప్పటికీ ఇంకా యథాతథంగానే ఉన్నారు కదా?"

"ఎలా?"

“నేను చెప్పలేను. అదిగో, రేవు దగ్గర నీళ్ళు నింపుకొని ఒక స్త్రీ వస్తోంది కదా వెళ్ళి ఆమెనే అడుగు.”

బ్రాహ్మణుడు ఆమెను అడిగేందుకు వెళ్ళాడు. ఆమె బ్రాహ్మణుడిని చూడగానే, “మీ భార్య ఎందుకు నవ్విందని అడగడానికి వచ్చారు కదా! ఇప్పుడు నాకు ప్రసవవేదన కలుగుతోంది. ఇంటికి వెళ్ళి బిడ్డకు జన్మనిస్తుండగా మరణిస్తాను. తర్వాత పక్కన అడవిలోనే జింకగా పుడతాను. నా మెడలో వ్రేలాడుతూ ఒక స్తనం ఉంటుంది. అదే నాకు గుర్తు. మూడేళ్ళపాటు నేను ఆ జింక శరీరంలోనే ఉంటాను. తర్వాత ఇదే గ్రామంలో ఫలానా బ్రాహ్మణుని ఇంట స్త్రీగా పుడతాను. అప్పుడు మీరు నా వద్దకు వచ్చారంటే ఆ రహస్యం తెలియగలదు. ఇప్పుడే మీకా రహస్యం తెలియదు. సరే, నాకు ప్రసవం వస్తోంది. వెళతాను.” అని వెళ్ళిపోయింది.

తరువాత వాకబు చేస్తే నిజంగానే ఆమె ఒక పిల్లవాడికి జన్మనిచ్చి చనిపోయిందని తెలిసింది. ఆ బ్రాహ్మణుడికి ఆ అమ్మాయి మాటల్లో నమ్మకం కుదిరింది. కొద్దికాలం తరువాత సమీపంలోని అడవిలో వెతికిన మీదట మెడలో స్తనం ఉన్న ఒక జింక కూడా దొరికింది. మూడేళ్ళ తరువాత ఆమె పూర్వం చెప్పిన బ్రాహ్మణుని ఇంట్లోనే ఆమె స్త్రీగా జన్మించింది. ఆమెకు మాటలు రాగానే ఈ బ్రాహ్మణుడు వెళ్ళి, “గుర్తించావా?” అని అడిగాడు.

“గుర్తుపట్టాను. కానీ మీరింకా తగు సమయం కోసం నిరీక్షించాలి.” అన్నదామె.

సమయం గడిచింది. ఆమె 14-15 సంవత్సరాల కన్యగా ఎదిగింది. పెళ్ళి కూడా జరిగింది. మరునాడు బ్రాహ్మణుడు ఆమె అత్తవారింటికి పోయి, ‘క్రొత్త కోడలిని కలుసుకోవడమెలా’ అని ఆలోచించి చివరికి ‘నీళ్ళరేవు వద్దకు వస్తుంది కదా?’ అనుకొని 15-20 రోజులపాటు అక్కడే వేచి చూశాడు. ఒకరోజు సమయం చూసుకొని కోడలిని, “గుర్తించావా?” అని అడిగాడు.

“అవును, పూజించే సమయంలో ‘నాకు వ్యాపారవృద్ధి కలగాలి’, ‘నాకు శత్రునాశనం జరగాలి’, ‘భార్య బిడ్డలు క్షేమంగా ఉండాలి’ అనేటువంటి నశ్వరమైన

వస్తువులను కోరుకొన్నావు కదా! ఆ బ్రాహ్మణుడివి నీవే. అందుకే నీ భార్య నిన్ను చూసి నవ్వింది. 'నవ్వుకి కారణం నీళ్ళు తెచ్చే ఆమెను అడగమని చెప్పింది. ఆ అమ్మాయే బిడ్డకు జన్మనిచ్చి చనిపోయింది. పిమ్మట జింకగా మారింది. ఆ తర్వాత ఆమె బ్రాహ్మణకన్యగా పుట్టి, పెళ్ళి చేసుకొని ఇలా జీవితం గడుపుతోంది. మరి ఆమె ఎవరో నువ్వు గుర్తించావా?" అని అడిగిందామె.

"ఆఁ! ఆమె నువ్వే కదా?"

"సరే, మరి నన్ను పెళ్ళి చేసుకొన్న బ్రాహ్మణుడు ఎవరు?"

"అతడు పూర్వజన్మ కాక, వెనుకటి జన్మలో నీ గర్భానే పుట్టిన నీ కొడుకు కదూ! ఇప్పుడు అతడే నీ భర్తగా ఉన్నాడు."

"సరిగ్గా కనిపెట్టావు భూసురోత్తమా! అదేవిధంగా ఏదో జన్మలో నువ్వు నాకు సోదరుడివి. వేరే జన్మలో నీ భార్య నాకు చెల్లెలు. జీవుడికి ఎక్కడ ఆసక్తి ఉంటుందో, మమకారం ఉంటుందో, చనిపోయిన పిదప తిరిగి దానికి అనుగుణాంగానే శరీరం ధరించి కర్మభారాన్ని మోస్తూ తిరుగుతుంటాడు. అందుచేతనే ఏ సద్గురువు సన్నిధికైనా వెళ్ళి ఆయన చెప్పినది విని, కర్మబంధనాల నుండి తప్పించుకొనే ప్రయత్నం చెయ్యి. కర్మల విధానం బహు నిగూఢమైనది. **"గహనో కర్మణాగతి ।"**

❀

# రావణుడి కూతురి వివాహం

ఎవరైనా 'ఫలానావాడు నాకు దు:ఖం కలిగించాడ'ని చెబితే అది అతడి దుర్బుద్ధి మాత్రమే. ఎందుకంటే అభిమానపూర్వకంగా చెయ్యబడిన కర్మ అనే దారంలో జీవుడు బందీగా ఉన్నాడు. అతడు తను చేసిన కర్మఫలాలనే సుఖదు:ఖాలుగా పొందుతూ ఉంటాడు. సుఖాన్ని, దు:ఖాన్ని ఇచ్చేది వేరే ఎవరో కాదు. ప్రారబ్ధ కర్మం ఏవిధంగానూ తొలగిపోదు.

రావణుని జీవితంలోని ఒక సంఘటన:

జనక మహారాజుగారు రాత్రి మూడవ జామున సిపాయి వేషంలో తిరుగుతూ, 'నా రాజ్యంలో ఎవడు సుఖంగా ఉన్నాడు, ఎవడు దు:ఖిస్తున్నాడు?'

అనే విషయం స్వయంగా విచారిస్తూ ఉన్నాడు. సంచరిస్తూ ఉండగా ఒక చోట ఒక తల్లి-పిల్లవాడు కనిపించారు. ఆరుమాసాల ఆ బాలుడు తన తల్లి స్తనాన్ని మాటి మాటికీ నోట్లో పెట్టుకొంటున్నాడు. తల్లి విడిపిస్తుంటే ఏడుస్తున్నాడు.

బాలుడి చేస్తున్న ఈ పనిని చూస్తూ ఆ దారివెంటే వెళుతున్న ఒక పతివ్రత నవ్వింది. సిపాయి వేషంలో తిరుగుతున్న జనకుడు ఆమెను నవ్విన కారణం అడిగితే ఆమె, “నాకు ఆ తల్లీ బిడ్డల గాథ వినిపించేటంత సమయం లేదు.” అని చెప్పింది.

రాజు ‘సమయం ఎందుకులేద’ని అడిగితే ఆమె “ఈ రోజు నా జీవితంలో చివరిరోజు. నదికి వెళ్ళి స్నానంచేసి నా భర్తకోసం నీళ్ళ కుండ నింపి తెచ్చి ఇంట్లో పెట్టాలి. అప్పుడు ఇంటికప్పు నా మీద కూలి నేను చనిపోతాను. అంతిమసమయంలో కొంచెం భగవత్స్మరణ చేసుకోవడానికి వీలుగా త్వరగా వెళ్ళాలి. కానీ ఆ తల్లీ కొడుకులిద్దరూ రావణుని రాజధానిలో ‘భంగీ’జాతిలో తల్లీ-కొడుకులుగా జన్మిస్తారు. అబ్బాయి వివాహం రావణాసురుని కూతురితో జరుగుతుంది.” అని చెప్పి ముందుకు సాగింది.

జనకరాజు ఆమె వెనకగా వెళ్ళి “నేను జనకమహారాజుని. ఆ ఇంటికప్పు కూలి నీపై పడుతుందని ఎలా తెలుసు నీకు?” అని అడిగాడు.

ఆమె, “నేను పాతివ్రత్య ధర్మ ప్రభావం చేత భవిష్యత్తు సమస్తం నాకు తెలుసు.” అని చెప్పింది.

“అన్నీ తెలిస్తే మరి తప్పించుకోవచ్చు కదా! ఇంటికే వెళ్తున్నావేం?”

“విధి ప్రబలమైనది. దానిముందు నిలవడం ఎవ్వరి వశమూ కాదు.”

‘‘రాజు గానీ, మహారాజుగానీ, దేవ దానవులుగానీ, బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులుగానీ వారి వల్ల కూడా కాదా?”

“విధికి ఎదురునిలవడం ఎవరి తరమూ కాదు. ఎన్ని ఉపాయాలు చేసినా విధి జరగక మానదు. మీకేమైనా సందేహం ఉంటే చూసుకోండి రాజా! ఇక నన్ను పిలవకండి.”

రాజుకు గొప్ప ఆశ్చర్యం కలిగింది. ఆయన ఆమె వెనకగా నడుస్తూ వెళ్ళాడు. ఆమె నదిలో స్నానం చేసి కుండలో నీళ్ళు నింపుకొని ఇంటివైపు వచ్చింది. ఇంటికి వెళ్ళాక భర్త స్నానం కోసం ఆ నీళ్ళు ఇచ్చి, ఏదో పని నిమిత్తం ఇంట్లోకి వెళ్ళగానే ఆకస్మాత్తుగా ఇంటికప్పు విరిగి పడింది.' ఆమె దానిక్రింద పడి మరణించింది. జనకుడికి ఆమె చనిపోయిందని చాలా దు:ఖం కలిగింది. కానీ ప్రారబ్ధం ప్రబలమైనది కదా! సమయం చూసుకొని ఆమె చెప్పిన విషయాలు గుర్తు చేసుకొని రావణాసురుడి రాజధానికి వెళ్ళాడు.

రావణుడు జనకుడికి గొప్పగా స్వాగత సత్కారాలు చేసి ఆయన రాకకు కారణం అడిగాడు. జనకుడు ఆ పతివ్రతా స్త్రీ చెప్పిన విషయాలన్నీ చెప్పాడు. రావణాసురుడు జ్యోతిష్యగణాలను, దేవగణాలను, ఋషిగణాలను, బ్రహ్మ, శివపార్వతులను పిలిపించి అందరినీ 'ఈ విధిని మార్చగల ఉపాయం ఉంటే చెప్ప'మన్నాడు. కర్మరేఖను మార్చే సామర్థ్యం తమకు లేదని చెప్పారంతా. సూర్యభగవానుడు తూర్పున కాకుండా పడమర ఉదయించనీ, అగ్ని చల్లబడనీ, మేరుపర్వతం పడిపోనీ, రాతిపై పూలు పూయనీ. కానీ విధిని మాత్రం మార్చడం ఎవరికీ సాధ్యం కాదు. అంటే కర్మరేఖను ఎప్పటికీ మార్చలేమని భావం.

రావణాసురుడికి చాలా క్రోధం వచ్చింది. "నాకు నిజంగా కూతురే పుడితే కర్మరేఖను వ్రాసే విధాత్రితోనే పోరాడతాను." అని నిశ్చయించుకొన్నాడు. సమయం రాగానే అతడికి కూతురే జన్మించింది. ఆరవనాటి రాత్రి రావణుడు కత్తి దూసి నిలబడ్డాడు. ఇంతలో కర్మరేఖను వ్రాయడానికి విధాత్రి వచ్చింది. 'ఏం రాస్తావ'ని అడిగాడు రావణుడు.

"ముందుగా నేనూ ఏం చెప్పలేను. శిరస్సుపై కలం పెట్టిన తర్వాత అంతర్యామి ఎలా ప్రేరేపిస్తే అలాగే రాత వ్రాస్తాను. కానీ వ్రాసిన తరువాత ఏం వ్రాశానో చెప్పగలను."

"సరే, అయితే నా ముందు వ్రాయి. ఆ రాసేదేదో." అన్నాడు రావణుడు.

ఆమె కలం ఉంచీ ఉంచగానే దానంతటదే వ్రాసుకొంటూ పోయింది.

‘అదేమిటో చదివి వినిపించు.” అన్నాడు రావణుడు.

“ఈమె కడు చక్కనిది, పతివ్రత, గుణవంతురాలు, శీలవతి అవుతుంది. కానీ ఈమె పెళ్ళి మాత్రం ఒక నీచకులానికి చెందిన వాడి పుత్రుడితోనే జరుగుతుంది. అతడు నీ భవనాలను శుభ్రం చేసేవాడే.”

రావణుడికి చాలా క్రోధం కలిగింది. కానీ ‘కర్మఫలం అమోఘుమ’ని పలికి విధాత్రి అతడిని శాంతింపజేసింది.

ఆమె వెళ్ళిపోయిన తరువాత మళ్ళీ రావణుడికి ఉద్రేకం వచ్చింది. ఆరు మాసాలున్న ఆ పిల్లవాడిని రప్పించాడు. అతడిని చంపాలని నిర్ణయించాడు. కానీ ప్రజలు గగ్గోలు పెట్టారు. ‘అపరాధమేమీ చేయని ఈ బాలుడిని చంపకుండా దేశబహిష్కారం చెయ్యమన్నారు అధికారులు.

రావణుడు ఆ బాలుడిని నౌకలోకి ఎక్కించి ఏదో కీకారణ్యంలో విడిచి పెట్టి రమ్మని పంపాడు. గుర్తు కోసం వాడి కాలి వ్రేలు ఒకటి తీయించేశాడు. ఆ అడవిలో జనసంచారమే లేదు. పిల్లవాడు మరణించి ఉంటాడనే అందరూ అనుకొన్నారు. కానీ అతడికి దైవమే రక్ష!

**అరక్షితం తిష్ఠతి దైవరక్షితం సురక్షితం దైవహతం వినశ్యతి ।**
**జీవితం నాథోఽపి వనే విసర్జిత: కృతప్రయత్నోపి గృహే న జీవతి ॥**

అంటే మనిషి నిర్లక్ష్యంగా వదిలివేసినా, దైవం రక్షిస్తున్నవాడు జీవించగలడు. మనిషి ఎంత జాగ్రత్తగా రక్షించినా దైవం చేత చంపబడేవాడు బ్రతకలేడు. దైవరక్ష ఉన్న బాలుడు అడవిలోనైనా పెరుగుతాడు. కానీ దైవం కోపించిన వాడు మాత్రం ఇంట్లో ఉన్నా చనిపోతాడు.

రావణుడు ఆ బాలుని అడవిలో వదిలిపెట్టాక మూడు రోజుల పాటు ఆ బాలుడు అలాగే ఆకలితో ఉన్నాడు. తన బ్రొటనవ్రేలు చీకుతూ.

బాలుడు ఆకలితో ఉన్న విషయం బ్రహ్మలోకం దాకా వెళ్ళింది. వెంటనే బ్రహ్మ విధాత్రిని పిలిచి, ‘బాలుడికి పాలు అందేలా చూసి, సంరక్షించమ’ని ఆజ్ఞాపించాడు.

ఆ బాలుని కోసం విధాత్రి అక్కడికి వచ్చి అతడి పాలన పోషణ చక్కగా చూసేది, చక్కటి విద్య నేర్పించేది. కొన్ని రోజులకు అతడికి నీటిలో ఈదే విద్య నేర్పించి నౌకలు తయారు చేయడం తెలియజేసింది. శాస్త్ర విద్యను నేర్పింది. బాలుడు వివేకవంతుడై, ధర్మశాస్త్రం తెలుసుకొన్న అనంతరం, పద్దెనిమిదేళ్ళ ప్రాయంలో అతడిని నౌక ఎక్కించి వేరే ద్వీపానికి పంపింది విధాత్రి.

అక్కడి రాజు సంతానం లేకుండానే మరణించాడు. మంత్రులు విచారణ జరిపి, "ప్రాత:కాలాన రాజద్వారం తెరిచిన వెంటనే ముందుగా నగరంలోకి ఎవరు అడుగుపెడతారో అతడికే రాజ్యాభిషేకం జరపాలి'' అని నిర్ణయించుకొన్నారు.

దైవవశాత్తు ఆ రోజు రాజద్వారం తెరవగానే ఈ యువకుడే ముందుగా అడుగుపెట్టాడు. మంత్రులు అతడినే రాజుగా సింహాసనంపై కూర్చోబెట్టి 'దైవగతి' అని పేరుపెట్టారు. విధాత్రి నేర్పిన విద్యల కారణంగా అతడు ప్రజలను ఎంతో నైపుణ్యంగా పరిపాలించేవాడు. అతడి యశస్సు నేల నాలుగు చెరగులా వ్యాపించింది.

రావణుడికి అతడి గురించిన సమాచారం అతడి చిత్రపటంతో సహా అతి త్వరలోనే చేరింది. దైవగతి సౌందర్యం చూసి, అతడి గుణగణాలను దూతల ద్వారా విన్న రావణుడు "నా కూతురికి ఇతడితోనే పెళ్ళి జరిపించాలి" అని అనుకొన్నాడు. రావణ పుత్రిక సైతం అతడినే భర్తగా భావించుకొన్నది.

రావణుడు తన కూతురి అభీష్టం గ్రహించి మంత్రిని దైవగతి వద్దకు సందేశం నిమిత్తం పంపించాడు. కానీ దైవగతి 'వివాహం వద్ద'ని తిరస్కరించాడు. రావణుడు తన కుమార్తెను వెంట తీసుకొని అతడి వద్దకు వెళ్ళి ఇద్దరికీ తానే స్వయంగా వివాహం జరిపించాడు. ఎంతో సంతోషంగా లంకకు తిరిగి వచ్చి దేవతలందరినీ పిలిపించి, "నా కుమార్తెకు ఆ నీచకులం వాడితో పెళ్ళవుతుందని చెప్పారు కదా! రాజకుమార్తెకు అలాంటి వివాహం జరుగుతుందా?" అని ప్రశ్నించాడు.

"తమరు ఆ రోజు ఆ పిల్లవాడి కాలి వ్రేలును గుర్తుకోసం తీసివేయించారు

కదా! పరీక్ష చేయండి...” అన్నారు దేవతలు.

గుర్తును పరీక్షించగా ఆ పిల్లవాడే ‘దైవగతి’ అని తెలిసింది. అప్పుడు దేవతలు ‘కర్మరేఖను తప్పించడం మన వశం కాద’ని రావణుడికి నచ్చజెప్పారు.

# బంధుత్వాలు మృత్యువుతోనే చెల్లు...!

ఒకసారి దేవర్షి నారదుడు తుంబురినితో కలిసి వెళుతూ ఉన్నాడు. వేసవికాలపు రోజులు. ఒక కొలనులో నీరు త్రాగి రావిచెట్టు నీడలో కూర్చొన్నారు ఇద్దరూ. ఇంతలో ఒక కసాయి వాడు 25-30 మేకలను తోలుకొంటూ అటుగా పోతున్నాడు. వాటిల్లో నుండి ఒక మేక మాత్రం ఒక దుకాణంలోకి జొరబడి పెసలు తినడానికి ఉరికింది. ఆ దుకాణంపైన ‘శగాల్‌చంద్ సేఠ్’ అని వ్రాసి ఉంది. ఆ దుకాణంలో ఉన్న వ్యాపారి మేకను గమనించగానే దాని చెవులు పట్టుకొని నాలుగైదు దెబ్బలు వేశాడు. మేక ‘మే... మే...’ అంటూ ఉంటే దాని నోట్లో ఉన్న పెసలు కాస్తా క్రింద పడ్డాయి.

తరువాత ఆ వ్యాపారి మేకని కసాయికి అప్పగిస్తూ “ఈ మేకని కైమా కొట్టేటప్పుడు దీని తలను మాత్రం నాకు ఇవ్వండి. ఎందుకంటే ఇది నా పెసలు కొన్ని తినేసింది.” అన్నాడు.

దేవర్షినారదుడు ధ్యానం ద్వారా అంతా గ్రహించి పెద్దగా నవ్వాడు. తుంబురుడు ఆసక్తిగా, “గురువుగారూ! ఎందుకలా నవ్వారు? ఆ మేకని పిడిగుద్దులు గుద్దుతుంటే బాధపడ్డారు. కానీ ధ్యానం తరువాత మాత్రం నవ్వారు. ఎందుచేత? ఇందులో రహస్యమేమిటి?” అని అడిగాడు.

నారదుడు “పోనివ్వు... అదంతా కర్మఫలంలే... వదిలెయ్.”

“లేదు గురువర్యా! దయచేసి చెప్పండి.”

“ఈ దుకాణం మీద ఉన్న పేరును చూడు. ‘శగాల్ చంద్ సేఠ్’. ఆ శగాల్ చంద్ సేఠ్ ఈ మేకగా స్వయంగా వచ్చాడు. ఈ దుకాణదారుడు సేఠ్ కొడుకే.

సేఠ్ చచ్చి మేకగా పుట్టాడు. కానీ ఈ దుకాణంతో తన పాత బంధాన్ని మరువలేక పెసలు తినడానికి ఎగబడ్డాడు. కానీ ఏమయ్యింది! సొంత కొడుకే నాలుగు తగిలించి పంపాడు. ఆ 30 మేకల్లో ఏదీ ఆ దుకాణం మీదకెళ్ళలేదుగదా మరి ఇది మాత్రమే దేనికి వెళ్ళినట్లు? అని ధ్యానం చేసి చూడగా తెలిసింది ఆ పాతబంధం గురించి.

ఏ కొడుకు కోసం శగాల్‌చంద్ ఇంతగా సంపాదించాడో అదే కొడుకు కనీసం నాలుగు పెసలు కూడా తిననివ్వడం లేదు. పొరబాటున తిన్నాడే అనుకో... తండ్రి మొండెం కావాలంటున్నాడు చూడు. అందుకే కర్మగతిని, మానవమోహాన్ని చూస్తుంటే నాకు నవ్వొస్తోంది. తమ తమ కర్మఫలాలు ప్రతి ఒక్క ప్రాణీ అనుభవించక తప్పదు... ఈ జన్మలోని బంధాలు, బంధుత్వాలూ మృత్యువుతోపాటే నశించిపోతాయి. వాటివలన ఏ ప్రయోజనమూ ఉండదు." అని పలికాడు నారదుడు.

❁

## శుభకర్మలు వ్యర్థంగా పోవు

ఇది కర్మ భూమి. ఇక్కడ ఎవరు చేసిన కర్మలయినా సరే, వృథాగా పోవు.

పూర్వం ధర్మదత్తుడనే ఒక పవిత్రుడు-సదాచారుడు అయిన బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు వ్రతాలు ఉపవాసాలు దీక్షగా పాటించేవాడు. ఉచ్ఛ్వాస-నిశ్వాసాలతోనే రామనామమనే జపయజ్ఞాన్ని నిరంతరం చేసే ఆ బ్రాహ్మణుడు ఒకనాడు 'నిర్జల ఏకాదశి' (ఉపవాసం) ఉండి రెండవరోజు అంటే ద్వాదశి నాడు ఉదయాన్నే దైవపూజకోసం పూజాపళ్ళెంతో సహా గుడికి వెళుతున్నాడు. మార్గమధ్యంలో ఒక ప్రేతాత్మ భీకరమైన రాక్షసరూపం ధరించి అతడి ఎదుటకు వచ్చింది. దాన్ని చూసి ఈ బ్రాహ్మణుడు భయపడిపోయి ఆ భయంతో ఆ పూజా పళ్ళాన్ని రాక్షసిపైకి విసిరేశాడు.

కథ చెప్పేదేమిటంటే పూజా పళ్ళెంలోని తులసిదళాల స్పర్శ తగలడంతోనే ఆ ప్రేతాత్మకి పూర్వజన్మ స్మృతి కలిగింది. వెంటనే అది వణుకుతూ దూరంగా

పోయి నిలబడి, "బ్రాహ్మణుడా! నీ పూజ పళ్ళెం స్పర్శ తగులుతూనే నాకు కొంత మోక్షం కలిగింది. ఇప్పుడు నాకు పూర్వజన్మ స్ఫురణకు వస్తోంది. మీవంటి భగవత్ప్రేమికులైన భక్తజనులు నన్ను కటాక్షిస్తే నాకు మోక్షం పూర్తిగా వస్తుంది.

ఓ భూసురోత్తమా! పూర్వం నేను 'కలహ' అనే బ్రాహ్మణ స్త్రీని. నా పేరుకు తగినట్లే నా కర్మలూ ఉండేవి. నా భర్తతో ఎప్పుడూ తీవ్రంగా కలహించేదానిని. ఇది చూసి నా భర్త విసిగిపోయి, తన మిత్రుడితో నా విషయం గురించి తెలియజేస్తూ, 'నా భార్య నేనేమి చెబితే సరిగ్గా దానికి విరుద్ధంగా చేస్తుంది.' అన్నాడు. అప్పుడామిత్రుడు 'నిషేధయుక్తి' తో పని సాధించుకొనే విధానం నా భర్తకి చెప్పాడు.

వెంటనే నా భర్త ఇంటికి వచ్చి, "కలహా! నా మిత్రుడు ఉన్నాడు కదా! అతడు చాలా చెడ్డవాడు. వాడిని మనం భోజనానికి పిలవనే పిలవ కూడదు." అన్నాడు.

"లేదు, అతడు సజ్జనుడు. అతడిని ఈ రోజే భోజనానికి పిలవాలి." అన్నాను నేను.

తరువాత అతడికి భోజనం పెట్టి పంపాం.

కొద్ది రోజుల తరువాత మళ్ళీ నా భర్త అదే కిటుకును ఉపయోగిస్తూ "రేపు నా తండ్రిగారి శ్రాద్ధం. కానీ మనం ఆ శ్రాద్ధకర్మ పెట్టడం లేదు." అన్నాడు.

"నీ బ్రాహ్మణత్వాన్ని నేను గర్హిస్తున్నాను. శ్రాద్ధ కర్మని మనమే శ్రద్ధగా చెయ్యకపోతే ఇక నీ జీవితం దేనికి." అన్నాను నేను.

"సరే... మంచిది. అయితే అంతగా చదువురాని ఒక్క బ్రాహ్మణుడు చాలు." అన్నాడు నా భర్త.

నేను : "ధిక్కారం... నీకు అలాంటి బ్రాహ్మణుడు నచ్చాడా? సంయమనం కలిగి, విద్వాంసులైన వాళ్ళను పద్దెనిమిది మంది బ్రాహ్మణులను పిలుద్దాం." అన్నాను.

"సరే... అలాగే కానీ. అయితే పిండివంటలేం వద్దు. ఒట్టి పప్పుకూర చాల్లే."

నేను మాత్రం మంచి మంచి వంటకాలన్నీ చేసి పెట్టాను. ఆయన ఏది వద్దంటున్నాడో అదే నేను చేసుకువచ్చాను. ఆయన లోలోపల సంతోషిస్తున్నా, బయటకు మాత్రం నిషేధయుక్తితోనే పనిని జరుపుకొస్తున్నాడు. కానీ తరువాత మాత్రం ఆయన ఈ సంగతి మరిచిపోయి మామూలుగా "ఇదిగో, ఈ పిండాన్ని ఏదైనా మంచి పుణ్య తీర్థంలో వదిలిపెట్టి రా" అన్నాడు. నేను ఆ పిండాన్ని మురుగుకాల్వలో వదిలేసి వచ్చాను. నా భర్త దు:ఖించినా వెంటనే జాగ్రత్తపడి "ప్రియా! ఇప్పుడీ పిండాన్ని ఆ కాలువలో తీసి మళ్ళీ నదిలో వేయబోకు... అది అక్కడే ఉండనీ." అన్నాడు.

వెంటనే నేను ఆ పిండాన్ని కాలువలో నుండి తీసి నదిలో వేసి వచ్చాను.

ఈ విధంగా ఆయన ఏది చెబితే దానికి వ్యతిరేకంగా చేసేదాన్ని. ఆయన ఎంత జాగ్రత్తగా పని చేసుకువస్తున్నా నా స్వభావమే కలహపూరితం గనుక అప్పుడప్పుడూ కలహిస్తూనే ఉండేదాన్ని. నాకు సంతానం లేకపోవడం, నా కలహస్వభావం వీటి కారణంగా నా భర్త చాలా దు:ఖించాడు. సంతానం కోసం ఆయన రెండవ వివాహం చేసుకొన్నాడు.

అప్పుడు వెంటనే నేను ఉరిపోసుకొని చచ్చిపోయాను. అది కూడా నా భర్తకు చెడ్డపేరు రావాలని, ప్రజలంతా ఆయన్ని బాధపెట్టాలనే.

ఆత్మహత్య కారణంగానే నాకిప్పుడు ఈ ప్రేత జన్మ కలిగింది. నేను ఒక ఒకరి శరీరంలోకి ప్రవేశించాను కూడా... కానీ అతడు కృష్ణ-వేణి నదుల సంగమస్థానానికి వచ్చినప్పుడు శివదూతలు, విష్ణుదూతలు కలిసి నన్ను ఆ శరీరం నుండి దూరంగా పారద్రోలారు. ఇప్పుడు వేరేవాళ్ళ శరీరంలోకి వెళ్దామని బయలుదేరాను. దారిలో మీరు కనిపించారు. నేను మిమ్మల్ని భయపెట్టి మీ మనోబలాన్ని దెబ్బతీయాలనుకొన్నాను. మీ శ్వాసద్వారా దేహంలోకి ప్రవేశిద్దామని భావించాను. కానీ పవిత్ర పరమాణువులతో కూడిన ఆ పూజ పళ్ళెం - ఈ తులసి దళాల స్పర్శ తగలగానే నాకు కొంత విముక్తి కలిగింది. నా పాపాలు కొన్ని నశించాయి. అయినా నాకు పూర్తిగా సద్గతి కలగలేదు. అందుచేత నాపై దయచూపండి." అని వేడుకొన్నది.

అప్పుడు ధర్మదత్తుడు సంకల్పం చేసి, తను జన్మించిన నాటి నుండి ఆ రోజు దాకా చేసి కార్తీక వ్రతాల్లోని సగ భాగం పుణ్యాన్ని ఆ ప్రేతజన్మను పొందిన కలహకు అర్పించాడు. వెంటనే 'సుశీలుడు', 'పుణ్యశీలుడు' అనే ఇద్దరు దేవదూతలు అక్కడికి విమానంతో సహా వచ్చి ప్రేత జన్మ నుండి విముక్తురాలైన ఆ కలహను అందులో కూర్చోబెట్టి ధర్మదత్తునితో "బ్రాహ్మణోత్తమా! పరోపకార పరాయణులకు పుణ్యం ద్విగుణీకృతమవుతుంది. నీ ఇద్దరు భార్యలతోనూ ఎంతో సమయం సుఖంగా గడిపిన తరువాత నీవు విష్ణులోకాన్ని పొందుతావు. ఈ కలహ కూడా నీకు అక్కడ కనబడుతుంది. అక్కడ కూడా కొన్ని సంవత్సరాల పాటు గడిపి 'మను-శతరూపు'డనే పేరుతో అవతరించి తపస్సు చేసి భగవంతుడినే పుత్రునిగా పొందుతావు.

ఆ వరప్రసాద ఫలితంగా నీవు తరువాత దశరథు'నిగా జన్మించగలవు. నీ పుణ్యాలలో అర్థభాగం పొందిన ఈ కలహ కైకేయిగా జన్మిస్తుంది. అంతేకాదు, సాక్షాత్తు విష్ణు భగవానుడే సాకార రూపం ధరించి శ్రీరామునిగా మీ ఇంట అవతరిస్తాడు." అని చెప్పారు.

తరువాత వారిద్దరూ కలహను తమతోపాటు తీసుకువెళ్ళి పోయారు. కాలక్రమేనా వారి మాటలు అక్షరం కూడా పొల్లుపోకుండా నిజమయ్యాయి. దశరథ-కౌసల్య దంపతుల ఇంట నిర్గుణ నిరాకారుడైన భగవానుడే సగుణ సాకార రూపం దాల్చి ఈ ధరిత్రిని పావనం చేశాడు.

హరి నామానికి, హరి ధ్యానానికి ఎంత మహత్తు ఉంది. శ్వాస-శ్వాసలో ప్రభునామాన్ని జపించడం వలన ధర్మదత్తుడికి దశరథుని రూపంలో ఆ భగవంతుడికే తండ్రి కాగల గౌరవం దక్కింది. నిజమే, చేసిన శుభకర్మలు ఎన్నటికీ వ్యర్థం కావు.

జపం, ధ్యానం, స్మరణం, శుభకర్మల కారణంగా బుద్ధి స్వచ్ఛంగా మారుతుంది. స్వచ్ఛమైన బుద్ధి పరమాత్మయందే శాంతిని పొందుతుంది. మలినమైనబుద్ధి ఈ జగత్తులోనే చిక్కుకుపోతుంది.

❁

# కర్మఫలం సీతమ్మకూ తప్పలేదు

ఫలితం ఇవ్వనిదే కర్మ శాంతించదు. కర్త వెంటే తిరుగుతూ ఉంటుంది. మనిషి అనే కాదు – ఆ భగవంతుడైనా సరే మనిషి రూపంలో అవతారమెత్తితే అతడు కూడా కర్మ సిద్ధాంతాన్ని పాటించక తప్పదు.

సీతాదేవి సాక్షాత్తూ ఆ మహాలక్ష్మి అవతారమని అందరికీ తెలుసు. అయినా ఆమెకు కూడా కర్మఫలం తప్పలేదు. లోకనింద కారణంగా శ్రీరాముడు ఆమెను విడిచిపెట్టిన సమయంలో ఆమె గర్భవతి. ఆ స్థితిలో భర్త వియోగం, వనవాస దు:ఖం ఆమెకు ఎదురయ్యాయి. ఇది తన బాల్యంలో ఆమె తెలియక చేసిన ఒక అపరాధ ఫలితమే.

ఈ సందర్భంగా 'పద్మపురాణం'లో ఒక కథ వస్తుంది:

బాల్యంలో సీతాదేవి మిథిలానగరంలో చెలికత్తెలతో ఆటలాడుకుంటూ ఉన్నది. అప్పుడు ఒక చిలుకల జంట ఆమెకు కనబడింది. అవి తమలోతాము కిచకిచలాడుతూ శ్రీరామచంద్రుని గాథను పాడుతున్నవి: "భూమిపై శ్రీరాముడనే ఒక ప్రసిద్ధుడైన, సుందరుడైన రాజు పుడతాడు. అతడి యొక్క రాణి సీత పేరుతో వాసికెక్కుతుంది. శ్రీరామచంద్రుడు గొప్ప బలశాలి, బుద్ధిమంతుడు, సకల రాజులను వశం చేసుకొని సీతతో సహా పదకొండు వేల సంవత్సరాల పాటు రాజ్యం చేస్తాడు. శ్రీరాముడు ధన్యుడు. మనోహరమైన రూపంగల ఆ జానకీదేవి శ్రీ రఘునందనునితో ఆనందంగా విహరించే ఆ సీత ధన్యురాలు." అని పాడాయి. శ్రీరాముడిని తననూ కీర్తిస్తూ పాడిన ఆ గానం విన్న సీత తన చెలికత్తెలతో, "ఆ పక్షులను ఎలాగైనా పట్టుకు రండి" అని చెప్పింది.

ఆ రోజుల్లో మనుష్యులు సంకల్పం చేత అప్పుడప్పుడూ పశు–పక్ష్యాదుల భాషను సైతం తెలుసుకొని వాటితో మాట్లాడేవారు. చిలుకల మాటలు సీతకెలా తెలిశాయని సందేహించరాదు.

చెలికత్తెలు ఆ పక్షులను పట్టుకొని సీతకు తెచ్చి ఇచ్చారు. సీత వాటితో, "మీరిద్దరూ చాలా అందంగా ఉన్నారు. భయపడవద్దు, మీరెవరో, ఎక్కడి నుండి వచ్చారో నాకు చెప్పండి. రాముడు–సీత ఎవరు? వాళ్ళ సమాచారం మీకెలా

తెలుసు? నన్ను చూసి భయపడవద్దు. మిమ్మల్ని పట్టుకొని బంధించాలనేది నా ఉద్దేశ్యం కాదు. అయితే మీరు గానం చేసిన సీతారాముల గాథ నా మనస్సును హరించివేశాయి.” అని ప్రేమగా మాట్లాడిన మీదట, ఆ పక్షులు,

“దేవీ! మేము వాల్మీకి మహర్షి ఆశ్రమంలో ఉంటాము. వారు త్రికాలజ్ఞులు. ‘రామాయణం’ అనే గ్రంథాన్ని రచించారు. అందులోని కథ మా మనస్సుకు ఎంతో ప్రియం.

తనపై అన్యాయం జరిగినా పరులకు అన్యాయం చేయని శ్రీరాముని లీల, సమత్వాల గురించి విని మా చిత్తాలు ప్రసన్నమైనాయి. అందుకే మాలో మేము ఆ కథ గురించే చర్చించుకొంటున్నాం. నీవు కూడా దీనిని శ్రద్ధగా విను.

విష్ణుభగవానుడు తన తేజస్సుతో నాలుగు అంశలుగా ఈ భూమిపై అవతరిస్తాడు. రామ,లక్ష్మణ, భరత, శతృఘ్న రూపాలలో ఆయన అయోధ్యాపురిలో జన్మిస్తాడు. శ్రీరాముడు విశ్వామిత్రుని వెంట మిథిలకు వస్తాడు. అప్పుడు ఇతరులకు ఎత్తడానికైనా సాధ్యంకాని ధనస్సును ఆయన విరుస్తాడు. జనకపుత్రిక సీతను ధర్మపత్నిగా స్వీకరిస్తాడు. ఆమెతో పాటు విశాలసామ్రాజ్యాన్ని పరిపాలిస్తాడు.” అన్నాయి.

సీతాదేవి మళ్ళీ “శ్రీరామచంద్రుడు ఎలాంటివాడు? ఆయన గుణగణాలను వర్ణించండి. మనుష్యరూపంలో ఆయన దివ్యమంగళ విగ్రహం ఎలా ఉంటుంది? మీ మాటలు కడు ప్రియంగా ఉన్నాయి.” అని అడిగింది.

సీతాదేవి ప్రశ్న విన్న ఆడ చిలుకకు ఆమె సీతయేనని తెలిసిపోయింది. ఆమెను గుర్తించిన ఆడచిలుక ముందుకు వచ్చి ఆమె కాళ్ళపై పడి, “శ్రీరాముల వారి ముఖం కమల పుష్పం వలె సుందరంగా, కనులు పంకజముల శోభను పోలి ఉంటాయి. ఆయన తన శాంత సౌమ్య దృష్టితో ఎవరిని పరికించినా వారి చిత్తం ప్రసన్నంగా మారి ఆయన పట్ల ఆకర్షితమై పోతుంది. అటువంటి ఐశ్వర్య గుణశోభితుడు శ్రీరాముడు.

పరమసుందరీ! నీవెవరివి? నీవే జానకీదేవిలాగా కనిపిస్తున్నావు. అందుకే భర్త సౌందర్యం, శౌర్యం, వీరత్వాల యశోగానాన్ని మళ్ళీ మళ్ళీ ఇష్టంగా

వినాలనుకొంటున్నావు కదా?" అని అడిగింది.

సీతాదేవి ముఖం సిగ్గుతో వాలిపోయింది. తన సిగ్గును దాచుకోలేక ఆమె తీయని చిరునవ్వుతో, "చక్కగా చెప్పావు. నా మనస్సు దోచుకున్న ఆ శ్రీరాముడు ఇక్కడికి వచ్చి నన్ను చేపట్టిన తరువాతే మిమ్మల్ని వదిలిపెడతాను. మీ మాటలతో నా మనస్సులో లోభాన్ని రేకెత్తించారు. మీ ఇష్టానుసారం క్రీడిస్తూ నా మహలులోనే సుఖంగా ఉండండి. తియ్య తియ్యని పదార్థాలు తినండి." అన్నది.

సీతమాటలు విన్న ఆడచిలుక, "సాధ్వీమణీ! మేము అడవిపక్షులం చెట్లపై నివసిస్తూ, సర్వత్రా విహరిస్తూ ఉంటాం. మాకు నీ మహలులో సుఖం దొరకదు. నేను గర్భవతిని, ఇప్పుడు వాల్మీకి ఆశ్రమంలోని మా నివాసానికి వెళ్ళి బిడ్డలకు జన్మనివ్వాలి. ఆ తరువాత మీ వద్దకు వస్తాను." అంది.

సీత : "ఏమైనా సరే, నేను మిమ్మల్ని విడిచపెట్టను."

అప్పుడు మగచిలుక, "జానకీదేవీ! హఠాన్ని విడిచిపెట్టు, మమ్మల్ని పోనివ్వు." అన్నది.

"మగ చిలుకా! నువ్వు పోవచ్చు. కానీ నీ భార్యని మాత్రం వదిలేదు." అని అంది సీత.

రెండు చిలుకలూ ఏడ్చి మొత్తుకొన్నాయి. కానీ సీతాదేవి వాటిని వదిలిపెట్టలేదు.

మగచిలుక ఇదంతా చూసి చాలా దు:ఖించి, కరుణాపూరితమైన స్వరంతో, "యోగుల వాక్కు సత్యం. 'ఎవరితోనూ ఏమీ మాట్లాడరాదు. మౌనంగా ఉండాలి. లేదంటే ఉన్మత్తులు  వచనాలనే దోషం చేతనే బంధనాల పాలవుతారు.' అని చెప్పనే చెప్పారు. ఈ పర్వతంపై కూర్చొని మాట్లాడకుండా ఉంటే, మనకు ఈ బంధనాలు ప్రాప్తించేవి కావు కదా! అందుకే మౌనంగా ఉండాలి." అని అన్నది. పిమ్మట అది సీతను, "సుందరీ! నేను నా భార్య లేకుండా జీవించలేను. అందుచేత ఈమెను విడిచిపెట్టు, నా ప్రార్థన ఆలకించు." అని వేడుకొన్నది.

కానీ సీతాదేవి వినలేదు. అప్పుడు ఆడచిలుక క్రోధంతో, దు:ఖంతో వ్యాకులపడి, " ఓ సీతా! ఏ విధంగా ఇప్పుడు నీవు మా భార్యాభర్తలను

విడదీస్తున్నావో, నీవు గర్భవతిగా ఉన్నప్పుడు శ్రీరాముడికి సైతం నీవు ఇదే విధంగా దూరం అవుతావు.” అని సీతను శపించింది.

తరువాత భర్త వియోగ శోకం చేత ఆ ఆడచిలుక ప్రాణాలు వదిలింది. భార్య చనిపోగానే మగచిలుక శోకాతిరేకంతో, “నేను శ్రీరాముడి నగరమైన అయోధ్యలో మనిషిగా జన్మించి ప్రజలను తప్పుదోవ పట్టించి, ప్రజాపాలకుడైన శ్రీరాముడు ప్రజలమాట మన్నించి నిన్ను వదిలివేసేవిధంగా గొప్ప అపవాదు పుట్టిస్తాను.” అని అన్నది.

క్రోధం వలన సీతాదేవిని అవమానించినందున ఆ మగచిలుక చాకలి ఇంట మనిషిగా జన్మించింది. ఆ చాకలివాడి మాటల వల్లనే సీత నిందలపాలై నిండు గర్భిణిగా భర్త నుండి వేరయి అడవుల పాలయ్యింది.

కర్మఫలం అవతారాలకూ అనుభవించక తప్పలేదు. కర్మ ఆచరించేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉండాలో దీనిని బట్టే విశదమవుతుంది.

❀

# తిట్లు తిడుతూ కర్మఫలాన్ని తగ్గించుకుంటోంది

ఒకానొక రాజు గొప్ప ధర్మాత్ముడు. న్యాయ శీలుడు, పరమేశ్వర భక్తుడు. అతడు ఒక శ్రీకృష్ణుని మందిరాన్ని కట్టించి ఒక బ్రాహ్మణుని పూజారిగా నియమించాడు. ఆ బ్రాహ్మణుడు కూడా సదాచారవంతుడు, ధర్మాత్ముడు, నిత్యసంతోషి. అతడు రాజును ఎన్నడూ, ఏమీ ఆశించేవాడు కాదు. రాజు అతడి స్వభావానికి ఎంతో సంతోషించేవాడు.

ఆ విధంగా రాజుగారి ఆలయంలో పనిచేస్తూ ఇరవై సంవత్సరాలు గడిచిపోయాయి. అతడు ఎన్నడూ రాజుని ఏ విషయంలోనూ ప్రశ్నించలేదు.

రాజుకు ఒక కొడుకు పుట్టాడు. రాజు అతడిని పెంచి పెద్దచేసి విద్వాంసుడిగా తయారైన పిదప ఒక సౌందర్యవతి అయిన రాజకుమారితో పెళ్ళి జరిపించాడు. పెళ్ళయిన తర్వాత నవవధువును అంత:పురానికి తెచ్చుకొన్న రాత్రి రాజకుమారుడు

నిద్రపోయాడు. కానీ క్రొత్త చోటు కావడం వలన రాకుమారికి నిద్ర రాలేదు. అటూ ఇటూ తిరుగుతూ రాజమహలు సౌందర్యాన్ని పరికించసాగింది. చూస్తూ చూస్తూ తన భర్త పడక దగ్గర చూస్తే వజ్రాలు, రత్నాలు పొదిగిన పిడిగల ఒక ఖడ్గం కనిపించింది.

ఆ ఖడ్గాన్ని పరిశీలించడానికి ఒర నుండి బయటికి లాగ్గానే పదునైన మెరుపు కాంతి లాంటి పదునుగల ఆ కత్తి కంటబడడంతో భయపడి రాకుమారి తడబడింది. దానితో ఆమె చేతిలో నుండి ఖడ్గం జారి నిద్రిస్తున్న రాకుమారుడి కంఠంపైనే సరిగ్గా పడింది. వెంటనే రాకుమారుడు తల తెగి మరణించాడు. భర్త మరణానికి రాకుమారి శోకిస్తూ ఆ పరమేశ్వరునితో, "ఓ భగవంతుడా! నా వల్ల అకస్మాత్తుగా ఇంత పాపం జరిగిందేమిటి? నా చేతిలోనే నా భర్త చనిపోయాడే! నీకు అంతా తెలుసు. కానీ అందరి ఎదుట నేను నిజం చెప్పలేను. ఎందుకంటే, అలా చెబితే నా తల్లిదండ్రులకూ, అత్తమామలకూ ఘోర కళంకం తప్పదు. పైగా నా మాట ఎవ్వరూ నమ్మరు కూడాను." అని ప్రార్థించింది.

ఉదయాననే పూజారి నూతివద్దకు స్నానానికి రాగానే అతడ్ని చూసిన రాకుమారి పెద్దగా రోదించడం ప్రారంభించిది. 'నా భర్తను ఎవరో చంపారు.' అంటూ ఆమె పెడుతున్న శోకాలు విని నలుగురూ పోగయ్యారు. రాజు కూడ వచ్చి, "ఎవరు చంపారని అడుగగా, "ఎవరో నాకు తెలియదు కానీ, చంపినవాళ్ళు శ్రీకృష్ణుని ఆలయంలోనికి వెళ్ళడం మాత్రం గమనించాను." అని చెప్పింది ఆమె. అందరూ ఆలయంలోనికి వెళ్ళి చూడగా ఆ బ్రాహ్మణుడు పూజ చేస్తూ కనిపించాడు. అందరూ అతడ్ని పట్టుకొని, "ఎందుకు రాజకుమారుడ్ని చంపా"వంటూ నిలదీశారు.

"నేను రాజకుమారుడ్ని చంపడమేమిటి. రాజమందిరం ఎలా ఉంటుందో కూడా నాకు తెలియదు. భగవంతుడి సాక్షి. చూడకుండా అపరాధం మోపడం న్యాయం కాదు." అన్నాడు ఆ పూజారి.

కానీ బ్రాహ్మణుడి మాటలను ఎవరూ నమ్మలేదు. తలొక మాటా

అంటున్నారు. ఈ బ్రాహ్మణుడు నిర్దోషి' అని రాజుకు కూడా అనిపిస్తోంది. కానీ పూజారి ఏమీ మాట్లాడకపోవడం చూసి, "నీకు మరణశిక్ష విధించను. కానీ ఖడ్గాన్ని పట్టుకొని ఏ చేతితో నువ్వు నా పుత్రుడ్ని చంపావో ఆ చేతిని మాత్రం తెగనరకమని ఆజ్ఞాపిస్తున్నాను." అన్నాడు.

ఆప్రకారంగానే ఆ బ్రాహ్మణుడి చేతిని నరికివేశారు. దీనికి బ్రాహ్మణుడు చాలా దు:ఖించి రాజును అధర్మవర్తనుడిగా భావించి ఆ దేశాన్ని విడిచి పరాయి దేశానికి వెళ్ళిపోయాడు. అక్కడ ఏ అపరాధమూ లేకుండా తన చెయ్యి తెగిపోయిన కారణం తెలుసుకోవడానికి విద్వాంసుడైన ఒక జ్యోతిష్కుడి కోసం వెతకసాగాడు.

కాశీలో ఒక గొప్ప విద్వాంసుడైన జ్యోతిష్కుడు ఉన్నాడని ఎవరో ఆయనకు చెప్పారు. బ్రాహ్మణుడు ఆయన ఇంటికి వెళ్ళాడు. ఆ సమయంలో జ్యోతిష్కుడు ఎక్కడో బయటకు వెళ్ళాడు. ఇంట్లో ఉన్న అతడి భార్యను "అమ్మా! మీ భర్త అయినటువంటి జ్యోతిష్యపండితులు ఎక్కడికి వెళ్ళారు?" అని అడిగాడు.

అప్పుడు ఆమె తన నోటితో దుర్భరమైన, అసహ్యామైన దుర్భాషలు పలికింది. అది విని బ్రాహ్మణుడు మనసులోనే 'నా చెయ్యి తెగిన కారణం తర్వాత, ముందు ఈమె సంగతి కనుక్కోవాలి అనుకొన్నాడు. ఇంతలో జ్యోతిష్య పండితుడు రానే వచ్చాడు. ఆయన ఇంట ప్రవేశిస్తూనే భార్య అనేక దుర్భాషలాడి అతడిని ఛీత్కరించింది. కానీ ఆ జ్యోతిష్య పండితుడు భార్యనేమీ అనకుండా మౌనంగా ఉన్నాడు. తర్వాత తన ఆసనంపైకి వచ్చి కూర్చున్నాడు. బ్రాహ్మణుని చూసి "చెప్పండి, బ్రాహ్మణోత్తమా! ఏ పని మీద వచ్చారు?" అని అడిగాడు.

"నేను వచ్చినది నా విషయం గురించి అడగడానికే. కానీ ముందు నాకీసంగతి తేల్చి చెప్పండి. మీ భార్య మిమ్మల్ని తన నోటితో అంతగా ఎందుకు ఛీత్కరిస్తోంది? ఎవరూ సహించలేని దానిని మీరు ఎలా సహించగల్గుతున్నారు? దీనికి కారణమేమిటి?" అని అడిగాడు బ్రాహ్మణుడు.

"ఈమె నా భార్య కాదు. నా కర్మ. ప్రపంచంలో ఎవరైనా సరే అన్న, తమ్ముడు, గురువు, శిష్యులు, తండ్రి, సంబంధీకులు ఇలా ఎవరైనా సరే అంతా

మన కర్మ మాత్రమే. ఇది నా భార్య కాదు, నేను చేసుకొన్న కర్మ. ఇది అనుభవించనిదే తొలగిపోదు.

**అవశ్యమేవ భోక్తవ్యం కృతం కర్మ శుభాశుభం ।**

**నాభుక్తం క్షీయతే కర్మ కల్పకోటి శతైరపి ॥**

'మనం చేసుకొన్న కర్మలు శుభమైనా కానీ, అశుభమైనా కానీ వాటిని అవశ్యం అనుభవించక తప్పదు. అనుభవించకుండా కోటానుకోట్ల కల్పాలు గడిచినప్పటికీ కర్మ మాత్రం తీరిపోదు.'

"స్వామీ! మరి మీరేమి కర్మ ఆచరించారు?"

"వినండి. నేను పూర్వజన్మలో ఒక కాకిని. నా భార్య గాడిద. ఆ గాడిద వీపు మీద పుండు కారణంగా చాలా బాధపడేది, చిక్కిపోయింది కూడాను. అప్పుడు నా స్వభావం చాలా దుష్టమైన కారణంగా నేను ఆ పుండును ముక్కుతో పొడిచి మరింత దు:ఖం కల్గించేవాణ్ణి. బాధ కారణంగా గాడిద ఎగిరి పడితే దాని అవస్థ చూసి నేను సంతోషించేవాణ్ణి. పాపం ఆ గాడిద బయటకు కూడా వచ్చేది కాదు. కానీ నేను మాత్రం దానిని వెతికి పట్టుకొని మరీ బాధించేవాడిని. నా వల్ల ఎంతోకాలం బాధపడిన తర్వాత విసిగిపోయి ఆ గాడిద ఊరికి పది పన్నెండు మైళ్ళ దూరాన ఉన్న అడవిలోకి వెళ్ళిపోయింది. అక్కడ గంగానదీ తీరాన పచ్చటి గడ్డి మేస్తూ దట్టమైన అడవిలో నా దెబ్బల బాధ లేకుండా హాయిగా, సుఖంగా ఉండేది. కానీ నేను మాత్రం ఇది లేకుండా ఉండలేక పోయాను. దాన్నే వెతుక్కొంటూ ఆ అడవికి వెళ్ళి ఆ గాడిదని చూడగానే ఎగిరి దాని వీపుపైన ముక్కుతో పొడిచాను. ఈ సారి నా ముక్కు దాని వెన్నులో దిగబడిపోయింది. ఆ గాడిద ఎంత ప్రయత్నించినా నా ముక్కు మాత్రం ఊడిరాలేదు. నేను కూడా చాలా ప్రయత్నించాను కానీ లాభంలేకపోయింది. 'నీళ్ళ భయంతోనైనా ఈ దుష్టుడు నన్ను విడిచి వెళతాడేమో' అనుకొని గాడిద గంగానదిలో ప్రవేశించింది. కానీ, నా ముక్కు బయటకు రాలేదు. ఇది నాతో సహా ప్రవాహంలో ప్రవేశించింది. ప్రవాహం చాలా వేగంగా ఉన్న కారణంగా

మేమిద్దరం కొట్టుకుపోయి మధ్యలోనే మరణించాము. గంగానదీ ప్రభావం చేత ఆ గాడిద బ్రాహ్మణ స్త్రీగానూ, నేను గొప్ప జ్యోతదిష్కుడిగానూ జన్మించాము. ఇప్పుడు అదే నా భార్య. ఆమె ఆజన్మ పర్యంతం తన నోటితో తిట్ల వర్షం కురిపిస్తూ నన్ను దు:ఖపెడుతుంది. నేను కూడా ఇది పూర్వ కర్మ ఫలితంగానే భావించి, సహిస్తూ ఉంటాను. ఆమెను దూషించను. ఎందుకంటే ఇదంతా చేసుకొన్న కర్మల ఫలితమే కదా! అందుకే నేను శాంతంగా ఉంటాను. ఇప్పుడు మీ ప్రశ్న ఏమిటో అడగండి.” అన్నాడు జ్యోతిష్కుడు.

బ్రాహ్మణుడు తన సంగతి అంతా చెప్పుకొని “ఆ రాజు నిరపరాధినైన నా చెయ్యి ఎందుకు అధర్మంగా తెగవేయించాడు.” అని అడిగాడు. జ్యోతిష్కుడు “మీ చేయి తెగవేసింది రాజుకాదు. మీ కర్మ.” అన్నాడు.

“ఏవిధంగా?”

“పూర్వజన్మలో మీరు ఒక తాపసి. ఆ రాజకుమార్తె గోవు. ఆ రాజకుమారుడు కసాయివాడు. వాడు ఆ గోవును చంపడానికి వెంటపడితే పాపం అది ప్రాణం దక్కించుకోవడానికి మీ ముందు నుండే అడవిలోకి పరిగెత్తింది. దాని వెనక ఆ కసాయివాడు కూడా పరిగెత్తుకొంటూ వచ్చి, ‘ఇటుగా ఏదైనా ఆవు వెళ్ళిందా’ అని అడిగాడు. మీరు ‘అబద్ధమాడన’ని ఒట్టు పెట్టుకొన్నారు. అందుచేత ఆ ఆవు ఎటు వెళ్ళిందో అటువైపుగా మీ చేతితోనే సైగ చేసి చూపించారు. ఆ కసాయివాడు వెళ్ళి ఆవుని చంపాడు. గంగానది ఒడ్డున వాడు దాని చర్మం వొలుస్తుండగా అడవిలోని నుండి ఒక సింహం వచ్చి గోవును, కసాయివాడిని ఇద్దరినీ తిని, గంగ ఒడ్డునే ఆ ఎముకలను వదిలివేసింది. అది వర్షాకాలం కావడంతో వర్షం కురవగానే గంగానది పొంగడంతో ఎముకలు అందులో కొట్టుకుపోయాయి. గంగానదీ పుణ్యప్రభావం చేత కసాయికి రాజకుమారుడి జన్మ, గోవుకి రాజకుమార్తె జన్మ లభించాయి. పూర్వజన్మలో చేసిన ఆ కర్మయే ఒకరాత్రికి వీరిద్దరినీ దగ్గర చేర్చింది. కసాయివాడు కొడవలితో ఆవును చంపాడు. ఈ కారణంగా ఆ రాజకన్య చేతిలో నుండి అనుకోకుండా కత్తి జారిపడి అతడి

శిరస్సు తెగిపడి మరణించాడు. ఈ విధంగా తన ఫలితాన్ని చూపించి, కర్మ నివృత్తి అయ్యింది. మీరు చేతితో సైగచేసి చేసుకొన్న పాపకర్మ వలన ఆ చెయ్యి తెగిపడింది. ఇందులో దోషం మీదే. ఇతరులది కాదు, ఇలా భావించుకొని సుఖంగా ఉండండి.” అని చెప్పాడు జ్యోతిష్కుడు.

ఆహా! జ్ఞానయుక్తమైన జీవితం ఎంత సహజమైనది. మనం ఈ కర్మ సిద్ధాంతాన్ని నమ్మి, ఆచరిస్తే అంత్యంత ఘోరమైన పురాకృత కర్మఫలాన్ని అనుభవిసూ్తా కూడా మనం దు:ఖించము. మన చిత్త సమతుల్యతను పోగొట్టుకోము. ఈ సమతుల్య అభ్యాసాన్నే శ్రీకృష్ణ పరమాత్మ ‘సమత్వయోగం’ అని సంబోధించాడు. ఇందులో దృఢమైన స్థితి లభించిన వెంటనే మానవుడు కర్మబంధనం నుండి విముక్తిని పొందుతాడు.

❁

# కర్మ విధానం

శుభకర్మగానీ, అశుభకర్మగానీ కర్మఫలం అందరూ అనుభవించి తీరాలి.

మహాభారతయుద్ధం తరువాత జరిగిన సంఘటన ఇది:

భీష్మపితామహుడు అంపశయ్యపై పడుకొని ఉన్నాడు. ధర్మరాజు చింతాక్రాంతుడై, శోకవిహ్వాలుడై ఉండడం చూసి శ్రీకృష్ణుడు అతడిని భీష్ములవారి చెంతకు తీసుకువెళ్ళి, “పితామహా! యుద్ధం ముగిసిన తర్వాత ధర్మరాజు శోకగ్రస్తుడైపోయాడు. అందుచేత ఇతడికి మీరే ధర్మోపదేశం చేసి శోకాన్ని నివృత్తి చెయ్యండి.” అని చెప్పాడు.

భీష్ములవారు, “నీవు చెబితే తప్పక ఉపదేశిస్తాను. కానీ కేశవా! ముందు నా సందేహం తీర్చు. శుభ, అశుభ కర్మలు ఏవైనా ఫలితం అనుభవించక తప్పదని నాకు తెలుసు. కానీ నేను ఈ జన్మలో ఎటువంటి పాపమూ చెయ్యలేదు. అలాగే గడిచిన 72 జన్మలలోనూ ఇలా అంపశయ్యపై పరుండదగినంత ఘోర కృత్యమేదీ చెయ్యలేదే.” అని అడిగారు.

అప్పుడు శ్రీకృష్ణుడు, "పితామహా! 72 జన్మల దాకా చూశారు కానీ, మరొక్క జన్మను గమనిస్తే మీకే తెలిసేది. క్రిందటి 73వ జన్మలో మీరు ఒక మర్రి ఆకుపై కూర్చున్న ఆకుపచ్చని మిడతను పట్టుకొని దాన్ని తుమ్మముళ్ళతో పొడిచారు కదా? కర్మ విధానాన్ని అనుసరించి అవే ముళ్ళు నేడు బాణాల రూపంగా వచ్చాయి." అని పలికాడు.

అందుచేత కర్మ ఫలాన్ని కర్త అనుభవించాలి. తప్పదు. కర్మ చేసేటప్పుడు జాగ్రత్తగానూ, కర్మఫలాన్ని అనుభవించేటప్పుడు సంతోషంగానూ ఉండాలి. భగవతార్పితమైన మనస్సుతో చెయ్యబడిన కర్మ అంతరంగాన్ని శుద్ధి చేస్తుంది. ఆత్మానుభవం చేత కర్త యొక్క కర్తృత్వ భావన బ్రహ్మలో లయమై తనకు తానుగా కర్మబంధనం నుండి విముక్తి చెందుతాడు. అతడినే 'ఆత్మముక్తుడు' అంటారు. అందుచేత కర్త బుద్ధిని భగవతార్పణం గావించి కర్తృత్వ భావనను విడిచిపెడుతూ పోవాలి. కర్మల చేతనే కర్మలను ఖండిస్తూ పోవాలి.

'శ్రీమద్భగవద్గీత'లో శ్రీకృష్ణభగవానుడు ఇలా అంటాడు:

**కర్మహైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయ: ।**
**లోకసంగహమేవాపి సంపశ్యన్కర్తుమర్హసి ॥**

'సనకాది ఋషులు ఆసక్తిరహితమైన కర్మచేతనే పరమసిద్ధిని పొందారు. అందుచేత, ఇంకా లోకహితాన్ని దృష్టిలో ఉంచుకొని నీవు కూడా కర్మ చేయుటకే అర్హుడవై ఉన్నావు. అనగా నీవు కర్మ చెయ్యడమే సముచితం.' **(గీత: 3.20)**

కర్మచేసే ముందు ఉత్సాహం కలుగుతుంది. కర్మ ఆచరించే వేళ పురుషార్థం జరుగుతుంది. కర్మాంతాన దాని ఫలితం లభిస్తుంది. స్థూలదృష్టికి ఆ కర్మఫలం కాలాంతరంలో కలిగినట్టు కనిపించినా, సూక్ష్మదృష్టికి మాత్రం కర్మ చేసిన వెంటనే ఆ ఫలం హృదయంలో ప్రతిఫలిస్తుంది.

ధనం-పదవి-ప్రతిష్ఠలు పొంది మీ స్వార్థం గురించే ఆలోచిస్తూ మోసాలు, కపటాలు, అన్యాయాలు చేస్తూ సుఖంగా ఉండాలనుకొంటే ఎన్నటికీ సుఖంగా ఉండలేరు. ఎందుకంటే తప్పుడు పని చేస్తే మీ అంతరాత్మే మిమ్మల్ని నిందిస్తుంది.

హృదయంలో అశాంతి నిండుతుంది. మీ ధనం, పదవీ ప్రతిష్ఠలను ఇతరుల మేలు కొరకు ఉపయోగిస్తూ, లభించిన అధికారాన్ని భగవత్ జనుల సేవలో వినియోగిస్తే, హృదయంలో శాంతి ప్రతిఫలిస్తుంది. అందుకే శ్రీకృష్ణపరమాత్మ అంటాడు:

**తస్మాదసక్త: సతతం కార్యం కర్మ సమాచర ।**
**అసక్తో హ్యాచరన్కర్మ పరమాప్నోతి పూరుష: ॥**

'నీవు నిరంతరం ఆసక్తి రహితుడవై కర్తవ్యకర్మలను చక్కగా ఆచరింపుము. ఎందుకనగా ఆసక్తిని వీడి, కర్మలను సదా ఆచరించు మనుష్యునకు ఆ పరమాత్మ ప్రాప్తి కలుగుతుంది.' **(గీత : 3.19)**

కర్మసిద్ధాంతాన్ని ఎరిగి చక్కని పద్ధతిలో కర్మ ఆచరించే వ్యక్తి జనన-మరణ చక్రం నుండి విముక్తి చెందుతాడు. కానీ సరిగ్గా కర్మ చెయ్యడం తెలియనివాడు జనన-మరణ చక్రంలో పడి నలుగుతాడు.

సరిగ్గా బండి నడపడంరాని వాడిని నమ్ముకొని ఎవరైనా యాత్ర చేస్తారా? ఆ యాత్ర సఫలమవుతుందా? స్టీరింగ్ పట్టుకోలేక, బ్రేకు-క్లచ్చి సరిగ్గా ఉపయోగించలేక, యాక్సిలేటర్‌ని నియంత్రించలేనివాడు గమ్యానికెలా చేరగలడు? వాడి కారణంగా బండి దేనికైనా గుద్దుకోవచ్చు లేదా ఏదైనా గుంటలో పడవచ్చు. అదే విధంగా మీ మనస్సు అనే డ్రైవరు కర్మ అనే సాధనాన్ని ఉపయోగించడం తెలుసుకొంటే, మీ జీవితాన్ని సాయంకాలమయ్యేలోపుగానే ఈ జీవన ప్రదాత వద్దకు చేర్చగలడు. లేదంటే ఎక్కడో అక్కడ ఢీకొట్టి జనన-మరణాలు అనే గుంటలో పడేస్తాడు. ఇక రెండు కాళ్ళ, నాలుగు కాళ్ళ, పదికాళ్ళ శరీరాలలోగానీ లేదా కాళ్ళే లేని పాము-వానపాము శరీరాలలోగానీ, నౌకరుల ఇంటగానీ, సేఠ్‌ల ఇంటగానీ ఎలా జన్మిస్తారో తెలియదు. సేఠ్ ఇంట జన్మించనీ, నౌకరు ఇంట జన్మించనీ, పశుగర్భంలో పడనీ, పక్షిగా జన్మించనీ. అంటే జన్మించవలసే ఉంటుంది కదా!

**జన్మదు:ఖం జరాదు:ఖం జాయదు:ఖం పున: పున: ।**
**అంతకాలే మహాదు:ఖం తస్మాద్ జాగ్రహి జాగ్రహి ॥**

మాటిమాటికీ జన్మించడం, మరణించడం మహాదు:ఖదాయకం. మనిషి జన్మ అనేది ఒక గొప్ప అవకాశం. ఎందుకంటే ఈ మహాదు:ఖం నుండి తప్పించుకొనే అదృష్టం మనిషికే లభిస్తుంది. మీరే మీ వివేకాన్ని సద్వినియోగం చేసుకొని మీ సత్ అనుభవాలను గౌరవించి సత్పురుషుల, సత్‌శాస్త్రాల మార్గదర్శనం పొంది మీ జీవితాన్ని సఫలీకృతం చేసుకోవాలి.

ఏ కర్మ చేసినా సరే, ఉత్సాహంగా తత్పరతతో, కౌశల్యంతో చేయాలి. **'యోగ: కర్మసుకౌశలం.'** ఏ పనీ చిన్నది కాదు. ఏ పనీ పెద్దది కాదు. పరిణామాన్ని లెక్కించక ఉత్సాహం, ధైర్యం, కౌశల్యంతో చేసిన కర్మ సఫలమవుతుంది.

అతడు ఒకవేళ నిష్ఫలమైనా సరే, నిరాశ చెందడు, నిస్పృహకు లోనుకాడు, వైఫల్యాన్ని ఏరిపారేసి తత్పరతతో తన ఉద్దేశ్యాన్ని నెరవేరుస్తాడు. జపం, ధ్యానం, భగవత్ ప్రీతికై చేసే కర్మ ఇవి సర్వోత్తమమైన కర్మలు.

'శ్రీమద్భగవద్గీత'లో శ్రీకృష్ణభగవానుడు అర్జునునితో కూడా ఇదే విషయం చెప్పాడు.

**యోగస్థ: కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।**
**సిద్ధ్యసిద్ధ్యో: సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥**

'ఓ ధనుంజయా! యోగస్థితుడవై ఆసక్తి విడిచి సిద్ధి-అసిద్ధి ఎడల సమాన భావం గల బుద్ధితో కర్తవ్య కర్మలను ఆచరింపుము. ఆ సమత్వ భావమునే యోగమందురు.'

ఒకసారి శ్రీరామకృష్ణ పరమహంస యొక్క శిష్యుడు దుకాణం నుండి ఏవో కూరగాయలు తీసుకువచ్చి పొరపాటున రెండుపైసలు ఎక్కువ ఇచ్చి తెచ్చాడు. రామకృష్ణులవారు సమాధి నుండి లేచి శిష్యునితో, "వంకాయలు ఎంతకు తెచ్చావు?" అన్నారు.

"స్వామీ! శేరు రెండు అణాలకు తెచ్చాను."

"మూర్ఖుడా! ఒకటిన్నర అణాల సరుకుకు ఇంత ఎక్కువ పెట్టావా? కూరగాయలు కూడా సరిగ్గా కొనలేనివాడివి పరమాత్మను ఎలా తెలుసుకోగలుగు తావు?" అన్నారాయన.

ఇక్కడ సమస్య డబ్బుది కాదు. ఎక్కడా, ఏ పనిలోనూ పొరబాటు చెయ్యరాదనే ఉద్దేశ్యంతోనే వారు శిష్యుడిని మందలించారు.

ఊడ్చేటప్పుడు ఎక్కడైనా కొంచెం చెత్త మిగిలిపోతే దానికి కూడా "సరిగ్గా ఇల్లు ఊడ్చి, వాకిలి శుభ్రం చెయ్యలేని వాడివి నీ హృదయాన్ని ఎలా శుద్ధి చేసుకోగలుగుతావు? ఎలా పవిత్రం చేసుకోగలుగుతావు?" అని అనేవారు.

కౌశల్యపూరితంగా కర్మ చేయడం చూడా యోగమే. ఎప్పుడు ఏ కర్మ చేసినా పూర్తి వివేకంతో, తత్పరతతో చేయాలి.

సిపాయివైతే సిపాయి డ్యూటీ బాగా తత్పరతతో చెయ్యాలి. యజమానివి అయితే ఆ పదవిని సద్వినియోగం చేసుకొని అందరికీ మేలు కలిగించే కర్మలు చెయ్యాలి. శ్రోత అయితే విన్న మాటలన్నీ మీవిగా మారాలి. వక్త అయితే పరమాత్మతో కూడిన వాణి మీదై, పరులకు మేలు జరగాలి. పూజారివైతే ఎలా పూజ చెయ్యాలంటే ఆ పూజ చేస్తూ మిమ్మల్ని మీరు మరచిపోయి చివరికి పూజ మాత్రమే మిగిలిపోవాలి.

నేడు ఎంతోమంది పూజారి, సాధువు, భక్తుడు ఇలా ఎన్నో వేషాలు కడతారు. 'పూజిస్తున్నామ'నీ, 'భక్తి'గా ఉన్నామ'నీ అనుకొంటారు. అలా చేస్తూ వారు తమ సహజమైన కర్తవ్యకర్మ నుండి పారిపోవాలనుకొని పలాయనవాదులుగా మారిపోతారు. నిజమైన భక్తుడు సోమరిగా, మూర్ఖుడిగా, పలాయనవాదిగా మారడు. అతడు కర్మనే పూజగా భావించి ఎటువంటి భావంతో కర్మ చేస్తాడంటే ఆ కర్మయే భక్తిగా మారిపోతుంది. భక్తి పేరిట పని నుండి తప్పించుకొని, ఒళ్ళు దాచుకోవాలని చూసేవాడు మూఢుడు. అటువంటి వాళ్ళ కోసమే శ్రీకృష్ణభగవానుడు :

**కర్మేంద్రియాణ్ణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।**
**ఇంద్రియార్థాన్విమూఢాత్మా మిథ్యాచార: స ఉచ్యతే ॥**

'మూఢబుద్ధిగల మనిషి సమస్త ఇంద్రియాలనూ నిగ్రహించి, పైపైన వాటిని అణుచుకొని మనస్సుతో మాత్రం ఆ ఇంద్రియ విషయాలనే చింతన చేస్తాడు.

వాడు 'మిథ్యాచారి' అనగా 'దంభి' అని పిలువబడతాడు.'

అటువంటి మిథ్యాచారపరుల జీవితం తమకేగాక సమాజానికి సైతం భారమైపోతుంది. మన దేశంలోని ప్రజలు 'గీత'లోని ఈ దివ్యజ్ఞానాన్ని మరిచిపోయినప్పటినుండే కర్మలో నిర్లక్ష్యం, పలాయనవాదం, సోమరితనం, భ్రాంతి వంటి కొరతలు వచ్చి చేరాయి. దేశపతనానికి కారణాలయ్యాయి. పరాయి దేశస్తులకు భగవద్గీత జ్ఞానం లేకపోవచ్చు, కానీ వారిలో ఉన్న సద్గుణమేమిటంటే వారు ఎప్పుడు ఏపని చేస్తే, ఆ పనిలో పూర్తిగా మనసుపెట్టి, తదేక దీక్ష, తత్పరతతో, ఆసక్తితో పనిచేస్తారు. పాశ్చాత్య సంస్కృతి కంటే మన సంస్కృతి గొప్పది, దివ్యమైనది. నిజమే, కానీ కేవలం ఆ గొప్పదనాన్ని, దివ్యత్వాన్ని కీర్తిస్తూ కూర్చొంటే సరిపోదు. 'రేపు–మాపు' అని వాయిదావేస్తూ పనిచెడగొట్టుకొనే అలవాటును శీఘ్రంగా విడిచిపెట్టాలి. భగవద్గీత–జ్ఞానాన్ని తిరిగి ఆచరణలోకి తీసుకురావాలి. శ్రీకృష్ణభగవానుడు చెబుతున్నాడు:

**యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున ।**
**కర్మేంద్రియైః కర్మయోగమసక్తః స విశిష్యతే ॥**

'అర్జునా! ఏ పురుషుడు మనస్సుతో ఇంద్రియాలను వశపరచుకొని, అనాసక్తుడై సమస్త ఇంద్రియాల ద్వారా కర్మయోగాన్ని ఆచరిస్తాడో అతడు శ్రేష్ఠుడు.'

**(గీత: 3.7)**

❁

ఎవరు చూసినా - చూడకపోయినా - మనల్ని ప్రతిక్షణం చూసేవాడు ఒకడున్నాడు - ఆయన వద్ద మన పాప పుణ్యాలూ, సమస్త కర్మల లెక్కలు అన్నీ ఉన్నాయి. ఈ ప్రపంచంలోని ప్రభుత్వం చేతి నుండి తప్పించుకోవచ్చు గానీ ఆ ప్రభుత్వం నుండి నేటి వరకు ఎవ్వడూ తప్పించుకోలేక పోయాడు - ఇక ముందు కూడా ఎవడూ తప్పించుకోలేడు. ఏ విధమైన సిఫార్సు - లేదా లంచం అక్కడ పని చేయవు. ఆయనను తప్పించుకునే మార్గమేమీ లేదు. కర్మ చేయడంలో మనిషి స్వతంత్రుడే. కానీ ఆ కర్మ ఫలం అనుభవించడంలో మాత్రం కాదు.

కష్టాలు సహించి చేసిన తపం సుఖ-శాంతులకు కారణం అవుతుంది ॥
"నవ్వుతూ చేసిన పాపం ఏడుస్తూ అనుభవించాల్సి ఉంటుంది ।

అందుచేత ఓ మనిషీ! కర్మ చేయడంలో జాగ్రత్తగా ఉండు. కర్మ చేయండి కానీ - కర్మ యందు ఆసక్తి, కర్మ ఫలం - ఈ రెంటినీ విడిచిపెడితే బుద్ధి స్వచ్ఛంగా - సాత్త్వికంగా మారుతుంది. ఆ స్వచ్ఛమైన బుద్ధిలోనే పరమాత్మ సంబంధమైన జిజ్ఞాస ఉత్పన్నమవుతుంది. ఇక అప్పుడు సన్యాసికి - యోగికి లభించే ఆత్మ - పరమాత్మ అనుభవమే నీకు కూడా కలుగుతుంది. నీవు సైతం 'ఆత్మవిముక్తుడివి' కాగలుగుతావు.

- పూజ్యులు సంత్ శ్రీ ఆశారామ్‌జీ బాపూగారు